

తమ్మిలేరు పంట కాలువకు గండి

తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక ఆరో డివిజన్‌లో బగ్గయ్యపేట వద్ద తమ్మిలేరు వరద ఉధృతి అధికంగా రావడంతో తమ్మిలేరు పంట కాలువకు గండి పడి బయ్యగూడెం, బాలాజీనగర్, సుంకరవారి తోటలు నీట మునిగాయి. దీంతో అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి హుటాహుటిన అక్కడకు చేరుకుని నివారణ చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం తూర్పు లాకులు, పడమర లాకుల గేట్లను ఎత్తించి వరద ఉధృతిని తగ్గించేలా చేసి గండిని పూడ్చివేశారు.



నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బడేటి

ఉద్యమాలే ఊపిరిగా..



కార్మికుల హక్కుల కోసం సిఐటియు అలుపెరగని పోరాటం
అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల సమ్మె సంచలనం
ప్రమాదాల్లో మృతి చెందిన కార్మిక కుటుంబాల పక్షాన పోరాడి సాయం అందజేత
నేటి నుంచి రెండు రోజులపాటు నూజివీడులో సిఐటియు 13వ జిల్లా మహాసభ
హాజరు కానున్న రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలే ఊపిరిగా సిఐటియు (సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ముందుకు సాగుతోంది. గడిచిన మూడేళ్లలో సిఐటియు ఆధ్వర్యంలో సాగిన పోరాటాలు, సమ్మెలు, కార్మికుల పక్షాన నిలవడమే దానికి నిదర్శనం. మూడేళ్ల పని తీరును అవలోకనం చేసుకుని రాబోయే రోజుల్లో ఏవిధంగా ముందుకే సాగాలనే ఉద్యమ ప్రణాళికలు రూపొందించుకునేందుకు శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు నూజివీడు పివిఎస్‌ఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరగనున్న సిఐటియు 13 జిల్లా మహాసభ అందుకు వేదిక కానుంది. ఈ నేపథ్యంలో గడిచిన మూడేళ్లలో సాగించిన పోరాటాలు, ఫలితాలు వంటివాటిని ఒక్కసారి పరిశీలిస్తే కార్మికుల పక్షాన సిఐటియు నిర్వహించిన పాత్ర స్పష్టంగా తెలుస్తోంది. 2022 నవంబర్‌లో సిఐటియు జిల్లా మహాసభ ఏలూరులో జరిగింది. ఈ కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు సాగాయి. జిల్లాలోని కార్మికులు, స్కీమ్ వర్కర్లు ఒక్కతాటిపై సాగించిన పోరాటాలతో ప్రభుత్వాలు దిగొచ్చాయి. ముఖ్యంగా అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సాగించిన సమ్మె పెను సంచలనం కల్గించాయంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో 4,150 మంది అంగన్వాడీలు 42 రోజులపాటు సాగించిన నిరవధిక సమ్మె గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అత్యవసర సర్వీసుల చట్టం ఎస్మాను ఉద్యోగులపై అప్పటి వైసిపి ప్రభుత్వం ప్రయోగించింది. 2024 జనవరి మూడో తేదీన కలెక్టరేట్ వద్ద బైఠాయింపు కార్యక్రమాన్ని నిరోధించేందుకు పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించినా 3,500 మందికిపైగా అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకుని పోరాటం సాగించారు. 2024లో జరిగిన ఎన్నికల్లో అంగన్‌వాడీల సమ్మె ప్రభావం ప్రభుత్వ మార్పునకు కారణమైందంటే ఏమాత్రం సందేహం లేదనే చెప్పాలి. 16 రోజులపాటు సాగిన మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా విజయవంతంగా సాగింది. దాదాపు 300 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు 22 రోజులపాటు సమ్మె నిర్వహించడంలోనూ విజయం సాధించిన పరిస్థితి ఉంది. ఉద్యోగులను తొలగిస్తామని చెప్పి టెర్మినేషన్ ఆర్డర్ ఇచ్చిన ఉద్యోగులు ఏమాత్రం బెదరకుండా నిలబడ్డారు. చింతలపూడి మండలం సీతానగరంలో గోద్రెజ్ పామాయిల్ పరిశ్రమ కార్మికులతో 2023లో ఫిబ్రవరిలో యూనియన్ ఏర్పాటు చేయగా యాజమాన్యం కక్షతో ఏడుగురు నాయకులను మిజోరాం రాష్ట్రానికి బదిలీ చేసింది. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ సాగించిన సమ్మెతో యాజమాన్యం దిగొచ్చి బదిలీలను రద్దు చేశారు. యూనియన్ రిజిస్ట్రేషన్ సైతం పూర్తవ్వడం, వేతన ఒప్పందం చేయడం జరిగింది.



మహాసభలకు ముస్తాబైన నూజివీడులోని పివిఎస్‌ఆర్ కళ్యాణ మండపం

కార్మికుల కుటుంబాలకు అండగా సిఐటియు

ఈ కాలంలో ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలబడుతూ సిఐటియు సాగించిన పోరాటంతో యాజమాన్యాలు దిగొచ్చి నష్టపరిహారం అందించాయి. ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడు సుగుణ చికెన్ ఫీడ్ ప్లాంట్‌లో 2024 జులైలో ప్రమాదం జరిగి బీహార్‌కు చెందిన కార్మికుడు ధర్మేంద్ర మృతి చెందారు. న్యాయం చేయాలంటూ సిఐటియు పోరాడి రూ.15 లక్షలకుపైగా పరిహారం అందేలా చేశారు. నెక్కలగొల్లగూడెం కుశలవ పరిశ్రమలో కార్మికుడు కె.శ్రీనివాస్ మృతి చెందగా రూ.40 లక్షలు పరిహారం అందేలా సిఐటియు పోరాటం సాగించింది. ముదినేపల్లి మండలం చిగురుకోటలోని పరిశ్రమలో పని చేస్తూ అనారోగ్యానికి గురై మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.ఏడు లక్షల పరిహారం ఇచ్చేలా సిఐటియు పోరాడింది. జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీనివాస సామిల్లులో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కార్మిక కుటుంబానికి రూ.ఐదు లక్షల నష్ట పరిహారం అందేలా కృషి చేసింది. ద్వారకాతిరుమల మండలం గోపాలపురం సర్వారాయ కోకోకోలా ఫ్యాక్టరీలో వేతనాలు పెంచాలని కోరినందుకు 20 మంది డ్రైవర్లను అన్యాయంగా తొలగించగా సిఐటియు పోరాటంతో వారిని విధుల్లోకి తీసుకునేలా చేసింది. నూజివీడు మండలం గొల్లపల్లి పామాయిల్ తోటలో కరెంట్ షాక్‌తో కార్మికుడు జె.రంగారావు మృతి చెందగా రూ.పది లక్షలు పరిహారం అందేలా సిఐటియు కృషి చేసింది. నిడమర్రు మండలం బువనపల్లికి చెందిన వలపు పుల్లయ్య ఐస్‌ఫ్యాక్టరీలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం అందేలా సిఐటియు పోరు సాగించింది. ఇలా ఈ మూడేళ్ల కాలంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి కార్మికులకు అండగా సిఐటియు నిలిచింది.

భవిష్యత్తు ప్రణాళికలపై చర్చ, నూతన కార్యవర్గ ఎన్నిక

రెండు రోజులపాటు జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలో గడిచిన మూడేళ్లలో నిర్వహించిన పోరాటాలపై చర్చతోపాటు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించనుంది. ఈ మహాసభకు దాదాపు 250 మంది ప్రతినిధులు పాల్గొనున్నారు. ఆఖరిరోజు ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరగనుంది.

తొలిసారి నూజివీడులో..

నూజివీడు టౌన్: సిఐటియు ఏలూరు జిల్లా 13వ మహాసభ నూజివీడు పట్టణంలో తొలిసారి నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిఐటియు ఏర్పడిన 55 సంవత్సరాల కాలంలో తొలిసారి నూజివీడు పట్టణంలో జిల్లా మహాసభ జరుగుతుందన్నారు. స్థానిక పివిఎస్‌ఆర్ ఆర్యవైశ్య కళ్యాణమండపంలో శని, ఆదివారాల్లో జరిగే జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు హాజరు కాబోతున్నారని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పెద గాంధీ బొమ్మ సెంటర్ నుండి ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్ హాజరవుతారన్నారు. సమావేశంలో నాయకులు జి.రాజు, ఎన్.హనుమానులు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఆయుధ డిపో

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్
నేవీ ఆయుధ డిపోపై అధికారులతో సమీక్ష
గ్రామసభలు పెట్టి అపోహలు తొలగిస్తామని వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వెనుకబడ్డ మారుమూల ప్రాంతాలు కూడా పట్టణాలతో సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో పట్టుబట్టి పోలవరం ప్రాంతానికి నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టును తీసుకొస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సంబంధించి ఎంపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ, విశాఖ తీర ప్రాంతం ఇక్కడికి దగ్గరగా ఉండటం వల్ల కేంద్రం తమ ప్రతిపాదనను ఆమోదించిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, అపోహలు వీడి స్థానిక ప్రజలంతా సహకరించాలన్నారు. దాదాపు రూ.2500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు వల్ల ఎన్నో ఉద్యోగాలు, స్థానికులకు ఉపాధి లభిస్తాయన్నారు. వైజాగ్‌లో కూడా ఇటువంటి తరహా ప్రాజెక్ట్ ఉందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రారంభంలో 500 నుంచి వెయ్యి మందికి, భవిష్యత్తులో రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రెండు వేల మంది నేవీ సిబ్బంది ఇక్కడ పని చేస్తారని అధికారులు చెప్పారని, స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, హోటళ్లు వంటివి రావడంతో భవిష్యత్తులో ఇక్కడ ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు పది వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్రీయ విద్యాలయం' కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తారని నేవీ అధికారులు చెప్పారన్నారు. విశాఖతో సహా దేశంలో అనేక ఆయుధ డిపోలు ఉన్నాయని ఇప్పటి వరకూ ఎటువంటి ప్రమాద ఘటనలూ జరగలేదని ఎంపీ వివరించారు. నేవీ ప్రాజెక్టుకు భూమి కేటాయించే ప్రాంతంలో 400 నుంచి 500 ఇళ్లు ఉన్నాయని, వారికి వేరేచోట వసతి కల్పిస్తారని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.470 కోట్లు కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టును కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని, రూ.రెండువేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు వెళ్లిపోతే పోలవరం నియోజవర్గ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ నిర్వాసితులకు పూర్తి న్యాయం చేశాకే పనులు ప్రారంభిస్తారని, త్వరలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అంగీకారం తీసుకుంటామని తెలిపారు. గతంలో అక్కడి ప్రజలు ఆయుధ డిపో వద్దని గ్రామసభలో తీర్మానించడం, డిపోపై పునరాలోచన చేస్తామని ఆయన జారీ చేసిన ప్రకటన గురించి మీడియా ప్రశ్నించగా మరోసారి ప్రజల అనుమతితో ముందుకు సాగుతామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

నేవీ ఆయుధ డిపో ఏర్పాటు యత్నాలు తగవు

గ్రామ సభ తీర్మానాన్ని పట్టించుకోరా
ఎంపీ మాటెందుకు మార్చారు?
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఆయుధ కర్మాగార విషయంలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, నేవీ అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో చేసిన ప్రకటనను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో రూ.రెండు వేల కోట్లతో నేవీ విభాగానికి అవసరమైన ఆయుధాల డిపోను ఏర్పాటు చేస్తామని ఎంపీ ప్రకటించడాన్ని ఖండించారు. ఈ పరిశ్రమను అక్కడి ప్రజలంతా మాకొద్దని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మూడుసార్లు గ్రామసభ జరిగినా ప్రజలు ఏకగ్రీవంగా తిరస్కరించారని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా కమిటీ ఆధ్వర్యంలో జరిగే గ్రామసభ తిరస్కరించినప్పుడు దాన్ని కాదని ఎలా పెడతారని ప్రశ్నించారు. ఆ సమయంలో ప్రజల మనోభావాలకు విరుద్ధంగా పరిశ్రమ పెట్టబోనని ఎంపి ప్రకటించిన విషయాన్ని గుర్తుకు తెచ్చారు. ఇప్పుడు మళ్లీ మాట ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. ఈ డిపో వల్ల వంకావారిగూడెం పంచాయతీలోని ఆరు గ్రామాలకు చెందిన మూడువేల మంది ప్రజలు నిర్వాసితులవుతారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలపై నిఘా ఏర్పడి వారు స్వేచ్ఛ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులైన లక్ష కుటుంబాల్లో కేవలం పదివేల కుటుంబాలకూ పూర్తిస్థాయిలో ఇప్పటికీ పునరావాసం కల్పించలేదని గుర్తు చేశారు. జాతీయ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆయుధ పరిశ్రమ విషయంలో నేవీ అధికారులు అక్కడి ప్రజలను పట్టించుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. డిపో ప్రతిపాదిత ప్రాంతంలోనే పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించారని, మళ్లీ వీరిని ఎక్కడికి పంపుతారని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టు, జల్లేరు రిజర్వాయర్, అభయారణ్యం, బొగ్గు గనుల పేరుతో అడవి బిడ్డలను ఆ ప్రాంతం నుండి దూరం చేస్తున్నారని, వారి బతుకుల్ని నాశనం చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. గ్రామ సభల తీర్మానం అంటే అది సుప్రీంకోర్టు తీర్మానంతో సమానం అనే విషయం వీరికి తెలియకపోవడం దురదృష్టకర మని పేర్కొన్నారు. మొండిగా ఈ విషయంలో ముందుకెళ్తే భవిష్యత్తులో రాజ్యాంగ, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. వైసిపి హయాంలో ఈ పరిశ్రమ నెలకొల్పాలనుకున్నప్పుడు టిడిపి, జనసేన నేతలు తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేస్తూ ద్వంద వైఖరి వీడాలని సూచించారు. దీనిపై రాష్ట్రపతి, గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

రోడ్లు అధ్వానం.. చెత్త పారిశుధ్యం

ప్రొటోకాల్ పాటించడం లేదని గగ్గోలు
ఇసుక, మట్టి వంటి తవ్వకాలపై అధికారుల నిలదీత
పించన్ల తొలగింపుపైనా తీవ్ర అసహనం
జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాల్లో జెడ్‌పిటిసిలు
హాజరుకాని ఎంఎల్‌ఎలు
నిబంధనలకు విరుద్ధంగా సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ భర్త గంటా ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎక్కడ చూసినా రోడ్లు గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయని, గ్రామాల్లో పారిశుధ్యం చెత్తగా ఉందని జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాల్లో జెడ్‌పిటిసిలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జెడ్‌పి ఏడు స్థాయి సంఘాల సమావేశాలు శుక్రవారం జరిగాయి. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, జెడ్‌పిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశాలకు ఒక్క ఎంఎల్‌ఎ సైతం హాజరుకాకపోవడం గమనార్హం. స్థాయి సంఘాల సమావేశాల్లో జెడ్‌పిటిసి సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఏలూరు శివారు వంగాయగూడెం రోడ్డు అధ్వానంగా తయారైందని, పనులు ఎందుకు జరగడం లేదని నిలదీశారు. జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డుపైనా సభ్యులు ప్రశ్నించారు. జిల్లాలో రోడ్లు గోతులు పడి అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారిందని, అధికారులు పట్టించుకోవడం లేదని పంచాయతీ అధికారిపై మండిపడ్డారు. పారిశుధ్యం సమస్యలు పరిష్కరించాలని, వర్షాకాలం కావడంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. స్మార్ట్ కార్డుల పంపిణీతోపాటు జెడ్‌పి నిధులతో చేసిన పనులకు సైతం జెడ్‌పిటిసిలను పిలవడం లేదని, ప్రొటోకాల్ పాటించకపోవడంపై అంతా అధికారులను నిలదీశారు. పోలవరం కుడి కాల్వతోపాటు పలుచోట్ల జరుగుతున్న ఇసుక, మట్టి వంటి మైనింగ్ అక్రమ తవ్వకాలపై సభ్యులు ప్రశ్నలు సంధించారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగుల పింఛన్ల తొలగింపుపైనా సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అర్హులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. స్థాయి సంఘాల సమావేశాలు ఈసారి హాట్‌హాట్‌గా సాగాయి.



జెడ్‌పి స్థాయి సంఘ సమావేశాల్లో ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ పక్కనే ఆమె భర్త గంటా ప్రసాద్

నిబంధనలకు విరుద్ధంగా సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ భర్త గంటా ప్రసాద్

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ భర్త గంటా ప్రసాద్ నిబంధనలకు విరుద్ధంగా జెడ్‌పి స్థాయి సంఘాల సమావేశాల్లో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఆయన జెడ్‌పిటిసి కాదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధీ కాదు. అయినప్పటికీ ఆయన అధికారిక సమావేశాల్లో ఏ హోదాలో పాల్గొన్నారో అర్థం కావడం లేదు. సమావేశాల్లో అన్నీ తానై నడిపించిన పరిస్థితి ఉంది. జిల్లా పరిషత్ అధికారులు నిబంధనలు సైతం సరిగా అమలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు 3వ జాతీయ లోక్‌అదాలత్

ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు
జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 13న నిర్వహించనున్న మూడో జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 34 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామని, కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి ఎక్కువ మొత్తంలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 4,802 పెండింగ్ కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామని, 2225 ప్రీ లిటిగేషన్ కేసులను గుర్తించామని తెలిపారు. గత జాతీయ లోక్ అదాలత్‌లో 6325 పెండింగు కేసులను, 141 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మరిన్ని కేసుల పరిష్కారానికి కృషి చేసి, సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు కోనె సీతారాం మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేస్తున్నారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ కక్షిదారుల సౌకర్యార్థం అన్ని కోర్టుల పరిధిలో తగినన్ని బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యక్షంగా హాజరు కాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు.



బైక్ ఆవిష్కరిస్తున్న రంగనాయకులు

హోండా షైన్100 డిఎక్స్ బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పొల్యూషన్ కంట్రోల్ చేస్తూ పలు కంపెనీలు కొత్త వాహనాలను తయారు చేస్తున్నాయని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్.రంగనాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెంలోని పవన్ హోండా షోరూమ్‌లో కంపెనీ నూతనంగా లాంచ్ చేసిన షైన్100 డిఎక్స్ ద్విచక్ర వాహనాన్ని షోరూమ్ యజమాని చిన్ని హరీష్ గుప్తాతో కలిసి రంగనాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వారికే కాకుండా అన్ని తరగతుల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని విధాలుగా ఉపయోగపడుతూ ఎక్కువ మైలేజీ ఇచ్చే వాహనమన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత సీతారాం ఏచూరి

సిపిఎం జిల్లా నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్
పలుచోట్ల ప్రథమ వర్ధంతి సభలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సీతారాం ఏచూరి స్ఫూర్తి ప్రదాత అనిసిపిఎం జిల్లా నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఏచూరి భారత దేశంలోని కమ్యూనిస్టులతో పాటు వామపక్ష ప్రజాస్వామ్య లౌకిక శక్తులందరికీ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. శ్రామిక ప్రజలందరి ఐక్యత కోసం ఆయన కృషి చిరస్థాయిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎంఆర్.హనుమాన్లు, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : సీతారామ్ ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజు నైతిక విలువలకు కట్టుబడి ప్రజల క్షేమమే ధ్యేయంగా పని చేశారని, దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు అన్నారు. కీర్తిశేషులు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజు(ఆర్ఎస్) వర్ధంతి సభను స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శుక్రవారం ఎస్.సూర్యకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు మాట్లాడుతూ మత భావజాలంతో పరిపాలన సాగిస్తున్న శక్తులపై లౌకిక శక్తులను ఏకం చేయడానికి ఏచూరి ఎనలేని కృషి చేశారన్నారు. దాని ఫలితంగానే భారతదేశంలో ఇండియా కూటమి ఉద్భవించిందన్నారు. వీరు ఇరువురు నిరంతరం ప్రజలు, కార్మికుల సమస్యలపై చట్టసభల్లో గళమెత్తిన వ్యక్తులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, మహిళా సంఘం నాయకులు నత్త వెంకటేశ్వరరావు, ఆర్‌విఎస్.నారాయణ, డి.సత్యనారాయణ, ఎం.వరలక్ష్మి, కె.అనురాధ, పి.గోప లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...

నిడమర్రు : మండలంలోని భువనపల్లిలో సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు సిపిఎం జాతీయ మాజీ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు ఏచూరి సీతారాం ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలు మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ సీతారాం ఏచూరి పేదల, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమించారన్నారు. ఆయన ఆశయాలను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కానూరు రాజు, సంకు నాగశ్రీను, లావేటి సోంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవగాహన, జాగ్రత్తలతో ఎయిడ్స్ నివారణ

డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అవగాహన, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం పిలుపునిచ్చారు. స్థానిక వట్లూరు సిఆర్ఆర్ మహిళా కళాశాల నుండి శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన యూత్ ఫెస్ట్ 2025-26, ఐఇసి మారథాన్-5కె రెడ్ రన్ ర్యాలీని, ఎర్ర బెలూన్లు ఎగరేసి, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం, సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్‌రావు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ జిల్లా కలెక్టరేట్ వద్ద నుంచి ఇండోర్ స్టేడియం వరకూ సాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ నివారణ ద్వారానే ఎయిడ్స్‌ను సమాజం నుంచి తరిమివేయగలమన్నారు. జిల్లాలో హెచ్‌ఐవి కేసులు పెరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడానికి, యువతకు ఈ వ్యాధి నివారణపై అవగాహన కల్పించడానికి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మద్దతుగా నిలవడానికి మారథాన్ 5కె రెడ్‌రన్‌ను నిర్వహించామని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దని, ప్రేమ ఆప్యాయతలను పంచాలని అన్నారు. మిగిలిన వ్యాధుల వలె ఇదీ ఒక వ్యాధి అని తెలిపారు. రక్త మార్పిడి, శస్త్ర చికిత్సల సమయంలో ఎయిడ్స్ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించడానికి సంచార సమీకృత సలహా, పరీక్ష కేంద్రం (మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్) ఈ మొబైల్ వ్యాన్ ద్వారా హెచ్‌ఐవి అధికంగా ఉన్న ప్రాంతాల్లో హెచ్‌ఐవి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. హెచ్‌ఐవి సంబంధిత సమాచారం కోసం జాతీయ హెల్ప్‌లైను నెంబరు 1097ను సంప్రదించాలని కోరారు. సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెచ్‌ఐవి, ఎయిడ్స్, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి దేహదారుఢ్యం కోసం వ్యాధి నిరోధక శక్తి పెంపుదల కోసం ప్రతిరోజూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ కొంతసేపు వ్యాయామం చేసి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో ఆర్ఐఒ ప్రభాకర్, దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.ఆదిలింగం, దిశ క్లినికల్ సర్వేలెన్స్ ఆఫీసర్ హరినాథ్‌కుమార్, ప్రోగ్రామ్ అసిస్టెంటు ఎస్.విజయలక్ష్మి, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు, రెడ్‌క్రాస్, నర్సింగ్ విద్యార్థులు, ఎన్‌జిఒ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అమృత

వృద్ధుల చట్టాల అమలుకు కృషి

ఎఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వృద్ధుల చట్టాల అమలుకు పోలీసులు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు ఎఎస్‌పిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వృద్ధుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ వృద్ధుల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు చట్టప్రకారం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎన్ఆర్ఐలో గ్రాడ్యుయేషన్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు



గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న విద్యార్థి

స్థానిక ఎన్ఆర్.పేట విజేత ఫంక్షన్ హాలులో డిగ్రీ మూడేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన కొత్త విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించుకుంటూనే కొత్త విద్యార్థులకు ఫ్రెషర్స్ డే ద్వారా ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులు కళాశాలలో మూడేళ్లు చదివి విజ్ఞానాన్ని, విలువలను నేర్చుకున్న తర్వాత ఇప్పుడు కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారని, ఉద్యోగాల్లో, ఉన్నత విద్యలో లేదా వ్యాపార రంగంలో ఎక్కడికి వెళ్లినా విద్య, ఇక్కడ పొందిన శిక్షణే మార్గదర్శకం అవుతుందని చెప్పారు. కళాశాల ప్రతిష్టను సమాజంలో వెలుగిందించేందుకు స్ఫూర్తిదాయక ఉదాహరణలు కావాలన్నారు. కొత్త విద్యార్థులు మన కళాశాల కుటుంబంలో చేరినందుకు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపల్ సిహెచ్ఎన్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య నేర్చుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

పెద్ద సంఖ్యలో కంప్యూటర్ కోర్సులను నేర్చుకోవడం అభినందనీయమని, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం 1180 మందికి కంప్యూటర్ శిక్షణ ఇచ్చినందుకు అభినందనలు అని సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం పవర్‌పేట అన్నే భవనంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రం 35వ బ్యాచ్‌కు సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎంఎస్ఎన్.లక్ష్మి స్వాగతం పలికారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. అతిథులుగా సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్.కస్తూరిరావు, పి.ఆంజనేయులు, మేతరాజబాబు, కొమ్మోజు శ్రీనివాసరావు, వై.నిర్మల పాల్గొన్నారు. అనంతరం విజ్ఞాన కేంద్ర కంప్యూటర్ శిక్షణ 35వ బ్యాచ్‌లోని 25 మందికి కెఎస్.ప్రభాకర్, గుడిపాటి నరసింహారావు అతిథుల చేతుల మీదుగా కోర్సు సర్టిఫికెట్లను అందించారు.

జిల్లా స్థాయి పోటీల్లో దుర్గామాధురిశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో కొయ్యలగూడెం విఎస్ఎన్ జూనియర్ కళాశాలలో ఎంపిసి చదువుతున్న దుర్గామాధురి శ్రీ ప్రతిభ కనబర్చింది. పెదవేగి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన దుర్గామాధురిశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం గర్వకారణమని అధ్యాపక బృందం తెలిపింది. విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

పోతునూరు సొసైటీ ఛైర్‌పర్సన్‌గా గాంధీ

ప్రజాశక్తి - చింతలపూడి



మండలంలోని పోతునూరు సొసైటీ ఛైర్‌పర్సన్‌గా జనసేన నాయకులు శీతాల శ్రీమన్నారాయణ గాంధీ రఘురామ కంభంపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందిస్తామన్నారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఎఎంసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలో నాలుగు సొసైటీలకు మూడు టిడిపికి, ఒకటి జనసేన పార్టీకి కేటాయింపులయ్యాయి. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

తిరుమలాపురం సొసైటీ అధ్యక్షులుగా వరప్రసాద్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



మండలంలోని తిరుమలాపురం సొసైటీ అధ్యక్షులుగా తిరుమలాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు బల్లె రామచంద్ర వరప్రసాద్ (పండు)కు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇవ్వడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ తాను రుణపడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌కు పార్టీ పెద్దలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

13న జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం కేంద్రంగా పని చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు గుండె వైద్య పరీక్షలు చేసేందుకు వేగవరం వద్ద ఉన్న డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ముందుకు వచ్చారు. జర్నలిస్టు కుటుంబాలకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు, బిపి, షుగర్, కన్సల్టేషన్, ఇసిజి, 2డి ఎకో ఉచితంగా చేసేందుకు డాక్టర్ ఎస్.వేణు అంగీకరించారని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వారు తెలిపారు. ఈ నెల 13వ తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు డాక్టర్ వేణు హాస్పిటల్ వద్ద జర్నలిస్టుల గుండె వైద్య శిబిరం డిఎస్‌పి యు.రవిచంద్ర ప్రారంభిస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని జంగారెడ్డిగూడెం కేంద్రంగా పని చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వినియోగించుకోవాలని కోరారు.

వరి తెగులుపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల, కొత్త పట్టిసీమలో వరి పొలాలను పోలవరం మండల వ్యవసాయాధికారి కె.రాంబాబుతో కలిసి ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కె.ఫణికుమార్ మాట్లాడి వరి పొలంలో ఆశించే ఎండాకు తెగులు, ఉల్లికోడు, ఆకు నల్లి తెగులుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ వినయ్‌కుమార్, సెక్రటరీ విజయకుమారి, గ్రామ వ్యవసాయ సిబ్బంది మౌనిక, కృష్ణ, గూటాల, కొత్త పట్టిసీమ రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం సెక్షన్ పరిధిలోని టి.గంగన్నగూడెం గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు మాయం చేసినట్లు ఎలక్ట్రికల్ ఎఇ కె.నాగశేషు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టి.గంగన్నగూడెం గ్రామంలోని రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో వ్యవసాయానికి సంబంధించి 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలీని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు అపహరించుకుపోయినట్లు ఉదయం విద్యుత్ శాఖ సిబ్బంది గుర్తించారు. దీంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహశీల్దార్‌కు మండల శాఖ అధ్యక్షులు ఐవి.రత్నం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి యుఎన్‌వి.రాజు మాట్లాడుతూ తక్షణమే పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు మాట్లాడుతూ సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. డిఆర్‌పి నాగేశ్వరరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు వివి.ప్రసాద్, కె.సుబ్బారావు, రామిరెడ్డి, హరినాగ్ విలియమ్స్ రామకృష్ణ, ధర్మరాజు, లలితా దేవి, సుభాషిణి, సాయిశ్రీ, ఉషా, తదితరులు పాల్గొన్నారు.

ఆటో, మోటార్ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నికలకు ముందు అధికారంలోకి రావటానికి కూటమి నాయకులు ఆటో, మోటార్ కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యువి), జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వలే ఆటో మోటార్ కార్మికు లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న జరిగే చలో విజయ వాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు గూడ్స్ షెడ్ ఆటో కార్మిక సంఘం ప్రెసిడెంట్ పి.మహేష్, సెక్రటరీ కె.శివ, కమిటీ సభ్యులు బి.మురళి, ఆర్.పూర్ణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్నను విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు, చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, నాయకులు ఆయనతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

రూ.4 లక్షల విలువైన ఎల్ఒసి అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామానికి చెందిన నిట్ట సుబ్బారావు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.నాలుగు లక్షల విలువైన ఎల్ఒసిని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అందించారు. నల్లజర్లలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నిట్ట సుబ్బారావు భార్యకు ఎల్ఒసిని అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి ద్వారకాతిరుమల మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్, తిరుమలంపాలెం సొసైటీ ఛైర్మన్ మాసిరెడ్డి హరిబాబు, జనసేన సిహెచ్.పోతేపల్లి గ్రామ అధ్యక్షులు గాజుల గణేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కృష్ణారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో సొసైటీ ప్రెసిడెంట్ కొణతాల ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పోలవరం తహశీల్దార్ సాయిరాజు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, జనసేన మండలాధ్యక్షులు గుణపర్తి చిన్ని పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను, సొసైటీ వారిని, వైద్యులను అభినందించారు. సొసైటీ ప్రెసిడెంట్ కొణతాల ప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో సుమారు 150 మంది వరకు కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు వెంకట్రావు, మిరియాల చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హామీలు నెరవేర్చండి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్ కోరారు. ముదినేపల్లిలో మండల బాధ్యులు అంబటి కృపాకర్, దందే వెంకటరత్నం ఆధ్వర్యంలో తాలూకా కేంద్రంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిపిఎస్ వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు విడుదల చేయాలని, అసెస్‌మెంట్ బుక్ విధానాలను రద్దు చేయాలని కోరారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ టి.నారాయణదాసు మాట్లాడుతూ న్యాయబద్ధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ అనుకూలంగా రావాల్సినవి అమలు పరచాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జాన్సన్‌బాబు, చక్రధర్, శ్రీనివాస్, శ్రీహరి, రమేష్, అరుణకుమారి, పుష్పవతి, వెంకటలక్ష్మి, రవినాథ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది కోరారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సర్వేలు ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రత్యేక ఇంక్రిమెంట్లు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం కమిషనర్‌కు అందించారు.

భీమడోలు : గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవికి వినతిపత్రాలు అందించారు. అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బంటుమిల్లి కెనడీ ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మండల పరిషత్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. గడువులోగా సమస్యలు పరిష్కారం కాకుంటే అసోసియేషన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

15న చలో విజయవాడ

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా అధ్యక్షులు యర్ర రాంబాబు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏలూరు శనివారపుపేట బ్రిడ్జి సెంటర్, వంగూరు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గతంలో సంక్షేమ బోర్డు పథకాలను రద్దు చేస్తూ ఇచ్చిన మెమోను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిలో వేలాది నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురజా సాంబశివరావు, వాసా సాయి, అయినపర్తి మాధవ, కందుల సంతోష్, జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్.కొండలరావు పిలుపునిచ్చారు. మండలంలోని ములగలంపల్లిలో ధర్నాకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న పథకాలను అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలోని కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు మండలం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణ, కుటుంబరావు, రాంబాబు, మస్తాన్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్ఒబిల పనులు త్వరగా చేపట్టాలి : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేంద్రం ఇటీవల మంజూరు చేసిన ఆర్ఒబిల పనులు త్వరగా మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చెప్పారు. కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమావేశం ఆయన ధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, దెందులూరు, కైకలూరు ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాసరావు, ఇతర అధికారులు హాజరయ్యారు. కేంద్ర నిధులతో జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని ప్రజా ప్రతినిధులకు అధికారులు వివరించారు. జంగారెడ్డిగూడెం - ఏలూరు రోడ్డు అధ్వానంగా ఉందని, అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఎంపీ మహేష్ కుమార్ కోరారు. ఈ మార్గంలో కొత్త జాతీయ రహదారి ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడుతున్నట్లు ఎంపీ తెలిపారు. దెందులూరు రహదారి పనులు కూడా వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో అనేక చోట్ల కాంట్రాక్టరు చేపట్టిన రోడ్లు, ఇతర పనులను చేయడంలో జాప్యం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ సహా, కేంద్ర నిధులను, పథకాలను సమర్ధవంతంగా ఉపయోగించుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయుల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులను తీర్చిదిద్దరంతో పాటు, వారు ఉన్నత స్థానాలకు చేరేందుకు, భావి భారత ఉత్తమ పౌరులుగా తయారయ్యేందుకు ఉపాధ్యాయులు అందిస్తున్న సహాయ, సహకారాలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పూళ్ల, ఎంఎం.పురం గ్రామాలకు చెందిన పుప్పాల మోహన సీతారామయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమడోలు మండల స్థాయిలో శుక్రవారం గురు పూజోత్స వాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్‌తో పాటు ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమడోలు మండల విద్యాధికారులతో పాటు తొమ్మిది మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు, మండల పరిషత్ పాఠశాలలకు చెందిన పదిమంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరిని ఎంపీ, ఎంఎల్ఎ ఇతర ప్రముఖులు తగు రీతిలో సత్కరించారు.

దాతకు ప్రత్యేక సన్మానం

భీమడోలు మండల వనరుల కేంద్రం ఇటీవల కాలంలో శిథిలావస్థకు చేరింది. ప్రయివేట్ విద్యా సంస్థల కు చెందిన ప్రతినిధి, భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ పైకప్పు ఏర్పాటు చేయించారు. రవీంద్ర కుమార్‌ను సన్మానించారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు

మండల పశువైద్యాధికారి కె.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పశువులకు గాలికుంటు టీకాలు వేయించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని మండల పశు వైద్యాధికారి కె.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశువైద్య శాల వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 15 పంచాయతీల పరిధిలో 21651 గేదెలు, 5100 ఆవులు ఉన్నాయని తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అక్టోబర్ 15 తేదీ వరకు గాలికుంటు టీకాలు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు.

నూజివీడు టౌన్ : ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా ఉచిత టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ జి.రమేష్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో కరపత్రాన్ని సబ్ కలెక్టర్ బి.వినూత్న శుక్రవారం ఆవిష్కరించారు. రైతు సోదరులు, పశుపోషకులు తమ పశువులను సమయానికి తీసుకొచ్చి ఈ ఉచిత టీకా కార్యక్రమంలో తప్పక పాల్గొని లబ్ధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరుకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ నీరు

ముసునూరు : వేంపాడు మేజర్ కాలువ ద్వారా నాగార్జున సాగర్ ఎడమ కాలువ నీరు ముసునూరులోకి ప్రవేశించాయి. మండలంలోని నేలపాటి వారికుంట వేంపాడు మేజర్ కాలు వ ద్వారా ముసునూరు గ్రామంలోని నగరాల చెరువు, నల చెరువులకు నీరు చేరేవరకు పార్టీ గ్రామ అధ్యక్షులు గార్ల పాటి నరసింహారావు తమ సొంత ఖర్చులతో పొక్లెయిన్ ద్వారా సబ్ సెక్షన్ కాలువలో ఉన్న జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.

రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలో స్థానిక ఆరు, 13వ డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న నూతన రహదారుల నిర్మాణ పనులను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అధికారులతో మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు, మహిళలు ఎంఎల్ఎకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాలనలో రహదారులు అస్తవ్యస్తంగా, గుంతల మయంగా మారిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర కాలంలో నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇదే క్రమంలో మరిన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, ఎఎంసి మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా సక్రమంగా అందించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

రైతులకు యూరియా సరిపడా అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాగేంద్రరావు మా ట్లాడారు. మండలంలోని రైతులకు యూరియా సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంట ఎదుగుదలకు అవసరమైన యూరియా లేకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే సమస్య పరిష్కరించి రైతులకు యూరియా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని చేసి నాలుగు నెలలవుతున్నా ఇప్పటివరకు బిల్లులు ఇవ్వకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక్కో పంచాయతీలో నాలుగు నుంచి ఆరు వారాలు వేతనాలు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి బకాయి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బి.శ్రీను, యర్నం సాయికిరణ్, పులదాసు రమేష్, పాల్గొన్నారు.

యుటిఎఫ్ రణభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్ : విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక విద్యా సంబంధమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపియుటిఎఫ్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు రణభేరి కార్యక్ర మానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. దీనిలో భాగంగా యుటిఎఫ్ నూజివీడు మండల శాఖ ఆధ్వర్యంలో పోతురెడ్డిపల్లి జెడ్‌పిహెచ్ఎస్‌లో రణభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి బత్తుల అనురాధ, మండలాధ్యక్షులు బొద్దుకోళ్ల బాబూ రావు, ప్రధాన కార్యదర్శి మల్లెల చెన్నకేశవరావు పాల్గొన్నారు.

'బిసిలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బిసిలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్నేపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘ నాయకులు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్నేపల్లి తిరుపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు బిసిలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని కోరారు. చట్టసభల్లో 33 శాతం స్థానిక సంస్థలు- నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ వర్క్స్‌లలో 34 శాతం ఇస్తామని ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసిన వారిలో పైడి వెంకట్రావు, సురేష్, ఏసు, పాపారావు, శ్రీను, పి.వెంకటేష్, కె.మనోజ్ పాల్గొన్నారు.

రెండు సొసైటీలకు కమిటీల నియామకం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జీలుగుమిల్లి, ములగలంపల్లి సొసైటీలకు సంబంధించి ఛైర్‌పర్సన్ల నియామకానికి సంబంధించి కోపరేటివ్ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ములగలంపల్లి సొసైటీ ఛైర్మన్‌గా గంగిరెడ్డి రాఘవయ్య, సభ్యులుగా పిన్నమనేని శ్రీను, అక్కిరెడ్డి ప్రభాకరరావు నియమితులయ్యారు. జీలుగుమిల్లి సొసైటీకి సంబంధించి సరిపల్లి సత్యనారాయణరాజు, సభ్యులుగా వనమా వెంకటేశ్వరరావు, వెలగల అజయ్ నియమితులయ్యారు.

యూరియాను మితంగా వాడాలి

ప్రజాశక్తి - ముసునూరు

యూరియా అధికంగా వాడడం వల్ల వరి పంటకు తెగుళ్ల ఆశించి దిగుబడి తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి అక్కినేని చాముండేశ్వరి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని చింతలవల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీలో రైతులకు యూరియా వాడకం ఏ పంటకు ఎలా వినియోగించాలో రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా వాడకంపై కూడా అవగాహన కల్పించారు. క్రిమిసంహారక, రసాయనిక ఎరువులు అధికంగా వాడి ఆ పంట ఆహారంగా తీసుకుంటే అనారోగ్య కారణానికి గురవుతారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ బర్మా రమేష్, సొసైటీ కార్యదర్శి కె.ప్రసాదరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

జిపిడిపిపై రెండు రోజుల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, ఎఎన్ఎంలకు, మహిళా పోలీస్ సిబ్బందికి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జిపిడిపి)పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపిఆర్‌సి జిల్లా అధికారి ప్రసంగరాజు పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తే ప్రజలందరూ ప్రయోజనం పొందుతారన్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, వాసు, సాయిబాబు, అజయ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ
ప్రత్యేక అనుబంధం
పశ్చిమగోదావరి జిల్లా
సెప్టెంబర్ 2025
28 పేజీలు
Advt.feature 8





ప్రజలతో ప్రజాశక్తి



'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రజాశక్తి దినపత్రిక 45వ వసంతంలోకి ప్రవేశించింది. 1981 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి దినపత్రికగా వెలువడింది. 1980వ దశకంలో తెలుగునాట సాగిన అఖిలపక్ష రైతు ఉద్యమం, తదనంతరం ఎగసిన కాంగ్రెస్ వ్యతిరేక వెల్లువకు ఆలంబనగా నిలిచింది. 90వ దశకంలో దేశవ్యాప్తంగా వచ్చిన నయా ఉదారవాద విధానాలు, వాటితోపాటే రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని, రానున్న ప్రమాదాల గురించి వివరించింది. వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షకులకు, విస్తార ప్రజా సమూహాలకు మద్దతుగా నిలిచింది. 2000 దశకంలో పాలకులు బషీర్‌బాగ్‌లో, ముదిగొండలో తూటాల వర్షం కురిపించి నిండు ప్రాణాలను బలిగొన్నా, ఆ ఉద్యమాలన్నింటిలోనూ ప్రచారాందోళన సాధనంగా ప్రజాశక్తి తనవంతు పాత్ర పోషించింది.

దేశంలో నయా ఉదారవాద విధానాలకు తోడు మతతత్వ శక్తులూ పెరిగాయి. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేష సృష్టికి మతోన్మాదులు అయోధ్య మొదలు వారణాసి, మథుర వరకు అనేక వివాదాలను లేవనెత్తి రావణకాష్టాన్ని రగిలిస్తున్నారు. కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో ప్రజాస్వామ్యం, స్వావలంబన, లౌకికతత్వం, సామాజిక న్యాయం హరించి వేయబడుతున్నాయి. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడింది. నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. అటవీ హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, దేశానికి తీవ్ర హాని కలిగించే పరిణామాలన్నింటిపైనా పాఠకులకు ముందస్తు సమాచారాన్ని అందించడంలో ప్రజాశక్తి ముందుంది. దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు, ప్రజల ఐక్యతను కాపాడడం కోసం అన్ని సందర్భాల్లోనూ నికరంగా నిలిచింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయరాదన్న సూత్రబద్ధ వైఖరికి కట్టుబడిన ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ విభజనను వ్యతిరేకించి సమైక్యత కోసం నిలబడింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్... ఇలా ఎన్నో హామీలిచ్చినా అవి నీటి మీద రాతలుగా మారాయి. ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర పాలకులను దోషులుగా నిలపడంలోనూ, రాష్ట్రంలోని పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టే విషయంలోనూ ప్రజాశక్తి ముక్కుసూటిగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది 1999లో గానీ, 2025లో గానీ పాలకుల విధానాలను, సంస్కరణల పేరిట సాగుతున్న దోపిడీని, విద్యుత్ భారాలను ప్రతిఘటించడానికి జనానికి సమాచారాన్ని ఇవ్వడంలో ముందుంది. తరగతుల విలీనం పేరిట విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వాటి పర్యవసానాలను ప్రజల ముందుంచింది. తమ హక్కుల సాధనకు ఉద్యమించే ఉద్యోగ, ఉపాధ్యాయులు, ..8లో



ఆధ్యాత్మికత అంటే మత విద్వేష రాజకీయం కాదని చాటిన సర్వేపల్లి

మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సెప్టెంబర్ 5. దేశమంతటా ఉపాధ్యాయుల దినోత్సవంగా ఈ రోజును పాటిస్తారు. “మా అధ్యాపక రంగం నుంచే ఆయన దేశానికి రాష్ట్రపతి అయ్యారు తెలుసా!” అంటూ గొప్పలు పోతారు. ముఖ్యంగా అధికారులు, రాజకీయ నాయకులు ఉపాధ్యాయ వృత్తి పవిత్రత గురించి ప్రసంగాలు చేస్తారు. కాని డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ భావాల గురించి, బోధనల గురించి ఎక్కువగా ఎవరూ ప్రస్తావించరు. కాని గతంలో ఎప్పటికన్నా కూడా ఇప్పుడు సర్వేపల్లి భావాల, బోధనల ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా నేటి విద్యా వ్యవస్థలో మోడీ ప్రభుత్వం జొప్పిస్తున్న శాస్త్ర వ్యతిరేకమైన భావనల నేపథ్యంలో, అవాస్తవాల చరిత్రతో భవిష్యత్తు తరాల మెదళ్ళను పాడుచేస్తున్న వాతావరణంలో ఉపాధ్యాయులు ఎటువంటి దృక్పథంతో, ఎటువంటి విలువలతో వ్యవహరించాలన్నది సర్వేపల్లి దార్శనికత నుంచి తెలుసుకోవచ్చు.

డా॥రాధాకృష్ణన్ 1888–1975 మధ్య కాలంలో జీవించారు. 1954లోనే ఆయనకు భారతరత్న బిరుదు ప్రదానం అయింది. ఆ తర్వాత 1962లో భారతదేశపు రెండవ రాష్ట్రపతిగా వ్యవహరించారు. అంతకు ముందు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన 33వ ఏటనే భారతీయ తత్వశాస్త్రం అన్న గ్రంథాన్ని రచించారు. అప్పటివరకూ బ్రిటిష్ పాలకులు తమ విద్యా విధానం ద్వారా ఎక్కించిన ఆత్మన్యూనత నుండి భారతీయులు బైట పడడానికి కావలసిన తాత్విక భూమికను ఈ గ్రంథం ఏర్పరిచింది. డా॥రాధాకృష్ణన్ వ్యక్తిగతంగా ఆధ్యాత్మికవాది. ప్రముఖ జర్మన్ తత్వవేత్త హెగెల్ ప్రతిపాదించిన ‘అఖండ భావం’ అన్న దానికి, మన ప్రాచీన ఉపనిషత్తులలో సూచించిన పరమాత్మ భావానికి చాలా సామ్యం ఉందని రాధాకృష్ణన్ భావించారు. ఆయన ఆధ్యాత్మికవాది అయినా, ప్రాచీన భారతదేశంలోని తాత్విక సాంప్రదాయాలను తన గ్రంథంలో వివరించేటప్పుడు ఆ యా తత్వవేత్తల భావనలను యథాతథంగా వివరించారు. బౌద్ధం, జైనం, సాంఖ్యం, లోకాయతం వంటి భౌతికవాద దర్శనాలను కూడా అదేవిధంగా వివరించారు. అందుకే ఆ గ్రంథం విదేశీ, స్వదేశీ విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర విద్యార్థులకు ఒక రిఫరెన్స్ గ్రంథంగా కొనసాగుతోంది.

దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి.



ఈ మధ్య మన రాష్ట్రంలో, దేశంలో కూడా సనాతన ధర్మం గురించి చర్చ జరుగుతోంది. ఈ చర్చను హిందూ మతస్తులకు, తక్కినవారికి మధ్య చర్చ లాగా, లేక భక్తులకు, నాస్తికులకు మధ్య చర్చ లాగా దిగజార్చేందుకు కొందరు శక్తివంచన లేకుండా తాపత్రయ పడుతున్నారు. వాస్తవంగా ప్రగతికి, అభివృద్ధి నిరోధకత్వానికి మధ్య చర్చ జరగాలి. ఈ పరిస్థితుల్లో ఒక ఆధ్యాత్మికవాది అయిన డా॥ రాధాకృష్ణన్ సనాతనవాదుల గురించి ఏం రాశారో తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఆ ప్రాతిపదికన తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకుని నెరవేర్చడం అవసరం.

తాత్విక చింతన మానవ ప్రగతికి తోడ్పడేదిగా ఉండాలి

“తాము సాంప్రదాయ రక్షకులం అనుకునే సనాతన వాదులు ‘సత్యం అనేది కాలం బట్టి మారిపోదు’ అనే వాదనను ముందుకు తెస్తారు. ఒక సాయంసంధ్యలో ఉండే సౌందర్యం మాదిరిగా, బిడ్డ పట్ల తల్లి ప్రేమ మాదిరిగా అది కాలాతీతమైనదని వారు అంటారు.

సత్యం కాలంతోబాటు మారకపోవచ్చు. కాని ఏ యే రూపాల్లో ఆ సత్యం వ్యక్తం ఔతూవుంటుందో ఆ రూపాలు నిరంతరం మారుతూనే వుంటాయి. మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి. మన ప్రాచీన గ్రంథాలలో, ధర్మాలలో పేర్కొన్న విషయాలను యథాతథంగా పదే పదే తిరిగి ఉచ్చరిస్తూ ఆ క్రమంలో వాటి వెనుక ఉన్న స్ఫూర్తిని వదిలేయకూడదు.

రెండు వేల సంవత్సరాల క్రితం జీవించిన మన హిందూ పెద్దలు విజ్ఞానం తక్కువ స్థాయిలో కలిగి వున్నా, చాలా కాంతివంతమైన దార్శనికతను కలిగివుండేవారు. వాళ్ళే గనుక, ఇన్ని శతాబ్దాల తర్వాత మళ్ళీ మన గడ్డ మీదకి వస్తే ఆనాడు తాము ప్రవచించిన బోధనలను నిజంగా అప్పటి స్ఫూర్తితో ఆచరిస్తున్న అనుచరులు ఒక్కరు కూడా వారికి కనపడరు.

మన చైతన్య ప్రవాహం స్వేచ్ఛగా ముందుకు సాగడానికి వీలు లేకుండా అనేక నిర్జీవ భావాలు మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి స్థితిలో జీవం లేని భావరూపాలను, వాటిలో ఏ కీలక సత్యమూ లేకపోయినప్పటికీ అతి పవిత్రమైనవిగాను, ఆరాధ్యదాయకమైనవి గాను పరిగణిస్తూ వాటిని ఏమాత్రమూ సవరించడానికి వీలు లేదని పట్టుబట్టడం అంటే భావాల స్వేచ్ఛా ప్రవాహాన్ని మరింత ఆటంకపరచడమే. గత కాలపు చెత్తతో విషమయమైన రోగిని (ఆ చెత్తనంతటినీ తొలగించే బదులు యథాతథంగా దానిని కాపాడితే) మరింత ఎక్కువ బాధలకు గురి చేయడమే ఔతుంది. మార్పు అవసరం అన్న సంగతి సనాతనవాదులు గ్రహించాలి. ఈ గ్రహింపు తగినంతగా వారిలో కనిపించడం లేదు. అందువలన మన తాత్విక రంగంలో ఒక పక్క లోతుల్లోకి పోయి అన్వేషించి జ్ఞానాన్ని తెలుసుకోవాలనే పట్టుదల వ్యక్తం ఔతూంటే, మరోపక్క తాత్విక రంగానికి సంబంధం లేని గందరగోళం వ్యక్తం ఔతోంది. మన ప్రాచీన విజ్ఞాన శాస్త్ర మూలాలను, ప్రాచీన విశ్వాసాల మూలాలను గ్రహించడానికి వీలు లేకుండా గందరగోళపరిచే విధంగా మధ్యలో పేరుకున్న చెత్తను తొలగించడం, శాస్త్ర విజ్ఞానపు స్ఫూర్తితో మతాన్ని సమత్వయపరచడం నేటి భారతీయ మేధావుల ప్రధాన కర్తవ్యం.

కాని దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి. భావాలు శక్తివంతమైనవి. వాటిని వ్యాపించనివ్వాలి. వర్తమానం తన మృత్యువును తానే చూడకుండా ఉండాలంటే ఇది చాలా అవసరం. ఉపనిషత్తులు, గీత, బుద్ధుని బోధనలు మానవ మేధస్సును అనేక అంశాలలో సున్నితంగా స్పృశించగలిగాయి. అవి ఇప్పుడు అదే విధమైన ప్రభావాన్ని సనాతన వాదం కారణంగా చూపించలేక పోతున్నాయి. ఈ ఎండిపోయిన చెట్లకు ఇప్పుడు పూలు పూయమంటే ఏ విధంగా పూస్తాయి? ఏ విధంగా వాటినుండి ఫలాలు లభిస్తాయి?

ఒకవైపు విమానాలు, పొగ ఓడలు, రైలుబళ్ళు, టెలిగ్రాఫ్‌లు ప్రపంచంలోని మనుషులందరినీ ఒక్కటిగా చేస్తున్న కాలంలో మనం ఆ ప్రపంచంతో సంబంధం లేకుండా విడిగా మనగలమా? అందుచేత మన భావచైతన్యం ప్రపంచం సాధిస్తున్న ప్రగతికి ప్రతిస్పందించాలి. మనవంతుగా దానిని ముందుకు నడిపించాలి. నీటి ప్రవాహం లేని చెరువులు, కుంటలు నాచు, చెత్త పేరుకుపోయి పనికిరాని, హానికరమైన జీవులకు నిలయాలౌతాయి. అదే ప్రవహించే నదిని చూడండి! అనునిత్యం ముందుకు సాగుతూ కొత్త ఊటల నుండి ప్రేరణ పొందుతూ కొత్త శక్తిని పొందుతూనే వుంటుంది. ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి. ఒక జాతీయ స్థాయిలో ఈ ప్రక్రియ ఏవిధంగా జరగాలో మనకు గాంధీ, టాగూర్, అరబింద ఘోష్, భగవాన్ దాస్ వంటి నేతల రచనలు సూచిస్తున్నాయి. మన ప్రాచీన విజ్ఞానంలోని గొప్పదనాన్ని గ్రహిస్తూ, దాని నుండి ప్రేరణ పొందుతూనే పాశ్చాత్య భావనల పట్ల కూడా అమిత శ్రద్ధ ప్రదర్శిస్తూ వాటిని అధ్యయనం చేసి ఇముడ్చుకోవాలి. వర్తమాన జీవితాన్ని ఉన్నది ఉన్నట్లు చూసి అందులో జీవించే బదులు, గతంలోనే జీవించాలని కోరుకునే సనాతనవాదులకు భవిష్యత్తు ఎక్కడిది?

ఒక మూఢాచారంగా దిగజారిపోతూ, తన పరిధిని కుదించుకుంటూ వర్తమాన పరిస్థితులకు ఏ మాత్రమూ ఉపయోగపడనిదిగా మన తాత్విక చింతన ఉండాలా లేక సజీవంగా, వాస్తవికంగా, మానవ ప్రగతికి దోహదపడే అంతర్భాగంగా ఉండాలా? అన్నది మనముందున్న సవాలు. ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ఆధునిక విజ్ఞానాన్ని ప్రాచీన తత్వవేత్తల సమున్నత ఆదర్శాలను రెండింటినీ మేళవించడం మన కర్తవ్యం. వర్తమాన సమాజాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దగలిగినప్పుడే, పురోగతికి తోడ్పడినప్పుడే భారతీయ తాత్వికతకు సార్థకత చేకూరుతుంది. యాజ్ఞవల్క్యుడు, గార్గి, బుద్ధుడు, మహావీరుడు, గౌతముడు, కపిలుడు, శంకరుడు, రామానుజుడు, మాధవుడు, వల్లభుడు, ఇంకా మరెందరో మహా రుషులు, మేధావులు చేసిన కృషి ఈ కర్తవ్యాన్ని మనం సాధించగలం అన్న ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది.” (ఇండియన్ ఫిలాసఫీ–వాల్యూం 2 ఆక్స్‌ఫర్డ్ ఇండియా ప్రచురణ 2008, పేజీలు 724 నుండి 727 వరకు)

తన గ్రంథం ముగింపులో డా॥రాధాకృష్ణన్ నిర్దేశించిన కర్తవ్యం ఇది. ఇదే మన ఉపాధ్యాయ, అధ్యాపక లోకానికి ముందున్న తక్షణ కర్తవ్యం.

– ఎం.వి.ఎస్. శర్మ, మాజీ ఎంఎల్‌సి

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య

ప్రధానోపాధ్యాయులు ఐవి.కృష్ణారావు

ప్రజాశక్తి - ఆచంట



గ్రామీణ ప్రాంత విద్యార్థులందరికీ ప్రభుత్వ బడిలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందని కరుగోరుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవి.కృష్ణారావు తెలిపారు. ముందుగా ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల అధునాతన సౌకర్యాలు కల్పించే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆహ్లాదకరమైన తరగతి గదులు, పాఠశాలకు రంగులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఫర్నిచర్‌తో పాటు సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నూరు శాతం ఇంగ్లీష్ మీడియంలో బోధన చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా విద్యార్థుల ప్రగతిని నివేదించేందుకు పలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యారంగంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని, విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం

ప్రధానోపాధ్యాయులు కె.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట



వచ్చే ఏడాదిలో పదవ తరగతిలో అద్భుతమైన అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నాగేశ్వరరావు తెలిపారు. ముందుగా ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు భరోసాగా ఉన్నాయన్నారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు, కంప్యూటర్ సైన్స్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన సాగించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెండు

ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆచంట



ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని కోడేరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాస్ అన్నారు. ముందుగా ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యారంగంలో సమూల మార్పులు చోటు చేసుకున్నా యన్నారు. విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకున్న నూతన విద్యా విధానాలతో సమూల మార్పులు వచ్చాయన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతో పాటు గ్రేడులుగా విభజించి విద్యార్థుల మేధస్సుకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు భరోసాగా ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకొని, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చి వారి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

అంచలంచెలుగా పాఠశాల అభివృద్ధి


ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆచంట



పాఠశాల అంచలంచెలుగా అభివృద్ధి చెందుతుందని పెనుమంచిలి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ముందుగా ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ పాఠశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధనకు కృషి చేస్తున్నారన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్కూలుకు దీటుగా మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రుల కమిటీ ద్వారా ప్రధానోపాధ్యాయుల భాగస్వామితో విద్యార్థులను ఉత్తమ స్థానంలో తీర్చిదిద్దేందుకు ఇప్పటి నుంచే ఒక ప్రణాళిక ద్వారా విద్యను అందిస్తున్నామన్నారు. ప్రయివేటు బడుల్లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి అప్పుల పాలయ్యే బదులు నాణ్యమైన విద్య అందుతున్న ప్రభుత్వ బడులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఉచిత విద్య, తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం ద్వారా పోషకాహారం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర ద్వారా మూడు జతల యూనిఫాం, స్కూల్ బ్యాగ్ లు, రక్తహీనత నివారణకు రాగి జావా, చిక్కీలు, ఐరన్ పోలిక్ మాత్రలు, నులిపురుగుల నివారణ కోసం మాత్రలు పంపిణీ జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా విద్యార్థుల ప్రగతిని నివేదించేందుకు పలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పత్రికా రచనలో వీరేశలింగం కొత్త ఒరవడి



పత్రికారచనలోనూ వీరేశలింగానికి కొత్త ఒరవడే! వివేకవర్ధని పత్రిక ద్వారా అవినీతిపరులపై యుద్ధం సాగించి వారిని హడలెత్తించాడు. సంఘంలోని ఇతర దురాచారాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి పత్రికను ఆయుధంగా వాడుకున్నాడు. 1881 డిసెంబరు 11న తమ ఇంట్లో మొట్టమొదటి వితంతు వివాహం చేశాడు. ఈ పెళ్ళి పెద్ద ఆందోళనకు దారి తీసింది. పెళ్ళికి వెళ్ళినవాళ్ళందరినీ సమాజం నుంచి వెలి వేశారు. అయినా, పట్టువదలని వీరేశలింగం తరువాతి కాలంలో సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. మూఢ విశ్వాసాలు, సనా తనాచారాలపై ఆయన జరిపిన పోరాటం చిరస్మరణీయం, ఇప్పటికీ అనుసరణీయం. ఆయన కాలక్షేపం కోసం చేసిన రచన ఒక్కటీ లేదు. అన్నీ సంఘ సంస్కరణ, ఉద్ధరణ కోసమే!

తెలుగు నాట మూఢాచారాలు, కులమత భావబేధాలూ, కుతర్క కుహనా విలువలూ రాజ్యమేలుతున్న నాటి తరుణంలో–ప్రచండ భాస్కరుడిలా ప్రభవించాడు వీరేశలింగం. పుట్టటమే సంఘసంస్కరణ కోసం పుట్టాడా అన్నట్టు జీవితమంతా ఆ దిశగా అవిరళమైన, అసామాన్యమైన కృషి చేశాడు. ఎవరు నిరసించినా, ఎందరు అవహేళన చేసినా పట్టించుకోలేదు. తాను చేస్తున్నది సమాజానికి మేలు చేసేదని బలంగా నమ్మాడు. అదిలింపులకు, బెదిరింపులు తలవొంచలేదు. అసలు సిసలు కార్యవాదిగా ముందుకు దూసుకుపోయాడు. దెయ్యాలు లేవని నిరూపిం చటం కోసం బాల్యంలోనే శ్మశానాన్ని సందర్శించిన గుండెధైర్యం తనది. పుస్తకం కొనేంత డబ్బు చేతిలో లేనప్పుడు– పూర్తి సొమ్ము సమకూరేదాకా దుకాణంలోనే కూచొని వసు చరిత్రను చదివిన జిజ్ఞాస తనది. జీవితాంతం అదే ఒరవడి.

వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగాడు. ఐదో ఏట బడిలో చేరి, బాల రామాయణం, ఆంధ్ర నామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం వంటివి నేర్చుకున్నాడు. పన్నెండో ఏట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నప్పటినుంచి అన్ని తరగతుల్లో ప్రథమ శ్రేణిలోనే ఉండేవాడు. తన పదమూడో ఏట ఎనిమిదేళ్ల రాజ్యలక్ష్మమ్మతో బాల్యవివాహం జరిగింది. పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేశాడు. చదువుకునే రోజుల్లో కేశవ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు వంటి వాటి వల్ల ప్రయోజనం లేదని, దయ్యాలు, భూతాలు వంటివి లేనేలేవని చిన్నప్పుడే బలంగా నమ్మేవాడు.

1867లో పెదనాన్న మరణంతో ప్రభుత్వోద్యోగంలో చేరాలని ప్రయత్నించాడు. కానీ లంచం ఇవ్వనిదే ఉద్యోగం రాదని తెలిసి, ఆ ప్రయత్నం విరమించాడు. కొన్నాళ్ల న్యాయవాద వృత్తి ఆసక్తి చూపినా, అందులోనూ అవినీతి, అబద్ధాలూ ప్రబలంగా ఉన్నాయని భావించి, అదీ మానుకున్నాడు. ఆఖరికి బోధనా వృత్తిని స్వీకరించాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చేయడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని పత్రికను ప్రారంభించాడు. 'సంఘంలోని అవకతవకలను ఎత్తిచూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం' లక్ష్యాలుగా పత్రిక నడిపాడు. ఎంతోమంది అవినీతిపరుల బాగోతాలను సోదాహరణంగా బయటపెట్టి, ఇన్వెస్టిగేషన్ జర్నలిజానికి కూడా ఆయనే తొలి అడుగు వేశాడు. తరువాత హాస్య సంజీవిని అనే హాస్య పత్రికను ప్రారంభించాడు. తెలుగులో మొట్టమొదటి ప్రహసనాన్ని ఈ పత్రికలోనే ప్రచురించాడు. కందుకూరి ఇటు సంఘ సంస్కరణకు, అటు సాహిత్య సృజనకూ సమ ప్రాధాన్యం ఇచ్చి, ఎంతో సేవ చేశారు. అనేకనేక రంగాల్లో ఆయన ప్రజ్ఞాశాలి, కార్యవాది. అందుకనే తెలుగు జాతి నవయుగ వైతాళికుడిగా పేరొందాడు. చెప్పటం కన్నా చేయటమే పనిగా పెట్టుకున్న మహా మనీషి ఆయన. స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కోసం పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు. అన్ని కులాల పిల్లలూ ఒకేచోట కూర్చొని విద్యాభ్యాసం చేసే మార్పుకు శ్రీకారం చుట్టాడు. అంటరాని కులాలుగా సమాజం దూరం పెట్టిన వారికి చదువు చెప్పడంతో పాటు పలకాబలపం, పుస్తకాలూ సమకూర్చారు. అప్పటి సమాజంలో బాలికలకు చిన్నప్పుడే పెళ్ళిళ్ళు చేస్తే– వారు కాపురాలకు పోకముందే భర్తలు మరణిస్తే– వితంతువులై అనేక కష్టనష్టాలు ఎదుర్కొనేవారు. వారికి మరొక వివాహం నిషిద్ధం. అది దురాచారమని చెప్పటమే కాదు; ఎన్నో సాహసాలకు తెగించి, విమర్శలకు తలొగ్గి వితంతు పునర్వివాహాలకు పూనుకున్నాడు వీరేశలింగం. తొలుత ఆయన వెంట నడిచిన మిత్రులు అనేకమంది తరువాత తప్పుకున్నారు. అప్పటి కుల కట్టుబాట్లకు జడిచి, వెనక్కు మళ్లారు. అయినా, వీరేశలింగం వెనుదిరిగి చూడలేదు. కుల బహిష్కరణను ఎదుర్కొన్నాడు. సామాజిక వెలిని బేఖాతరు చేశాడు. వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసే దుష్ప్రచారం ఎంత చేసినా చలించలేదు. ఒకానొక దశలో వితంతు పునర్వివాహాలు చేస్తున్నప్పుడు– ఊళ్లో అందరూ సహాయ నిరాకరణ చేసినా– పనులన్నీ ఆయనా, ఆయన జీవసహచరి రాజ్యలక్ష్మమ్మ చక్కబెట్టారు. గోదావరి నది నుంచి నీళ్ల మోసి వీరేశలింగం సదాశయాన్ని నెరవేర్చటంలో రాజ్యలక్ష్మమ్మ అడుగడుగునా తోడుగా నిలిచారు. ఆంధ్రదేశంలో ఆయనే బ్రహ్మ సమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజసేవ కోసం 1905లో హితకారిణి సమాజం నెలకొల్పి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశాడు. తెలుగు పండితుడిగా 25 ఏళ్ల పాటు పాటు రాజమండ్రిలో, ఐదేళ్ల పాటు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పని

..6లో

70 వసంతాలుగా రైతు సేవలో..

మొగల్తూరు సొసైటీ ద్వారా రైతులకు విశేష సేవలు

లాభాల బాటలో సంఘం


కనకమాణిక్యం (ఫైల్)


గోవిందరాజులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఒక రైతు ముందు చూపుతో నెలకొల్పిన సహకార సంఘం 70 వసంతాలుగా రైతులకు విశేష సేవలు అందిస్తుంది. మండల కేంద్రం మొగల్తూరులో 1956లో గ్రామానికి చెందిన రైతు పువ్వాడ కనకమాణిక్యం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని నెలకొల్పారు. ప్రారంభంలో 60 మంది సభ్యులు రూ.ఆరు వేల రుణాధికారంతో సొసైటీని స్థాపించారు. అప్పటి నుంచి ఈ సహకార సంఘం ద్వారా వేలాది మంది రైతులకు రుణాలు అందించడంతో పాటు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, తదితర వాటిని సరఫరా చేస్తున్నారు. సంఘం స్థాపించినప్పటి నుంచి ఎప్పుడూ లాభాలు అర్జిస్తూనే వచ్చింది.


తారక రామారావు


శేషగిరి

ఆర్థిక ప్రగతి

న వా కా ర సంఘం ఆర్థిక ప్రగతి సాధిస్తూ సంవత్సరానికి రూ.12 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఈ సొసైటీలో సుమారు 3,200 రైతులు సభ్యులుగా చేరారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.3.70 కోట్లు, రిజర్వ్ ఫండ్ రూ.1.30 కోట్లు, షేర్ ధనం రూ.90 లక్షలు, పంట రుణాలు రూ.ఆరు కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.60 లక్షలు, సొసైటీ నిధుల నుంచి రూ.నాలుగు కోట్ల రుణాలు మంజూరు చేశామని సిఇఒ తెలిపారు.


మొగల్తూరు సొసైటీ

రైతుల ఇబ్బందులు తెలిసి..

ఆ రోజుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి రైతుల పడే ఇబ్బందులు తెలిసిన నా తండ్రి, రైతు పువ్వాడ కనకమాణిక్యం సహకార సంఘం ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఆయన స్థాపించిన సంఘం నేడు అంచెలంచెలుగా ఎదిగి ఎంతో రైతులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. ఈ సొసైటీ నిర్వాహణ సక్రమంగా సాగితే మరింత మంది రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు ఎరువులు, పురుగుమందులు తదితర వాటిని రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుంది.

నాణ్యమైన సేవలు

పువ్వాడ శేషగిరి, రైతు, మొగల్తూరు

రైతులకు సహకార సంఘం ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. రుణం కోసం వచ్చిన రైతులకు తక్షణమే రుణాలు మంజూరు చేస్తున్నాం. సొసైటీలో చేసే డిపాజిట్లకు బ్యాంకుల కంటే ఎక్కువగా వడ్డీ అందిస్తున్నాం. సహకార సంఘం లాభాల బాటలో ఉంది. రైతులకు ప్రతి ఏటా డివిడెంట్ పంపిణీ చేస్తున్నాం.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను

కొత్తపల్లి గోవిందరాజులు, సొసైటీ సిఇఒ, మొగల్తూరు

నేను ఈ సహకార సంఘంలోని ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించి ఇటీవల విరమణ చేశాను. కూటమి నాయకులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ సొసైటీ చైర్ పర్సన్‌గా ఎంపిక చేశారు. రైతులకు ఉత్తమ సేవలు అందించి ఆ నమ్మకం నిలబెట్టుకుంటాను. సొసైటీని ప్రగతి బాటలో నడిపిస్తాను.

ప్రసిద్ధ క్షేత్రం.. పెద్దింట్లమ్మ ఆలయం


పెద్దింట్లమ్మ ఆలయం

ప్రజాశక్తి - కైకలూరు

యాత్రికుల పాలిట కొంగుబంగారం.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెద్దింట్లమ్మ అమ్మవారు. కొల్లేటి సరస్సు నడిబొడ్డున కొలువై ఉన్న అమ్మవారి గురించి తెలుసుకుందాం.. కొల్లేటికోట అమ్మవారి ఆలయంలో జలదుర్గ అమ్మవారి విగ్రహం ఉంది. ఆలయంలో తొమ్మిది అడుగుల ఎత్తు కలిగి, విశాల నేత్రాలతో పద్మాసనంలో కొలువై ఉన్న అమ్మవారు పెద్దింట్లమ్మ. పార్వతీదేవి ప్రతిరూపంగా ప్రజలు అమ్మవారిని కొలుస్తుంటారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఒడిశ్శా తదితర ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఏటా పాల్గుణ శుద్ధ పాడ్యమి మొదలు పౌర్ణమి వరకూ అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి. పాల్గుణ శుద్ధ ద్వాదశి నాడు అమ్మవారికి మూడు మైళ్ల దూరంలోని గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వర స్వామితో కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది.

కొల్లేరు ప్రాంతం ప్రసిద్ధి చెందింది. కొల్లేటికోట లంక గ్రామాన్ని కొలనుపుణంగా, కొలనువీడుగా పిలిచేవారని శాసనాల ద్వారా తెలుస్తుంది. క్రీస్తు శకం 10, 11 శతాబ్ధాల్లో వేంగిచాళుక్య రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. క్రీ.శ 1076లో వీర విజయాదిత్య మరణంతో వేంగి చాళక్యుల పాలన అంతమైంది. చాళుక్యులకు తిరిగి రాజ్యాధికారం ఇవ్వడంతో మండలేశ్వర్ల తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు చేసిన వారిలో కొలనువీడు మండలేశ్వరుడైన తెలుగు భీముడు కూడా ఉన్నారు. బహు సాహసిగా వాసికెక్కిన తెలుగు భీముడు మిగిలిన తిరుగుబాటుదారులతో కలిసి పితృపురం చాళుక్యరాజైన విద్యార్థి చక్రవర్తిని రాజుగా చేశారు. ఆయనే పార్వతీదేవిని పెద్దమ్మగా కొలిచిన చక్రవర్తి. చైనా బౌద్ధమత ప్రచారకుడు హుయాన్ సాంగ్ ఈ కొల్లేటికోట సరస్సును ఒక మహత్తర తాగునీటి సరస్సుగా అభివర్ణించారు. దండి మహాకవి దశకుమార చరిత్రలో కొల్లేటికోట సరస్సును బహుసాహసి అయిన తెలుగు భీముడు గురించి గొప్పగా రాశారు. కొల్లేరు సరస్సును ప్రాచీనకాలంలో కునాళ సరస్సుగా పేరు ఉన్నట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు.





ఇక్కడికి ఎలా చేరాలంటే..

విజయవాడ నుంచి రైలు మార్గంలో భీమవరం వెళ్లే రైలు ఎక్కి కైకలూరులో దిగాలి. అక్కడ నుంచి ఆలపాడు వరకూ బస్సులో ప్రయాణించి ఏడు కిలోమీటర్ల రోడ్డు మార్గం ద్వారా కొల్లేటికోటకు చేరుకోవచ్చు. కొల్లేరు సరస్సులో పడవ ప్రయాణం ద్వారా పెద్దింట్లమ్మను దర్శించుకోవడం మరుపురాని అనుభూతి. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఈ ప్రాంత ప్రజల ఆనవాయితీ.

ఇటీవల దేవాదాయ శాఖ నిధులు కేటాయించి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు యాత్రికుల నుంచి విరాళాలు సేకరించి అణివేటి మండపాన్ని నిర్మిస్తున్నారు.







పత్రికా రచనలో వీరేశలింగం కొత్త ఒరవడి

(4వ పేజీ నుంచి)

చేశాడు. 130కి పైగా గ్రంథాలు రాశాడు. అనేక సాహిత్య ప్రక్రియలకు ఆయనే ఆద్యుడు. తొలి తెలుగు నవల రాజశేఖర చరిత్రను రాశాడు. అప్పటివరకూ కథల్లో దేవుడో, రాజాధిరాజులో కథానాయకులైతే - రాజశేఖర చరిత్రలో సామాన్యుడే కథానాయకుడు. ప్రహసనాలు పేరిట సమాజంలో మూఢాచారాలను, దురాచారాల ను దుయ్యబట్టారు. తన రచనలతో ఛాందసవాదుల వాదనలను పూర్వపక్షం చేస్తూ, ఆధునిక ఆలోచనాపరుల్లో చైతన్యం నింపారు. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. పిల్లల కోసం వాచకాలు తయారు చేశాడు. ఆయన వెలువరించిన ఆంధ్ర కవుల చరిత్ర ప్రత్యేక ఖ్యాతి గడించింది. ఆయన ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉన్నా- ఎక్కడా ఏ విషయంలోనూ జాప్యం చేసి ఎరగడు. పగటివేళ సంఘ సంస్కరణ, రాత్రుళ్లు గ్రంథరచన చేసేవాడు.

సమాజం మార్పు కోరే ప్రతి ఒక్కరికీ వీరేశలింగం జీవితం ఒక పాఠ్యపుస్తకం. ఉన్న సమాజాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నప్పుడు యథాతథవాదులు, స్వార్థపరులూ అనేక రూపాల్లో ఆటంకాలు కల్పిస్తారు. అపప్రథలకు గురి చేస్తారు. అయినా, లక్ష్యపెట్టకముందుకు వెళ్లటమే- కార్యశీలుర లక్షణం. అదే వీరేశలింగం జీవిత సందేశం.

- సాహితి

భారత రాజ్యాంగం మతపరమైన హక్కును, స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఎవరు ఏ మతమైనా అవలంబించవచ్చు.

- నరేంద్ర దభోల్కర్,
సామాజిక కార్యకర్త

పెనుమత్స రంగరాజు పాఠశాలకు పూర్వ వైభవం తెస్తాం

ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్



వర్ధమాన రవిశంకర్ సర్కార్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్పి ఉన్నత పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం, స్థానికులు కృషి చేస్తున్నారు. ఈ పాఠశాలను భీమవరం గ్రామీణ మండలం వెంప గ్రామానికి చెందిన పెనుమత్స రంగరాజు సుమారు 70 ఏళ్ల క్రితం స్థానికుల సహకారం కూడా తీసుకుని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆరు ఎకరాల స్థలాన్ని విరాళంగా అందించారు.

వేల మంది జీవితాల్లో వెలుగులు

ఈ పాఠశాల ప్రారంభానికి ముందు మొగల్తూరు విద్యాపరంగా వెనుకబడి ఉంది. పాఠశాల ప్రారంభంతోనే ప్రజల్లో విద్య పట్ల చైతన్యం పెరిగింది. దీంతో పలువురు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి విద్యాభ్యాసం ప్రారంభించారు. వేలాదిమంది ఇక్కడ చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. వారిలో శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, అధ్యాపకులు, ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు, కళా రంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. వారిలో అంతరిక్ష పరిశోధనా రంగ శాస్త్రవేత్త డాక్టర్ ఎంవైఎస్. ప్రసాద్, సినీ రంగంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మెగాస్టార్ కొణిదెల శివశంకర వరప్రసాద్ (చిరంజీవి), పాన్ ఇండియా కథానాయకుడు, యంగ్ రెబల్ స్టార్ ఉప్పలపాటి వెంకట ప్రభాస్ తండ్రి సూర్యనారాయణ రాజు, పలువురు ఈ పాఠశాల ముద్దుబిడ్డలే.

పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

పాఠశాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేపట్టారు. దీనిలో భాగంగా తరగతి గదులకు భవనాల కొరతను తీర్చేందుకు సుమారు రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టిన పనులు చురుకుగా సాగుతున్నాయి. పాఠశాల పూర్వ విద్యార్థులు కూడా అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

బాల్యమంతా ఇక్కడే
వర్ధమాన రవిశంకర్ సర్కార్, ప్రధానోపాధ్యాయులు

చిన్నప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నాను. ఇక్కడ నాకు చాలా మధుర స్మృతులు ఉన్నాయి. ఆనాడు గురువులు అందించిన విద్య, ప్రేమ వాత్సల్యాలతోనే ఉన్నతి సాధించాను. ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా పనిచేయడం గర్వకారణంగా ఉంది. నేను పనిచేసిన కాలంలో పాఠశాల అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేస్తాను. పాఠశాలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశాం.



మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్పి ఉన్నత పాఠశాల







సమాజం కొద్ది మంది మీద
ఆధారపడి నడవదు.
లేదా అదృష్టం వల్లనో,
విధి ఫలితం వల్లనో నడవదు.
పౌరుల చైతన్యపూర్వక
కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త,
రాజకీయవేత్త.

భావి ఇంజనీర్ల నిలయం.. స్వర్ణాంధ్ర



2001 లో ప్రారంభం
విద్యారంగంలో
కలికితురాయిగా స్వర్ణాంధ్ర
ఇంజనీరింగ్ కళాశాల

ప్రజాశక్తి - నర్సాపురం రూరల్

గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన ఇంజినీర్లను తమ చేసి దేశానికి అందించాలనే ఉన్నత లక్ష్యంతో సీతారామపురంలో వశిష్ట ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 2001లో స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీని స్థాపించారు. కళాశాల ప్రారంభించిన నాటి నుండి అభివృద్ధి చెందుతూ సాంకేతిక విద్యారంగంలో రాష్ట్రంలో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇది ఒకటిగా నిలిచింది. నాటి నుంచి నేటి వరకూ అనేక విజయాలు సాధించింది.

మళ్లీ నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు

స్వర్ణాంధ్ర కళాశాల నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) ఎ గ్రేడ్‌తోపాటు అత్యుత్తమ స్కోరు సాధించి జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం సాధించింది. విద్యారంగంలో విధివిధానాల ప్రాతిపదికగా 2014లో అటానమస్ హోదాను సాధించి డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరుకుంది. బిటెక్ ఏడు బ్రాంచిలలో 1230 సీట్లు, ఏడు ఎంటెక్ కోర్సుల్లో 126 సీట్లు, ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 120 చొప్పున సీట్లు, డిప్లమోలో ఆరు బ్రాంచెస్‌లో 390 సీట్లు మొత్తంగా 1986 సీట్లతో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రగతిపథంలో దూసుకెళ్తోంది.

కళాశాలలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థీ క్యాంపస్ సెల్ ద్వారా ఉద్యోగాలు సాధించేలా యాజమాన్యం విశేష కృషి చేస్తోంది. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్ర, విప్రో, ఎస్‌డిబిడేటా, పలారిస్, యాక్సెంచర్, ఐబిఎం, సింటెల్, గోల్డ్‌మెన్ సాచెర్స్, టిసిఎస్, వర్చుసా, టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ లిమిటెడ్, అమరాన్ బ్యాటరీస్ లిమిటెడ్, సిటిఎస్, జెస్ట్ డయల్ లిమిటెడ్, వివిడిఎన్ టెక్నాలజీస్, ది క్యూ ఎంటర్‌టైన్‌మెంట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వంటి బహుళజాతి కంపెనీల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. అలాగే విద్యార్థులు పోటీని తట్టుకునేందుకు నాస్కామ్, గ్లోబరినా, బిటెక్ గురు, ఒరాకిల్, ఇన్ఫోసిస్ క్యాంపస్ కనెక్ట్, క్యాండోరియ, ట్యాలాన్సీ సెంటర్ ఫర్ ఎక్సలెన్సింగ్ మ్యారెట్ షిప్ బిల్డింగ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థలతో ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుని ఉద్యోగ సాధనకు అవసరమైన శిక్షణను బిటెక్ మొదటి సంవత్సరం నుండే అందిస్తున్నారు. మీడియం అండ్ స్మాల్ స్కేల్ ఎంటర్‌ప్రైజర్‌తో శిక్షణకు ఒప్పందం చేసుకున్నారు.

స్వర్ణాంధ్ర విజయాల పరంపర

స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నాస్మ్ వారిచే గుర్తింపు పొందింది. ఇండో ఇటాలియన్ రీసెర్చ్ సెంటర్ వారిచే ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలగా నిలిచింది. వరల్డ్ హెచ్ఆర్‌డి కాంగ్రెస్ న్యూఢిల్లీ వారిచే ఎక్స్‌లెన్స్ ఇన్ అకాడమీ అండ్ ఇండస్ట్రీ ఇంటర్ ఫేస్ గుర్తింపు సాధించింది. 2013-14 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ వాచ్ వారిచే గవర్నెన్స్ క్యాంపస్‌గా గుర్తింపు పొందింది. టైమ్స్ ఇండియా మేగజైన్ వారిచే టాప్-50 ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకటిగా నిలిచింది.

ఉన్నత స్థానాల్లో స్వర్ణాంధ్ర విద్యార్థులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనే కాకుండా ప్రముఖ బహుళ జాతి సంస్థల్లో ప్రపంచం నలుమూలల్లో స్వర్ణాంధ్ర విద్యార్థులు స్థిరపడ్డారు. ఈ క్రమంలోనే స్వర్ణాంధ్ర పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకుని అపూర్వ సమ్మేళనం నిర్వహిస్తూ విద్యార్థులకు ఉద్యోగావకాశాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు.



అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీ

స్వర్ణాంధ్ర కళాశాలల్లో 60 ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. బస్టాల్ సిస్టమ్ బ్యాల్ జర్మనీ వారిచే అడ్వాన్స్ రోబోటిక్ ల్యాబ్, నానో టెక్నాలజీ ల్యాబ్, సిఎంఎస్ స్కిల్ సెంటర్, ఐటిఐ ఇంక్యులేషన్ సెంటర్, ఐబిఎం ఎక్సలెన్స్ ల్యాబ్ వంటి ప్రయోగశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. 60 వేల వాల్యూమ్ పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ స్వర్ణాంధ్ర కళాశాలలో ఉంది.

అత్యుత్తమ విద్యాబోధన, సువిశాల ప్రాంగణం, సామాజిక కార్యక్రమాలు

ఎఐసిటిఇ నిబంధనలు అనుసరించి అధ్యాపకులు ఉన్నారు. వీరిలో కొందరు పిహెచ్‌డి డిగ్రీలు పొంది క్వాలిఫైడ్ అధ్యాపకులుగా ఉన్నారు. అధునాతనమైన స్మార్ట్‌క్లాస్ రూమ్‌లు, సెమినార్ హాళ్లు, వర్క్‌షాప్, గార్డెన్స్, సువిశాల కళాశాల ప్రాంగణం ఈ కళాశాల సొంతం. విద్యార్థుల కోసం బస్ సర్వీస్‌లతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కళాశాలకు చేరవేస్తున్నారు. బాలురు, బాలికల కోసం వేర్వేరు హాస్టళ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ జనరల్ స్టోర్స్ ఉన్నాయి. కళాశాలలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయి. అంబులెన్స్ 24 గంటలు విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించారు. విద్యార్థులు శారీరకంగా ధృఢంగా ఉండేందుకు క్రీడలు, యోగా వంటి కార్యక్రమాలు కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ కళాశాల విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లోనూ ముందున్నారు. ఎన్ఎస్ఎస్, ఆచరణ, న్యూకలర్స్ అనే సంస్థల ద్వారా విద్యార్థులు రక్తదానం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి కళాశాల యాజమాన్యం సైతం సహకరిస్తోంది.

కళాశాల పాలకవర్గం

ఛైర్మన్ కెవి.సత్యనారాయణ (కెఎస్), ట్రెజరర్ వెంకటేశ్వరస్వామి (త్రినాధ్), పాలకవర్గ సభ్యులుగా అడ్డాల శ్రీహరి తదితరులు వ్యవహరిస్తున్నారు. విద్యారంగంలో సుదీర్ఘ, విశేష అనుభవమున్న డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు.

ప్రజలతో ప్రజాశక్తి

(మొదటి పేజీ నుంచి)

చిరువ్యాపారులు, మహిళలు, విద్యార్థి, యువజనలకు బాసటగా నిలుస్తోంది.

మహనీయుల త్యాగాలతో, ప్రజల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి కార్పొరేట్, మతతత్వ శక్తుల మూలంగా ముప్పు ఏర్పడింది. మహత్తర స్వాతంత్ర్య పోరాటంలోనూ ప్రజాశక్తి పాలుపంచుకుంది. 1942లోనే పత్రిక ప్రారంభమైనా పాలకులు నిషేధం విధించడంతో నిలిచిపోయింది. తిరిగి 1968లో వారపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటో తేదీ నుంచి దినపత్రికగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ఎనిమిది కేంద్రాల నుంచి వెలువడుతోంది.

భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో పత్రిక స్థాపన, వ్యవస్థాపక సంపాదకునిగా మోటూరు హనుమంతరావు వేసిన పునాది, పత్రికను విస్తరింప జేయడంలో ఎనలేని కృషి సల్పిన కొరటాల సత్యనారాయణ వంటి మహామహులు, వారి సహచరులు చూపిన మహత్తర మార్గంలోనే ప్రజాశక్తి నడుస్తోంది. పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషుల విశేష ఆదరణ వల్లనే కోవిడ్ విపత్తుతో సహా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ఈ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. మున్ముందు ఇంతకన్నా మిన్నగా ఆదరించి, ఆశీర్వదించాలని మనవి చేస్తున్నాం.

బండి ముత్యాలమ్మ పాఠశాలకు 65 ఏళ్ల చరిత్ర





బండి ముత్యాలమ్మ జెడ్పి ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - మొగల్తూరు

పేదలకు విద్యను అందించేందుకు సుమారు 65 ఏళ్ల క్రితం వర్గోన్నతి కల్పించిన పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఎందరో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. ఈ పాఠశాలలో చదువుకున్న పలువురు విద్యార్థులు వైద్యులుగా, ఇంజినీర్లుగా, ఉపాధ్యాయులుగా పలు విభిన్న రంగాల్లో స్థిరపడి దేశ అభివృద్ధికి వారి వంతు కృషి చేస్తున్నారు. మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్పి ఉన్నత పాఠశాలకు సుమారు 65 ఏళ్ల చరిత్ర ఉంది. 1901లోనే ఇక్కడ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. 1960లో ప్రాథమిక ఉన్నత పాఠశాలగా 1992లో బండి ముత్యాలమ్మ నిధులతో జెడ్పి ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేశారు. 1992లో ఆరు నుంచి ఎనిమిది తరగతులకు విద్యార్థులతో హై స్కూల్ ప్రారంభమైంది. 1995లో ఈ పాఠశాల నుంచి పదో తరగతి మొదటి బ్యాచ్ పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో సుమారు 800 మంది వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

దాతృత్వంతో అభివృద్ధి

ఈ పాఠశాలలో చదువుకున్నవారు పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల దాతృత్వంతోనే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, డైనింగ్ హాల్, సైకిల్ స్టాండ్, జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు, శుద్ధి జలాల ప్లాంటు నేలకొల్పడం తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేశారు.

ప్రతిభ ఉపకార వేతనాలకు ఎంపిక

ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ పూర్వ విద్యార్థి దొంగ చింతయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సుమారు పదేళ్ల నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్షలకు ఆసక్తితో ఉన్నవారిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా ఈ పాఠశాల నుంచి ఇప్పటివరకు సుమారు 250 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉపకార వేతనం అందుకుంటున్నారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలను అభివృద్ధి చేశారు. పాఠశాల ప్రాంగణంలో అడుగు పెట్టేసరికి గురుకులంలోకి వెళ్లిన భావన కలుగుతుంది. పచ్చని మొక్కలు, పూలవనం, చుట్టూ ప్రహరీ గోడ తదితర సౌకర్యాలు నెలకొల్పారు. పాఠశాల ఆవరణలోనే బాలికల కోసం ప్రభుత్వ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుడు కృషి

ఏడాది కిందట ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన పెనుమత్స రామరాజు ఉపాధ్యాయులను గ్రామస్తులను సమన్వయం చేస్తూ పాఠశాల అభివద్ధికి కషి చేస్తున్నారు దీంతో ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు కనబరిచారు. మండలంలోని 10 జెడ్పి ఉన్నత పాఠశాలలలో ఈ పాఠశాల విద్యార్థులే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. సమయానికి ముందే పాఠశాలకు చేరుకుంటారు. ఆఖరి వరకు పాఠశాలలో ఉండి పర్యవేక్షిస్తున్నారు.

భవిష్యత్తులోనూ మంచి ఫలితాలు

పెనుమత్స రామరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు విభిన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. 2025 – 26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా కృషి చేస్తున్నాం. దీనికి ఉపాధ్యాయులందరూ కూడా సహకారం అందిస్తున్నారు. మండలంలోని పిల్లలు అత్యధికంగా మా పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ సంవత్సరం ప్రవేశాలు పొందేందుకు ఎక్కువమంది విద్యార్థులు ఇక్కడికి వచ్చారు. ప్రతిభ ఉపకార వేతనాలకు కూడా మా పాఠశాల విద్యార్థులే జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే ఒరవడి కొనసాగించేందుకు కృషి చేస్తాను.

ఉక్కుపై కూటమి పార్టీలవి తుక్కు వాగ్దానాలేనా?

అమరవీరుల త్యాగాలకు విలువ లేదా?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇ.ఒ.ఐ) పేరుతో 12 విభాగాల్లో 32 ఇ.ఒ.ఐ లను ప్రకటించింది. తద్వారా ఉక్కు ప్రైవేటీకరణను వేగవంతం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పడినది. దీన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు రోజురోజుకూ కుట్రలను తీవ్రతరం చేస్తోంది. ఇలా వ్యవహరించడం అమరవీరుల త్యాగాన్ని వృథా చేయడమే అవుతుంది. భూములు ఇచ్చిన నిర్వాసితుల జీవితాలతో ఆడుకోవడమే అవుతుంది. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వానికి కీలక భాగస్వామిగా ఉన్న, మన రాష్ట్ర ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించే విషయంలో ఎందుకు ఒత్తిడి చేయడంలేదు? స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన 11,440 కోట్ల ప్యాకేజీ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించేదానికన్నా మరింత బలహీనపర్చే చర్య అని స్పష్టమౌతోంది. కొత్తగా 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఉత్పత్తిలోకి తీసుకొచ్చి మొత్తం 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు, ఎస్.ఎం.ఎస్ 1, 2, 3, డబ్ల్యు.ఆర్.ఎం (వైర్ అండ్ రాడ్ మిల్లు), సెంట్రల్ మిషన్ షాప్, ఎస్.టి.ఎం లు, విద్యుత్ ప్లాంట్‌ను విడివిడిగా అమ్మకానికి పెట్టారు. ప్యాకేజీతో అప్పులన్నీ తీర్చి ప్రైవేట్ వారికి అప్పజెప్పే ప్రయత్నమే ఇదంతా అని ఇట్టే అర్థమవుతుంది. స్టీల్‌ప్లాంట్ మొత్తాన్ని ఒకేసారి అమ్మితే వ్యతిరేకత వస్తుందనే పేరుతో ముక్కముక్కలు చేసి అమ్మాలని చూస్తున్నారు.

కేంద్ర బిజెపి పాలకులు దేశభక్తి గురించి నిరంతరం వల్లిస్తుంటారు. ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నట్లుగా ప్రకటిస్తుంటారు. ఆచరణ అందుకు భిన్నం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తగిన ప్రణాళికతో పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపినప్పుడు లాభాల బాటలో వుంది. మోడీ అధికారం చేపట్టాక దీనిపై కుట్రలు మొదలయ్యాయి. లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు ఎందుకు అడుగులు వేసినట్టు?



పదకొండడు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను మోడీ సర్కారు వేగవంతం చేసింది. ఆ సంస్థలను నిర్వీర్యం చేయడం, ఉపాధిని దెబ్బకొట్టడం, సామాజిక న్యాయాన్ని తుంగలోకి తొక్కడమే ఉద్దేశంగా ముందుకు సాగింది. కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలు అన్ని రంగాల్లో విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు ఇస్తున్నది. దీంతో ప్రపంచ కుబేరుల్లో వీరి స్థానం కూడా పదిలమైంది. దీనిని బట్టి భారత పాలకవర్గం ఎవరి పక్షాన వుండి సంస్కరణలు వేగవంతం చేస్తున్నదో అర్థమౌతుంది.

సంస్కరణలను వేగవంతం చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత సన్నద్ధం చేస్తున్నారు ప్రధానమంత్రి. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కీలకమైన ఉత్పత్తి విభాగాలను దశల వారీగా ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రలు పన్నుతున్నారు. కేంద్ర ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షణ చేస్తున్నది. ఇటీవల కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమి ఎంపీలు ఉక్కు మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిసి ఆర్సెలార్ మిట్టల్‌కు రాయితీలు ఇవ్వాలని, ఎన్.ఎం.డి.సి ద్వారా సొంత గనులు కేటాయించాలని విన్నవించుకున్నారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖామాత్యులు కె.రామ్మోహన్ నాయుడు, తెలుగుదేశం లోక్‌సభాపక్ష నాయకులు లావు కృష్ణదేవరాయులు, సానా సతీష్‌బాబు, దగ్గుమళ్ల ప్రసాద్, పార్థసారధి, కేశినేని శివనాథ్ (చిన్ని) సహా విశాఖపట్నం ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీభరత్ కూడా వున్నారు.

వీరు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం కనీసం మాట్లాడలేదు. భూములు త్యాగం చేసిన నిర్వాసితుల కుటుంబాలకు చెందిన ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏ కారణమూ లేకుండా ఇటీవల కాలంలో అన్యాయంగా తొలగించింది. వీరంతా ఉపాధి లేక అర్థాకలితో అలమటిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మళ్లీ వి.ఆర్.ఎస్ పేరుతో పర్మినెంట్ కార్మికులను తొలగిస్తామని హెచ్చరికలు చేస్తోంది. ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికుల పట్ల ఉక్కు యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. దీనిని ప్రతిఘటిస్తున్న కార్మిక నాయకులను అక్రమ బదిలీలు చేస్తోంది. సకాలంలో జీతాలు, ప్రోత్సాహకాలు ఇవ్వకపోయినా కార్మికులు గణనీయమైన ఉత్పత్తిని అందిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అగ్రభాగాన నిలుపుతున్నారు. ఇలాంటి అంశాలను ఉక్కు శాఖా మంత్రి దృష్టికి సదరు టిడిపి ఎంపీలు తీసుకెళ్లలేదు. కానీ అనకాపల్లి జిల్లాలో ప్రతిపాదిత ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని రాయితీలనూ అందించాలని నిస్సిగ్గుగా కేంద్ర ప్రభుత్వాన్ని అడగడం ఉత్తరాంధ్రకు, యావత్తు రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినట్లే. నక్కపల్లిలో భూములు కోల్పోయిన రైతులు, భూములపై ఆధారపడిన కూలీలు, మత్స్యకారుల గురించిగానీ....ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కారణంగా నిర్వాసితులు అవుతున్న మత్స్యకారులు, ప్రజల గురించిగానీ కనీసం ప్రస్తావించలేదు. ఈ ప్రాంతంలో గత 11 సంవత్సరాల నుండి అక్రమ భూసేకరణ చేస్తున్నారని స్థానిక ప్రజలు పోరాటాలు చేస్తున్నా వాటిని లెక్కలోకి తీసుకోవడంగానీ, మద్దతు తెలపడంగానీ చేయలేదు. నేడు ఆ భూముల్లో ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ సేవలో మన ప్రజాప్రతినిధులు మునిగి తేలుతున్నారంటేనే మనకి అర్థం కావాలి. విశాఖ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఎంపీ శ్రీభరత్ స్టీల్‌ప్లాంట్ కోసం కాకుండా ఆర్సెలార్ మిట్టల్ గురించి మాట్లాడడం అంటే ఆయన సేవలు ఎవరి కోసమనేది అర్థం చేసుకోవాలి. ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేసిన పల్లా శ్రీనివాసరావుని గాజువాక ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. కానీ నేడు ఒక్కొక్క విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుంటే ఎందుకు మాట్లాడడంలేదు? అప్పుడు చేసిందంతా కేవలం ఎన్నికల్లో గెలవడం కోసమేనా? రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, అవసరమైతే కేంద్రం మెడలు వంచి అయినా స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని సెలవిచ్చారు. నేడు కేంద్రం స్టీల్‌ప్లాంట్ విభాగాలను ప్రైవేటీకరిస్తుంటే ఎందుకు నివారించడంలేదు? స్టీల్‌ప్లాంట్ కోసం రూ.11440 కోట్ల ప్యాకేజీ కేటాయిస్తే పాలాభిషేకాలు చేసిన బిజెపి, తెలుగుదేశం నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడడంలేదు?

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్లుగా కార్మికులు, ప్రజలు విశాఖపట్నం నుండి ఢిల్లీ వరకు పెద్దఎత్తున ఉద్యమం నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమానికి బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో నేడున్న పాలక పార్టీల ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. ముఖ్యంగా నేడు కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న కె.రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ త్యాగాలతో ఏర్పడిందని, ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీక అని, ఎంతో మంది భూ నిర్వాసితుల త్యాగ ఫలితంగా ఏర్పడిందని కితాబిచ్చారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఏ తెలుగు ప్రజలూ ఊరుకోరు. రాష్ట్రం మీద ఆధారపడి కేంద్రం ఉంది. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు కేంద్రం చేతిలో వున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను అడ్డగోలుగా అమ్మితే సహించం. అమ్మేవారు ఎవరు? కొనేవారు ఎవరు? అని ప్రధాన పార్టీల నుంచి ఏ ఒక్క ప్రజాప్రతినిధీ అనడం లేదు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడానికే నేను ప్రజాప్రతినిధిగా ఉన్నానని, ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతిస్తున్నానని నాడు తెలియజేసి నేడు కేంద్ర కేబినెట్ మంత్రిగా వుండి కూడా ఈ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా ఒత్తిడి చేయడంలేదు. పైగా కేంద్ర బిజెపి ప్రభుత్వ సంస్కరణ విధానాలకు మద్దతు తెలపడమంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసగించడమే. పది రోజుల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో వచ్చిన ప్రశ్నకు రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టీల్ సహాయ మంత్రి, బిజెపి నేత భూపతిరాజు శ్రీనివాసరాజు సమాధానమిస్తూ వ్యూహాత్మక అమ్మకాలు చేస్తామని చెప్పారు. ఆంధ్ర ప్రజల ప్రయోజనాల కన్నా కార్పొరేట్ ప్రయోజనాలే మాకు మిన్న అన్న పద్ధతిలో ఆయన వ్యవహరించారు. కేంద్ర ఉక్కు మంత్రిని మన రాష్ట్ర ఎంపీలు కలిసిన 15 రోజుల్లోనే ఇలాంటి పరిణామాలు జరుగుతుండడం పట్ల రాష్ట్ర ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడడంలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగులు, నిర్వాసితులకు ఉపాధి పెంచే పద్ధతులను పెంపొందించాలి. యుద్ధ ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం అఖిలపక్ష రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

-కె.లోకనాథం, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

సమితి కేంద్రం మొగల్తూరుకు ఎంతో ప్రాధాన్యత

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయం

సమితి కేంద్రంగా ఉండే మొగల్తూరుకు రెండంచెల విధానం నుంచి కూడా ఇక్కడ ప్రాధాన్యత ఉంది. గతంలో సర్పంచులతో సమితి ఏర్పడింది. ఈ సమితి నుంచి నేరుగా జెడ్‌సి ఛైర్మన్ ఎంపిక జరిగేవి. 1963లో మొగల్తూరులో సమితికి కార్యాలయ భవనం నిర్మించారు. దీని పరిధిలో ప్రస్తుతం నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పాలకొల్లు, తదితర మండలాలకు చెందిన సర్పంచులు ఇక్కడ కార్యవర్గ సభ్యులుగా ఉండేవారు. దీనిలో భాగంగానే జిల్లాలో రాజకీయ దురంధరుడుగా పేరుగాంచిన చేగొండి హరిరామ జోగయ్య జెడ్‌పి ఛైర్మన్ ఎంపికయ్యారు. టిడిపి ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి ఎంఎల్‌ఎగా, మంత్రిగా అనంతరం ఎంపీగా గెలుపొంది విశేష సేవలు అందించారు. టిడిపి ఆవిర్భావంతో కీర్తిశేషులు ఎన్‌టి రామారావు మూడు అంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ప్రవేశపెట్టడంతో సమితి రూపురేఖలు మారిపోయాయి.

గ్రామాల అభివృద్ధి

సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండల పరిషత్ సమావేశాల్లో ఆయా గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం అధికారులు కృషి చేస్తున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి.

మొగల్తూరు పిహెచ్‌సికి 50 ఏళ్ల ఘన చరిత్ర

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 50 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ వైద్య సేవలందించేందుకు పెనుమత్స రంగరాజు కృషి చేశారు. ఆయన గ్రామస్తులను చైతన్యపరిచి వారి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఆరు ఎకరాల భూమి సేకరించి దానిలో భవనాన్ని నిర్మించారు. సముద్ర తీర ప్రాంతాల గ్రామాల్లోని ప్రజలకు ఇక్కడి నుంచే వైద్య సేవలు అందేవి. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ప్రజలు ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందేవారు. ప్రయివేట్ ఆసుపత్రులు అభివృద్ధి చెందని ఆ రోజుల్లో ఇక్కడ వారికి ఆధునిక వైద్య సేవలను అందించేవారని పెద్దలు చెబుతూ ఉంటారు.

రాజరిక పాలనకు నిదర్శనం మొగల్తూరు కోట

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరులోని రాజ బాహదూర్ పోర్ట్ గత రాజరిక పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది. 18 పరగణాలు ఈ కోట పరిధిలో ఉండేవని, కలిదిండి వంశీయులు ఇక్కడ నుంచే పరిపాలన సాగించేవారని చరిత్రకారులు చెబుతూ ఉంటారు. దీంతో పాటు సుమారు 500 ఏళ్ల క్రితం నిర్మించిన లక్క మేడ నేటికీ చెక్కు చెదరలేదు. కొంతమేర ఇటుకలు గానుగ సున్నంతో బలమైన గోడలు నిర్మించారు. అనంతరం టేకు చెక్కతో భవనాన్ని నిర్మించి దానికి లక్కపూత పూశారు. ఆ సమయంలో చైనా నుంచి వచ్చిన కళాకారులు గోడలకు, సీలింగ్‌కు చేసిన ఆకృతులు ఆనాటి కల వైభవానికి నిదర్శనంగా ఉన్నాయి. పలు ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం, కోట ప్రాంతాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులు తప్పకుండా లక్క మేడను సందర్శించి వెళ్తూ ఉంటారు.

పత్రికా రంగం.. సుందరయ్య



విజయవాడలో ప్రస్తుత ˆమున్న విశాలాంధ్ర భవన నిర్మాణం జరిగే సందర్భంగా ఆ ప్రాంతానికి 'సుందరయ్య నగర్' అని నామకరణం చేయాలని అప్పటి పార్టీ విజయవాడ నగర కమిటీ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ననుసరించి ఆయన పేరుతో ఒక బోర్డు పెట్టి ఆ సందర్భంగా జరిగిన సభలో నాయకులు ప్రసంగించారు. ఆ వార్తను 'సుందరయ్య నగర్ ప్రారంభోత్సవం' శీర్షికతో విశాలాంధ్రలో ప్రచురించారు. ఆ వార్త పేపరులో పడిన సాయంత్రమే సుందరయ్య ఎక్కణ్ణుంచో విజయవాడ వచ్చారు. పత్రికలో ఆ వార్త చూసి ఆయనెంతో చికాకు పడ్డారు. తతిమ్మా ఎడిషన్లలో ఆ వార్త ప్రచురించవద్దని ఆయన సంపాదకవర్గాన్ని కోరారు. తర్వాత తన పేరుతో ఏర్పాటు చేసిన బోర్డును కూడా తీసివేయించారు. ఆ విధంగా ఆయన వ్యక్తి ఆరాధనాతత్వాన్ని వ్యతిరేకించి ఆనాడే తన విలక్షణమైన వ్యక్తిత్వాన్ని నిరూపించుకున్నారు. జనశక్తి దినపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా జరిగే సభ అది. హాజరైన జనం 'సుందరయ్య జిందాబాద్' అని నినాదాలు చేస్తుంటే ఆయన వారిని వారించారు. అలాంటి నినాదాలు తనకు నచ్చవనీ, తాను చనిపోయేంతవరకూ కమ్యూనిస్టుగా ఉండి విధి నిర్వహణలో మృతి చెందినప్పుడే అలాంటి పొగడ్తలు కురిపించవచ్చుగానీ.. తాను జీవించి ఉండగా జిందాబాద్ నినాదాలు ఇవ్వొద్దని ఆయన నిర్బంధంగా చెప్పారు. అలాగే తన పేరిట విగ్రహాలను వేయడాన్ని కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టేవారు. విగ్రహాలకు బదులుగా గ్రంథాలయాల వంటివాటిని స్థాపించి ప్రజల్లో చైతన్య, విజ్ఞాన కాంతులను ప్రసరింపచేయాలని కోరేవారు. సుందరయ్యకు ఓసారి పెద్ద జబ్బు చేసింది. ఆయన మాస్కోకు చికిత్సకు వెళ్లేముందు మద్రాసు ఆసుపత్రిలో ఉంటున్న ఆయనను పరామర్శించి వీడ్కోలు చెప్పేందుకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మద్రాసు వెళ్లారు. మీరు ఆరోగ్యంతో తిరిగి రావాలని తాను ఆంకాంక్షిస్తున్నాననీ, అయితే ఈ సందర్భంగా మీ కోరిక ఏమిటనీ సుందరయ్యను ప్రశ్నించారు. దీనికాయన తనకెలాంటి సదు పాయాలూ సమ కూర్చవద్దనీ, తెలంగాణా పోరాటంలో పాల్గొని ఇంకా జైళ్లలో మగ్గుతున్న కమ్యూనిస్టులను విడుదల చేస్తే సంతోషించగలననీ చెప్పారు. ఈ విషయమై ఎంతోకాలంగా విన్నపాలు పంపినా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సుందరయ్య కోరిక మేరకు ఆనాటికి జైళ్లలో ఉన్న తెలంగాణా పోరాట యోధులందరినీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలంగాణా వీరుడు నల్లా నరసింహులు తన ఆత్మకథలో రాసుకున్నారు.

సుందరయ్య మాస్కోలో చికిత్స పొందుతున్న సందర్భంలో జనశక్తి పత్రికలో.. ఆసుపత్రిలో ఉన్న సుందరయ్యను సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుస్లోవ్ వచ్చి పరామర్శించారనే వార్త వచ్చింది. ఈ వార్తను సుందరయ్య మాస్కోలో చూశారు. వెంటనే అప్పటి జనశక్తి సంపాదక బాధ్యతలు చూస్తున్న బొమ్మారెడ్డికి సుందరయ్య మాస్కో నుంచి ఓ ఉత్తరం రాశారు. 'నేనుగానీ, లీలగానీ ఈ వార్తను పంపలేదు. ఇక్కడ డాక్టర్లు తదితరులు నన్ను శ్రద్ధగా చూస్తున్నారనేది వాస్తవమే. కానీ సుస్లోవ్ వచ్చి నన్ను పరామర్శించారన్నది నిజంకాదు. ఆ వార్త మీకెలా వచ్చిందో. అది సున్నితమైన అంశమిది. మన పత్రికలో ఆ పొరబాటును సరిదిద్దండి' అని ఉత్తరంలో రాశారు. సుస్లోవ్ అంతటి గొప్ప నాయకుడు తనను పరామర్శించడానికి వచ్చినా.. ఆనాటి రాజకీయ పరిస్థితి దృష్ట్యా నిర్మొహమాటంగా ఆ వార్తను సరిచేయమనడం సుందరయ్య సున్నిత రాజకీయ దృక్పథానికి చిహ్నం. ఆయన అనారోగ్యంతో ఉన్నా అదే ఉత్తరంలో.. ఇక్కడ కామ్రేడ్స్ పరిస్థితి గురించి సవివరంగా తెలుపాల్సిందిగా రాయడం విశేషం. సుందరయ్య క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించేవారు. ఓసారి ప్రజాశక్తిలో పనిచేసేవారిలో అకస్మాత్తుగా నలుగురు సబెడిటర్లు జబ్బు పడ్డారు. ఆ సమయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న బొమ్మారెడ్డి వద్దకు సుందరయ్య వచ్చి.. అస్వస్థత చెందిన సబెడిటర్లు తిరిగి పనిలోకి వచ్చేంతవరకూ రచయితలుగా ఉన్న నలుగురిని నేను పంపుతాను. అందుకు నీవు అంగీకారం తెలుపుతావా? అని అనుమతి కోరారు. నిజంగా ఆయన స్థానమేమిటీ, నా స్థానమేమిటీ అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్న తన అంగీకారాన్ని కోరడం సుందరయ్య క్రమశిక్షణకూ, నమ్రతకూ ప్రబల నిదర్శనమని బొమ్మారెడ్డి తన స్వీయ గ్రంథం 'జ్ఞాపకాలు–అనుభవాలు'లో పేర్కొన్నారు.

విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అప్రమత్తత అవసరం

విద్యుత్ శాఖ నరసాపురం ఇఇ కె.మధుకుమార్

ప్రజాశక్తి - నరసాపురం



అవగాహనా లోపం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం.. వెరసి ప్రాణాలు బలవుతున్నాయి. విద్యుదాఘాతానికి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాద మరణాలు అందరిని ఆవేదనకు, ఆందోళనకు గురి చేస్తున్నాయి. వర్షాకాలంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. కరెంట్ విషయంలో జాగ్రత్త వహించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నరసాపురం విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. కొంతమంది ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటుండటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పొలాల్లో రైతులకు ఏర్పడే ఇబ్బందులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మధు కుమార్ పలు సూచనలు చేశారు. తడిసిన కరెంట్ స్థంబాలను, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ లైన్‌కు చెట్టుకొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. పార్కుల్లో గాని, స్టేడియంలో గాని విద్యుత్ స్తంబాలు ముట్టుకోరాదన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదన్నారు. బయటపెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాని, ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదన్నారు. గాలి, దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు 'డిష్' కనెక్షన్ తీసివేయాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు టివి, ఫ్రిడ్జ్, వాటర్ మోటార్స్, కంప్యూటర్ల స్విచ్ ఆఫ్ నమోదు చేయాలన్నారు. కరెంటు లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయితే సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి కరెంటు వస్తువుకు 'ఎర్త్' తప్పనిసరిగా ఉండాలన్నారు.

ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు ఇలా...

రైతులు కరెంటు స్తంభం నుంచి స్టార్టర్ వరకు వినియోగించే వైరు నాసిరకంగా ఉండకుండా చూసుకోవాలి. లేకుంటే పై కవర్ పేలిపోయే అవకాశం ఉంటుంది. ఫీజు వ్యవస్థను మరచిపోవడం, నేరుగా స్టార్టర్‌కు వైర్ల కనెక్షన్ ఇస్తుండడంతో ఆ వైర్లకు స్పార్క్ వచ్చి ఊడిపోయి స్టార్టర్ డబ్బాకు తగలడాన్ని రైతు గమనించకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. కొత్త మోటారుకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో స్తంభం వద్ద వైర్లను గట్టిగా కలపకుండా కొక్కేలు తట్టించడంతో గాలికి వైర్లు కదిలి స్పార్క్‌తో వైర్లు అరిగిపోయి అనుకోకుండా పొలంలో తెగిపడిపోయిన సమయంలో గమనించకుండా అందులోకి వెళ్లడం, అడవిపందుల కోసం పొలం చుట్టూ వైర్లు చుట్టి, కరెంటు కనెక్షన్ ఇవ్వడంతో గమనించకుండా మనుషులు, పశువులు ఆ తీగలకు తగిలి షాక్‌కు గురి కావడం, కర్ర స్తంభాలను అనధికారికంగా పొలం గట్లపై వేసి, సర్వీస్ వైరు, అతుకుల వైరు వాడడంతో గాలివాన బీభత్సంతో తెగి పోయి ప్రమాదాలు సంభవిస్తాయి. కరెంట్ తీగలు, స్టార్టర్ వరకు అమర్చే సర్వీసు వైర్లు తెగిననప్పుడు, ఎలాగైనా మోటారు నడవాలని వాటిని అతికించే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్టార్టర్ డబ్బాలు భూమిపై అడ్డంగా పడేయడంతో ఎలుకలు అందులోకి చేరి, కట్ చేసిన వైర్లు ఇనుప డబ్బాకు తాకడం వల్ల షాక్ వస్తుంది. ఇళ్లల్లో కూడా అడ్డదిడ్డంగా కరెంట్ వైర్లను అమర్చుకోవడం వల్ల సీలింగ్ ఫ్యాన్లకు బాడీ షాట్ వచ్చి, ఇంటి నిర్మాణం కోసం వాడిన ఇనుప చువ్వల ద్వారా ఇళ్లంతా షాక్ వస్తుంది. వ్యవసాయ బావుల వద్ద నూతనంగా వేసిన బోర్లలో పైపులు దింపే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలను గమనించకపోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతుంది. ఎన్‌పిడిసిఎల్ అధికారుల సూచనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని విద్యుత్ శాఖ ఇఇ మధు కుమార్ సూచించారు.



నాసిరకం, కల్తీ మద్యంతో అనారోగ్యం పాలు

ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు

ప్రజాశక్తి - నరసాపురం



తక్కువ ధరకు లభిస్తుందని నాసిరకం, కల్తీ మద్యాన్ని తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కల్తీ మద్యం వంటి నేరాలు దృష్టికి వస్తే 9440902438 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కల్తీ మద్యం, కల్లు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, ఎవరైనా వాటిని విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. నకిలీ మద్యం సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్స్ పొందిన షాపుల నుంచే మద్యం కొనుగోలు చేయాలన్నారు.





చిదిమేసినా... అంకురించి.. మహా వృక్షమై...

రైతాంగ పోరాటానికి అండగా ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ వున్నదని, కమ్యూనిస్టులను చెట్లకు కట్టేసి నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనే 17 మందిని కాల్చి చంపితే, అందులో ఐదుగురు ఒక్క చించినాడ గ్రామంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆ విధంగా అమరులైన వారిలో చించినాడ తొలి శాఖ సభ్యులు రుద్రరాజు గోపాలరాజు, రుద్రరాజు అయ్యపరాజు, బూసి ముసలయ్య, అల్లూరి రామరాజు, బూసి వెంకట్రావు ఉన్నారు. ఈ ఐదుగురిని 1950 ఫిబ్రవరి 22 నుండి జులై 9 మధ్య ఐదు మాసాల లోపే కాంగ్రెస్ భూస్వాముల సహకారంతో పోలీసులు కాల్చి చంపారు. ఇక గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించామని భూస్వామ్య పాలక వర్గం, పోలీసువారు భావించారు. సరిగ్గా ఈ సమయంలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా ఉన్న చించినాడ గ్రామస్తుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎస్) ఈ పరిణామాలకు రగిలిపోయి గ్రామంలో ఎర్రజెండా రెపరెపలాడాలని, ప్రజల కష్టాలు తీరాలని కంకణం కట్టుకున్నారు. ఆయనకు కేతా సూర్యారావు తదితరులు తోడయ్యారు. చిదిమేసినా...పార్టీని తిరిగి అంకురింపచేశారు.

కష్టజీవులను ఏకం చేసి మహా ఉద్యమం చేయాలని కమ్యూనిస్టులు భావిస్తే, మొగ్గలోనే తుంచేయాలని పాలక వర్గాలు తలుస్తుంటాయి. 1946-51 మధ్య చారిత్రాత్మకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సైనిక బలగాల ద్వారా అణచివేయాలని భావించిన నెహ్రూ ప్రభుత్వం... కమ్యూనిస్టుల పైన, ప్రజలపైన విరుచుకుపడి 4 వేల మంది ప్రాణాలను బలితీసుకుంది. సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించడంతో పార్టీపై నిషేధం విధించారు. రైతాంగ పోరాటానికి అండగా ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ వున్నదని, కమ్యూనిస్టులను చెట్లకు కట్టేసి నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనే 17 మందిని కాల్చి చంపితే, అందులో ఐదుగురు ఒక్క చించినాడ గ్రామంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆ విధంగా అమరులైన వారిలో చించినాడ తొలి శాఖ సభ్యులు రుద్రరాజు గోపాలరాజు, రుద్రరాజు అయ్యపరాజు, బూసి ముసలయ్య, అల్లూరి రామరాజు, బూసి వెంకట్రావు ఉన్నారు. ఈ ఐదుగురిని 1950 ఫిబ్రవరి 22 నుండి జులై 9 మధ్య ఐదు మాసాల లోపే కాంగ్రెస్ భూస్వాముల సహకారంతో పోలీసులు కాల్చి చంపారు. ఇక గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించామని భూస్వామ్య పాలక వర్గం, పోలీసువారు భావించారు. సరిగ్గా ఈ సమయంలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా ఉన్న చించినాడ గ్రామస్తుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎస్) ఈ పరిణామాలకు రగిలిపోయి గ్రామంలో ఎర్రజెండా రెపరెపలాడాలని, ప్రజల కష్టాలు తీరాలని కంకణం కట్టుకున్నారు. ఆయనకు కేతా సూర్యారావు తదితరులు తోడయ్యారు. చిదిమేసినా...పార్టీని తిరిగి అంకురింపచేశారు.

స్థానిక పోరాటాలతో పార్టీ నిర్మాణం

పాలక వర్గ హింసతో ప్రజలు భయభ్రాంతులై కమ్యూనిస్టు పార్టీ వైపు పోరని, అక్కడితో ఆగిపోతారని భావించారు. కాని రెట్టించిన ఉత్సాహంతో యువత పార్టీ వైపు వచ్చారు. ఆనాడు గ్రామంలో కూలి రేట్లు బాగా తక్కువగా ఉండేవి. పనిలేని రోజుల్లో ప్రజలు పస్తులుండేవారు. ఆకలి తీర్చుకోవడానికి తాటిపండ్లు కాల్చుకు తినేవారు. ఈ విధంగా సంవత్సరంలో 3 మాసాలు (ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు) పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ గ్రహించి కలక్టరేట్‌కు ఆకలి యాత్రలు నిర్వహించి ప్రభుత్వం బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. పార్టీనే స్వయంగా భూస్వామ్య, ధనిక రైతుల నుండి ప్రొక్యూర్‌మెంట్ రేటుకు సంవత్సరానికి 1000 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి మిల్లు ఆడించి...బయట మార్కెట్‌లో కిలో రూ.8 అమ్ముతుంటే రూ.1.15 పైసలకే అమ్మి పేదల ఆకలి తీర్చింది. కష్టజీవులను ఏకం చేసి పోరాడి కూలీ రేట్ల పెంపుదల సాధించింది. భూస్వాములు కక్షగట్టి చించినాడ గ్రామంలో కూలీలను పిలవకుండా బయట గ్రామంలో కూలీలను తెచ్చి పని చేయిస్తుంటే ప్రతిఘటించింది. ప్రభుత్వంపై పోరాడి లక్షల రూపాయల గ్రాంట్లు తెచ్చి ఆనాడే పనికి ఆహార పథకం సాధించింది. దీనితో పార్టీ పట్ల పేద, మధ్య తరగతి ప్రజల్లో ఎనలేని విశ్వాసం ఏర్పడింది. ఈ అంశాలన్నిటితో భూస్వామ్య వర్గాలు కమ్యూనిస్టు పార్టీపై కక్ష పెంచుకున్నాయి. నాటి కాంగ్రెస్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పరకాల శేషావతారం సహకారంతో పార్టీపై నిర్బంధం ప్రయోగించారు.



త్యాగాలు లేనిదే కమ్యూనిస్టు ఉద్యమం లేదు

కమ్యూనిస్టు పార్టీని దెబ్బ కొట్టాలంటే పేదల్లో చీలిక ద్వారానే సాధ్యమౌతుందని గ్రహించిన భూస్వామ్య వర్గాలు ఎస్.సి, బి.సి పేటల లోని కొంతమందిని లంక భూములు ఇప్పిస్తామని, పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇతర ప్రలోభాలు పెట్టి కొద్దిమందిని చీల్చారు. 1977-80 సంవత్సరాలలో భూస్వామ్య శక్తులు వెనకుండి ఉసిగొల్పి దాడులు చేయించి ఆరుగురు సిపిఎం కార్యకర్తలను (యాండ్ర సత్యనారాయణ, వీరవల్లి నారాయణ, పంతగాని సూరన్న-చించినాడ, అనిశెట్టి కాళిదాసు, గుబ్బల సాంబమూర్తి-కాజ, గుబ్బల రామలింగయ్య-కలగంపూడి) హత్య చేయించారు. ఈ సమయంలో జరిగిన దాడిలో కేతా సూర్యారావు చేయి ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది. అనేక మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పురుషులకు ధీటుగా వీరవనితలు పోరాటంలో పాల్గొని శత్రువుని వణికించారు. ఈ కాలంలోనే ఆర్.ఎస్, కేతా సూర్యారావు మరో 40 మంది ఏళ్ళ తరబడి జైలు జీవితం, అజ్ఞాతవాసం గడిపారు. 150 మంది కేసులు మోపబడి కోర్టులు చుట్టూ తిరిగారు. ఈ సమయంలో నాయకులు, ముఖ్య కార్యకర్తలు తిండికి, నిద్రకు, కుటుంబాలకు దూరమయ్యారు. శారీరక హింసలే కాక, మానసిక వేదనకు గురయ్యారు. అయినప్పటికీ ముందుకే కదిలారు. ఎన్నో త్యాగాల ఫలితంగానే గ్రామంలో పార్టీ బలోపేతం అయింది.



కమ్యూనిస్టులకు అధికారమిస్తే ఏం సాధిస్తారో చూపించిన గ్రామం

చించినాడ గ్రామ పంచాయతీ 1933-53 వరకు పెత్తందార్ల పాలనలో ఉంది. 1953లో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఆర్.ఎస్ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నాటి నుండి 2021 వరకు 68 సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అవిచ్ఛిన్నంగా సిపిఎం జెండా ఎగిరింది. 62 సంవత్సరాల పాటు (1957 నుండి 2019 వరకు) వ్యవసాయ పరపతి సంఘం సొసైటీని నడిపింది. ఫీల్డ్ లేబర్ సొసైటీ ఏర్పాటు చేసి 60 ఎకరాలను పంచి 270 మంది పేదలకు పట్టాలు ఇప్పించింది. కో ఆపరేటివ్ సొసైటీ రూ.50 వేలతో ఏర్పాటు చేసి రూ.5 కోట్ల టర్నోవర్‌కి పెంచింది. గ్రామంలోని పంచాయతీ, ప్రభుత్వ స్థలాలలో వెయ్యి కొబ్బరి చెట్లు పెంచి లక్షల రూపాయలు పంచాయతీకి ఆదాయం వచ్చే చర్యలు చేపట్టింది. ప్రతి పేటలో స్కూలు, కమ్యూనిటీ హాలు, సి.సి రోడ్లు, మంచినీరు అందించింది. గ్రంథాలయాన్ని నిర్మించింది. పాలక పార్టీలు సహకరించకపోయినా ఉన్న వనరులతోనే గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసింది.

నేడు మరింత కృషి అవసరం

ప్రజలు ఐక్యంగా వుంటే తమ దోపిడీ పాలన సాగదనుకున్న పాలకవర్గాలు మతం, ప్రాంతం, కులం, భాష, లింగ పరంగా విభజించే ప్రయత్నాలే సాగిస్తున్నాయి. పాలక పార్టీలు అనేకం పుట్టుకొచ్చి శ్రామిక వర్గాన్నే మరింత చీల్చేస్తున్నాయి. అనేక భ్రమలు కలిగించి తమతోనే ఉండే విధంగా విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. భూస్వామ్య, ధనిక శక్తులు పార్టీల పరంగా చీలిపోయినా వర్గ సమస్యలపుడు వారంతా సులభంగా ఒక్కటైపోతున్నారు. కాని శ్రామిక వర్గం కుల, రాజకీయ వైరుధ్యాలతో చీలిపోయేలా చేస్తున్నారు. శ్రామిక వర్గాన్ని కూడగట్టడం సంక్లిష్టంగా మారిన నేటి పరిస్థితుల్లో మరింత నైపుణ్యంతో నూతన పద్ధతులలో పని చేయాలి. ప్రజలకు మరింత చేరువ అవ్వడం ద్వారానే తిరిగి చెదిరిపోయిన శ్రేణులను రాబట్టుకోగల్గుతాం. ఉద్యమాన్ని పున:నిర్మించి ముందుకు తీసుకుపోవడమే అమరవీరులకు మనం అర్పించే ఘన నివాళి.

– జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం

ఆహ్లాదకరంగా మేడపాడు క్రిస్టియన్ హాస్టల్

అనాథలను అక్కున చేర్చుకుని ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న నిర్వాహకులు


హాస్టల్ లోపల చక్కని సుందరమైన ప్రవేశ మార్గం

ప్రజాశక్తి - యలమంచిలి

అదొక క్రిస్టియన్ మిషనరీ సంస్థకు చెందిన చిల్డ్రన్ హోం. అయితే ఈ హాస్టల్ ఆవరణలోకి ఎవరు ప్రవేశించినా ఇక్కడి ప్రకృతి అందాలను చూసి ఇది నిజంగానే హాస్టలా? లేక పూలవనమా అన్న అనుమానం కలుగక మానదు. ఎందుకంటే లోపలికి వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న రకరకాలైన రంగురంగుల పూలమొక్కల సోయగాలను చూస్తే మనసు పులకించక మానదు. ప్రాంగణంలో ఉన్న పచ్చటి వనాలను చూసినా, పిల్లలు బస చేసే భవనాలను చూసినా మనసు ఆనందంతో పరవశిస్తూ వేరే ప్రపంచంలోకి వచ్చామా.. అనే అనుభూతి కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. అదే మండలంలోని మేడపాడులోని క్రిస్టియన్ సర్వీస్ చిల్డ్రన్ హోం ప్రత్యేకం..

ఈ హాస్టల్ చూడడానికి ఎంత సుందరంగా ఉంటుందో అదే స్థాయిలో ఈ హాస్టల్ యాజమాన్యం, ఇక్కడ ఉండే విద్యార్థులు కూడా అంతే క్రమశిక్షణతో విద్యార్థులు నేర్పిస్తూ, కన్న తల్లిదండ్రుల కంటే మిన్నగా బాధ్యత వహిస్తూ, వారిని పైస్థాయి చదువులు చదువుకునేందుకు పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తూ, గత 33 ఏళ్లుగా సంస్థ అప్రతిహతంగా ముందుకు దూసుకు వెళ్తూ పలువురి ప్రశంసలు అందుకుంటుంది.

విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహారం..

హాస్టల్‌లో బస చేసే విద్యార్థులకు ఆహారంలో వారానికి మూడుసార్లు కోడిగుడ్లు, ఒకసారి చికెన్, రెండుసార్లు చేపలకూర, మిగిలిన రోజులు పప్పు, ఆకుకూరలు, ఉదయం అల్పాహారం. స్కూల్ నుంచి వచ్చిన వెంటనే సాయంత్రం సమయంలో రోజుకు ఒక స్నేక్ చొప్పున ఇవ్వడంతో పాటు వారానికి మూడు రోజులు అరటి పళ్ళు, ఖర్జూరం లాంటి ఫలాలను ఇవ్వడంతో పాటు భోజనంలో ప్రతిరోజు బట్టర్ మిల్క్‌ను ఇస్తున్నారు. ఒక సంవత్సరం నుంచి పది సంవత్సరాలలోపు ఉండే విద్యార్థులకు 150 గ్రాముల పాలను అందిస్తారు.

వైద్యపరంగా పిల్లలకు సంరక్షణ..

హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఏ చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా వారికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంకా అత్యవరమైన అనారోగ్య సమస్య వస్తే పెద్ద ఆసుపత్రులలో కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వారు పూర్తిగా కోలుకొనే వరకు బాధ్యత తీసుకుంటారు.

క్రాచ్ ద్వారా డే కేర్ విద్యార్థులకు ట్యూషన్

హోమ్‌లో ఉండే విద్యార్థులతోపాటు మేడపాడు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, క్రిస్టియన్ మిషన్ సర్వీస్ ద్వారా వారికి సహాయం పొందే విధంగా బాధ్యత వహిస్తూ మొత్తం 140 మంది పిల్లలు ఈ హాస్టల్ ద్వారా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ఎంతోమంది ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారు

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే మా కర్తవ్యం

హాస్టల్ వార్డెన్ పడాల జ్ఞానప్రకాష్

అనాథలను అక్కున చేర్చుకుంటూ ప్రతి విద్యార్థికీ జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, ఎదిగే హక్కు, పాల్గొనే హక్కు కలిగి ఉన్నారని, దానికి అనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి తమ సంస్థ అనేక ఏళ్లుగా కృషి చేస్తూ ఉంది. తమ హాస్టల్‌లో తల్లిదండ్రులు లేని పిల్లలు గాని లేదా సమాజంలో వివిధ అఘాయిత్యాలకు, దాడులకు గురైన వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఏలూరు వారి ద్వారా ప్లేస్‌మెంట్ ఆర్డర్ పొంది, తమ హాస్టల్‌లో జాయిన్ అయ్యే అవకాశం ఉందని, దీన్ని తల్లిదండ్రులు లేని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కుల సమస్య పరిష్కరించబడాలంటే... బూర్జువా, భూస్వామ్య పాలనను తొలగించి...జనతా ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుని...సోషలిజం వైపు ప్రయాణం ప్రారంభించాలి.

- బి.టి. రణదివే,
భారత కార్మికోద్యమ నిర్మాత.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

అందరూ అప్రమత్తంగా ఉండాలి

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సంతోష్ కుమార్



ప్రజాశక్తి - నరసాపురం

వర్షాకాలం వచ్చేసింది.. వర్షాలతో పాటు వ్యాధులు సైతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పారిశుధ్యం సరిగ్గా లేకపోతే మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఎటువంటి వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాతావరణ మార్పులతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈక్రమంలో రోగాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ ఆర్.సంతోష్‌కుమార్ వివరించారు.

డెంగీ..

డెంగీకి సకాలంలో చికిత్స చేయించుకోకుంటే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. వణుకుతో కూడిన జ్వరంతో పాటు మోకాళ్ల నొప్పులు, నోరు చేదు, ఆకలి మందగించడం వంటి లక్ష ణాలు ఉంటాయి. రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం జరుగుతుంది. ఒక్కోసారి కోమాలోకి వెళ్లే అవకాశం ఉంది.

డయేరియా..

కలుషిత నీరు తాగడం, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపిస్తుంది. విరేచనాలు, వాంతులు, నీరసంగా ఉండటం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధికి ఫ్లూయిడ్స్ ద్వారా చికిత్స అందిస్తారు.

మలేరియా..

దోమ కాటు వల్ల మలేరియా వస్తుంది. మలేరియాలో రెండు రకాలు ఉంటాయి. వీటిలో వైవాక్స్ మలేరియా అంత ప్రమాదకరం కాదు. పాల్సిపోం మలేరియా మాత్రం ప్రమాదకరం. సరియైన చికిత్స లేకుంటే సెరిబ్రల్ మలేరియాగా మారి రోగి మరణించే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, తల నొప్పి, చలితో వణుకు, చెమటలు పట్టడం ఈ వ్యాధి లక్షణాలు.

టైఫాయిడ్..

కలుషిత నీరు తాగటం, బహిరంగ మలవిసర్జన ద్వారా వ్యాప్తి చెందే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ వస్తుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, నీరసం, వాంతులు ఈ వ్యాధి లక్షణాలు.

కామెర్లు..

కలుషిత నీరు, ఆహారం వల్ల ఈ వ్యాధి వస్తుంది. మద్యం ఎక్కువగా తీసుకున్న కామెర్లు వచ్చే అవకాశం ఉంది. మూత్రం పసుసు రంగులో రావడం, కడుపులో నొప్పిగా ఉండటం, వాంతులు, విరేచనాలు, నల్లగా మారడం, జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి పరిసరాల్లో మురుగునీరు చేరకుండా చూసుకోవాలి. రాత్రిళ్లు దోమ తెరలు వాడాలి. దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న రబ్బరు టైర్లు, కొబ్బరి బొండాలను దూరంగా పడేయాలి. దోమల నివారణకు మందులు వాడాలి. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోకూడదు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. వేడి వేడి ఆహారం తీసుకోవాలి. బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆహార పదార్థాలపై మూతలు ఉంచుకోవాలి. పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసర ప్రాంతాల్లో చెత్త లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తత అవసరం

ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జలుబు వంటి వాటిపై కూడా జాగ్రత్తగా ఉండాలి. వరుసగా అనారోగ్యానికి గురైన వారు రక్త పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి సోకిన వారికి సకాలంలో చికిత్స అవసరం.

ప్లే వే మెథడ్స్‌తో విద్యాబోధన

విద్యాజ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ ద్వారంపూడి వెంకట శ్రీనివాసరెడ్డి



ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్లే వే మెథడ్స్‌తో విద్యాబోధన చేస్తూ దశాబ్దాల కాలంగా స్కూల్‌ని విజయవంతంగా నడుపుతున్నామని మండలంలోని ఆలమూరు గ్రామంలోని శ్రీగీతా ఆశ్రమం సమీపంలో ఉన్న విద్యాజ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ద్వారంపూడి వెంకట శ్రీనివాసరెడ్డి, డి.జ్యోతి అన్నారు. నర్సరీ నుండి 7వ తరగతి వరకు విద్యార్థులకు ఎపి స్టేట్ సిబిఎస్ఇ అండ్ ఐసిఎస్ఇ కమ్యూనికేషన్ విధానంలో అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందని తెలిపారు. అధునాతన సౌకర్యాలతో క్లాస్ రూమ్స్ నిర్వహణ, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపుదల, యోగా శిక్షణతో పాటు గుడ్ హ్యాండ్ రైటింగ్, నృత్యంలో శిక్షణ ఇస్తున్నామని వారు పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదరణ, అభిమానంతో తమ విద్యాజ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పురోగతి చెందుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి.

పాలకొల్లుకు పెద గోపురమంత చరిత్ర

105 ఏళ్లు పూర్తి చేసుకున్న పాలకొల్లు పురపాలక సంఘం

క్విట్ ఇండియా తీర్మానం చేసిన మొదటి మున్సిపాలిటీ పాలకొల్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

కళలకు కాణాచిగా, సినీ కళాకారులకు నిలయంగా, వ్యాపారరంగంలో అగ్రస్థానంలో పాలకొల్లు ఉంది. పాలకొల్లు పురపాలక సంఘం ఏర్పడి 105 సంవత్సరాలు దాటుతోంది. పంచారామాల్లో ప్రసిద్ధి క్షేత్రంగా పాలకొల్లు ఉంది. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ వేత్తల నిలయం క్షీరారామం. పాలకొల్లు నుంచి ప్రతి వీధికొక కళాకారుడు, పేటకొక నాటక పరిషత్ ఉంటుందనే నానుడి నేటికీ ఉంది. దాన ధర్మాలకు నేటికీ ప్రసిద్ధి చెందింది. పట్టణంలో ఇప్పటికీ అనేక సత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం ఇటీవల అమలు చేస్తున్నాయి. అయితే పాలకొల్లులో దశాబ్దాల కిందటే పేదలకు, పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు.. చేస్తున్నారు.

1919లో పాలకొల్లు పురపాలక సంఘం ఏర్పడింది. 1924ల్లో నిర్మించిన బంగ్లా ప్రస్తుతం ఇంకా ఉంది. 1900లోనే ఎంఎంకెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్‌ను స్థాపించారు. 1930లో నిర్మించిన బిల్డింగ్ నేటికీ ఉంది. 1930లో బ్రిటిష్ హయాంలో నిర్మించిన వాటర్ వర్క్స్ 10 సంవత్సరాల క్రితం వరకు ప్రజలకు తాగునీరు అందించింది. పాలకొల్లు నుంచి నరసాపురం సబ్ కలెక్టర్ బంగ్లాకు, ఒఎన్‌జిసికి ఇక్కడ నుంచే తాగునీరు వెళ్లేది. 1942లో క్విట్ ఇండియా తీర్మానం చేసిన మొదటి మున్సిపాలిటీ పాలకొల్లు కావడం విశేషం. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం పాలకొల్లు మున్సిపల్ కౌన్సిల్‌ను రద్దు చేసింది. అద్దేపల్లి సత్య నారాయణమూర్తి స్వాతంత్ర్య సమరయోధునిగా, దానశీలిగా ప్రసిద్ధి చెందారు. అద్దేపల్లి సత్రం వద్ద పిల్లలకు ఉచితంగా పాలు పోసేవారు. 1968లో ఆయన రైస్‌మిల్లు అమ్మి లక్షతో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. ఆ రైస్ మిల్లు విలువ నేడు రూ.100 కోట్లు ఉంటుంది. 1966లో ప్రభుత్వాసుపత్రికి 16 ఎకరాల పొలం దానం చేసారు ఇమ్మిడి సూరన్న. కనీసం ఆయన పేరు ఎక్కడా పెట్టడానికి అంగీకరించలేదు. 1982లో దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ



కళాశాలకు విరాళం ఇచ్చి స్థాపించారు. చోడిశెట్టి సూర్యరావు 19 సంవత్సరాలపాటు మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసి నేటి వాటర్ వర్క్స్, కళాశాలలు, మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి చేశారు. అల్లు వెంకట సత్యనారాయణ నాలుగుసార్లు, చేగొండి హరిరామజోగయ్య రెండు సార్లు, బంగారు ఉషారాణి, డాక్టర్ బాబ్జీ ఒక్కోసారి ఇక్కడ నుంచి ఎంఎల్ఎలుగా పని చేసి పాలకొల్లు అభివృద్ధికి కృషి చేశారు. నిమ్మల రామానాయుడు గతంలో అందరి కన్నా అభివృద్ధి చేశారని రాష్ట్రమంతా వైసిపి హవా నడిచినా 19 వేల మెజార్టీతో రెండోసారి ఎంఎల్ఏగా ప్రజలు పట్టంకట్టారు. మళ్లీ గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో మరోసారి నిమ్మల విజయ ఢంకా మోగించి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు సంపాదించారు.

పోరాడి సాధించిన ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల పోరాట ఫలితంగా... ఇన్సూరెన్స్, 180 రోజులు (6 నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, సర్వీసును బట్టి గ్రాట్యూటీ (గరిష్టంగా రూ.1,50,000 వరకు) చెల్లింపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, ఉద్యోగ నియామకాలలో మార్పు, స్థానిక సమస్యలపై 3 నెలలకు ఒకసారి అధికారులతో యూనియన్ జిల్లా కమిటీతో జాయింట్ మీటింగ్ వేయాలనే సర్క్యులర్లను ప్రభుత్వం జారీ చేసింది. సర్క్యులర్లు-రికార్డులు రాయాలని ఒత్తిడి చేయకూడదని కూడా వాటిలో పేర్కొంది.

ఎన్.హెచ్.ఎం స్కీమ్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయింది. ఈ కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ విభజిత ఆంధ్రప్రదేశ్ లోనూ ఆశా వర్కర్లు అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉన్నారు. పారితోషికాల పేరుతో ఆశా వర్కర్లకు జరుగుతున్న అన్యాయంపై పోరాడి 2019లో 10 వేల రూపాయలు ఫిక్స్‌డ్ గౌరవ వేతనం సాధించుకున్న మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఇటీవల మధ్యప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలలో కూడా సి.ఐ.టి.యు నాయకత్వంలో పోరాడి రూ.10,000 గౌరవ వేతనాన్ని సాధించుకున్నారు.

వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో గ్రామ స్థాయిలో పని చేస్తున్న ఆశా వర్కర్లకు గత 20 ఏళ్లుగా దేశంలో ఎక్కడా కూడా మెటర్నిటీ లీవ్ అమలు కాకపోవడం అత్యంత అమానవీయం. డెలివరీ అయిన తర్వాత ఆరు నెలల వరకు ఆశాలు తల్లిబిడ్డలను సంరక్షించాలి. కానీ అదే ఆశా వర్కర్ తల్లి అయినప్పుడు మెటర్నిటీ లీవ్ లేని కారణంగా ప్రసవం తర్వాత వారం రోజులకే డ్యూటీకి వెళ్లకపోతే ఉద్యోగం పోతుందనే భయంతో పసిబిడ్డతో డ్యూటీలు చేయాల్సి వస్తున్నది. మెటర్నిటీ లీవ్ లేని కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారు. వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని యూనియన్ చేసిన పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆరు నెలలు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌ను ఆశాలకు అమలు చేస్తూ జీవో విడుదల చేసింది. ఎన్నో ఏళ్లుగా నిర్బంధాలు, అక్రమ కేసులు ఎదుర్కొని ఆశా వర్కర్లు సాగించిన పోరాట విజయమిది.

వయోపరిమితి పెంపు

ఆశా వర్కర్లకు వయోపరిమితి పెంపు, మెటర్నిటీ లీవు, గ్రాట్యూటీ చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2025 మార్చి 1వ తేదీన అసెంబ్లీలో ప్రకటించారు. నాటి నుండి జీవోలను విడుదల చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు రాయబారాలు నిర్వహించారు. పిహెచ్‌సి స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళన పోరాటాలు నిర్వహించారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి జీఓ ఎం.ఎస్ నెంబర్ 94 (12/8/2025) విడుదల చేసింది. అదే రోజు నుండి ఈ జీవో అమలులోకి వస్తుందని కూడా ప్రభుత్వం ప్రకటించింది.

రిటైర్మెంట్ బెనిఫిట్లు

ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించాలని 113 జీవోలో పేర్కొన్నప్పటికీ ఇంతకాలంగా అవేవీ లేకుండానే రిటైర్మెంట్ చేస్తూ వచ్చారు. గత వై.సి.పి ప్రభుత్వం ఆ జీవోను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్ కింద ఉద్యోగ విరమణ పొందే ఆశా వర్కర్ ఆఖరి నెల జీతంలో సగం, తాను పనిచేసిన సంవత్సరాలకు లెక్కగట్టి (ప్రస్తుతం 10,000 వేతనం. అందులో సగం 5000) సంవత్సరానికి 5000 రూపాయల చొప్పున చెల్లించేలా జీఓ లో పేర్కొన్నారు. 1,50,000కు పరిమితి విధించింది. దేశంలోనే గ్రాట్యూటీ చట్టం మొదట అమలవుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

బీమా సౌకర్యం

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆశాలకు ప్రభుత్వం ఎలాంటి బీమా సౌకర్యం కల్పించలేదు. వీరికి గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని యూనియన్ చేసిన పోరాట ఫలితంగా ప్రభుత్వం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను (ప్రీమియం 436 ప్లస్ 20 ప్రభుత్వమే చెల్లిస్తుంది) ఆశా వర్కర్లకు వర్తింపచేస్తూ సర్క్యులర్ విడుదల చేసింది. 50 సంవత్సరాలు లోపు సహజ మరణం పొందిన ఆశా వర్కర్లకి రూ.2 లక్షలు, ప్రమాదవ శాత్తు మరణిస్తే రూ.4 లక్షలు...50 సంవత్సరాలు దాటిన వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే 2 లక్షల రూపాయలు బీమా సంస్థ ద్వారా అందుతాయి. ఈ రెండు పథకాలకు ఆంధ్ర రాష్ట్రంలో మాత్రమే ఆశాలకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తున్నది. 2025 జూన్ నుండి ఈ రెండు పథకాలూ ఆశాలకు అమలవుతున్నాయి.

గతంలో ఆశా వర్కర్ల నియామకం-తొలగింపులో గ్రామ సర్పంచ్/కార్పొరేటర్ కీలక పాత్ర పోషించేవారు. శానిటేషన్ కమిటీ సభ్యులతో సంతకాలు చేయించి తమకు నచ్చిన వారిని ఆశాలుగా నియమించేవారు. ఆశా వర్కర్ల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని యూనియన్ చేసిన పోరాట ఫలితంగా ప్రభుత్వం నియామకాలలో మార్పు తెచ్చింది. ఒక ఆశ వర్కర్ పోస్ట్‌కి ఎంతమందైనా దరఖాస్తు పెట్టుకోవచ్చు. మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతాయి. ఎవరైనా తమకు అన్యాయం జరిగిందని భావిస్తే పై అధికారులకు లేదా కోర్టుకు వెళ్లి మెరిట్‌ని నిరూపించుకోవడం ద్వారా ఆశా ఉద్యోగం పొందే అవకాశం ఉన్నది.

సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

తాము అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. ఈ హామీ ఇంకా నెరవేరాల్సి ఉంది. అదేవిధంగా ఆశాలు నిరంతరం ఎదుర్కొంటున్న వారాంతపు సెలవులు, పని భారం సమస్యలున్నాయి. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఆశా వర్కర్లకు అమలవుతున్న విధంగా వేతనాలు, గ్రాట్యూటీ తదితర సౌకర్యాలన్నీ అమలు కావడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలోని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రభుత్వం వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు సాధించుకునేందుకు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షను తిప్పికొట్టేందుకు భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలి.

-కె.ధనలక్ష్మి,
ఎ.పి ఆశా వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) ప్రధాన కార్యదర్శి

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

చింతపర్రు సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు



ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందని సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు అన్నారు. సర్పంచిగా ఎన్నికై నాలుగున్నర సంవత్సరాలవుతుందని, ఈ కాలంలో పార్టీ, కుల, మతాలు, గ్రూపు విభేదాలు లేకుండా ప్రతి సమస్యనూ సున్నితంగా గ్రామస్తులు, ఉద్యోగుల సహాయంతో పరిష్కరించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గామంలోని వివిధ ప్రాంతాల్లో రూ.70 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, ప్రజు నీటి కష్టాలు తీర్చేందుకు రూ.1.23 కోట్లతో ఒహెచ్ఆర్ వాటర్ ట్యాంకు, మైక్రో ఫిల్టర్ బెడ్లు, పంపు హౌస్ వంటివి నిర్మించామని తెలిపారు. ఎస్సి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. దుళ్ల చెరువు, బాడవ చెరువు మట్టి పూడిక తీసి పశువులకు నీటి కొరత లేకుండా చేశామని తెలిపారు. గ్రామంలో వాడకపు నీరు నిల్వ లేకుండా బగేశ్వరం మురికి కాలువ వరకు మురుగు బోదెలు తవ్వించి, గ్రామంలో అవసరమైన చోట్ల డ్రెయినేజీలు నిర్మించాం. ఎస్సి శ్మశానవాటిక శుభ్రపరిచి పూడిక చేసి అభివృద్ధి చేశాం. గ్రామంలో పెన్షన్లు, ఇళ్ల మంజూరు విషయంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇప్పించాం. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

సమాజానికి అవసరమైన పౌరులను తీర్చిదిద్దుతాం

శివదేవుని చిక్కాల కెవిఆర్ పాఠశాల హెచ్ఎం పి.రాము



శివదేవుని చిక్కాల కెవిఆర్ పాఠశాల



హెచ్ఎం పి.రాము

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

1968లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో చింతలపాటి వరప్రసాద్ మూర్తిరాజు దాతృత్వంతో, గ్రామస్తుల సహృదయంతో స్థాపించిన శివదేవుని చిక్కాల గ్రామంలోని కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాణ్యమైన విద్యతో పాటు సంస్కారం, సృజనాత్మకతకు మార్గదర్శకంగా నిలుస్తోందని ప్రధానోపాధ్యాయులు పి.రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో 292 మంది విద్యార్థులు, 24 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. పాఠశాలలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. పిఎం శ్రీ పథకంలో ఎంపికైన ఏకైక రూరల్ పాఠశాల కెవిఆర్ హైస్కూల్ అని చెప్పారు. ఇప్పటివరకు రూ.4.25 లక్షలతో ప్లే ఫీల్డ్ అభివృద్ధి అయిందన్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం సుమారు రూ.4.50 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశాం. కిచెన్ గార్డెన్ అభివృద్ధితో ఆకు కూరలు, కూరగాయలు పండించి విద్యార్థులకు ఆరోగ్యకరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాం. సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఒకేషనల్ కోర్సులు విజయవంతంగా నిర్వహించి పెద్దల మన్ననలను పొందుతున్నాం. చైతన్య సారథి ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యాధునిక కంప్యూటర్లతో ఏర్పాటు చేసి హైస్కూల్ పూర్తయ్యేలోపు కంప్యూటర్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు పాఠశాలలోనే ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. అత్యధిక పుస్తకాలతో గ్రంథాలయం, భాషా దినోత్సవాలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడు ఐఎఫ్‌పి ప్యానెల్స్, రెండు స్మార్ట్ టీవీలతో డిజిటల్ బోధన అందిస్తున్నామని తెలిపారు. కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ నాణ్యమైన విలువలతో విద్య అందించి సమాజానికి అవసరమైన పౌరులను తీర్చిదిద్దడంలో ముందంజలో ఉన్నామని తెలిపారు.



ఆటలు ఆడుతున్న విద్యార్థులు



ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ప్రత్యేకతను... తన దగ్గర వున్న సంపదను బట్టి కాకుండా... మొత్తం ప్రజల బతుకుల్లో సౌభాగ్యాన్ని నింపడానికి చేసిన కృషిని బట్టి గుర్తించాలి.

- రోబ్ గౌలాండ్,

ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ సిడ్నీ నగర కమిటీ కార్యదర్శి, రచయిత.

నవ్య కవిత్వ వైతాళికుల్లో అగ్రగణ్యుడు శ్రీశ్రీ



ప్రజాకవితా ప్రస్థానంలో మహాకవి శ్రీశ్రీ అగ్రగణ్యుడు. మనకు మహారాజశ్రీలు, బ్రహ్మశ్రీలు చాలామంది శ్రీలు ఉన్నారు. కానీ శ్రీశ్రీ ఒక్కడే. ఈయన్ను కవితాశ్రీ, అరుణశ్రీ, ప్రజాశ్రీ, చైతన్యశ్రీ అని ఏదైనా అనొచ్చు. శ్రీ అంటే అమృతం, శ్రీ అంటే విషం.. వెరసి శ్రీశ్రీ అంటే కవిత్వం అన్నారు ఆరుద్ర. తెలుగు జాతి అత్యంతగా స్మరించుకునే చరణాలు, వాక్యాలు, భాష వీటిలో శ్రీశ్రీ ముందుంటాడు. వేమన, అన్నమయ్య, పోతన .. ఇటువంటి వాళ్ల పదాలు వాడుక భాషలో, జానపద గీతాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత శ్రీశ్రీ పదాలూ చాలా ఎక్కువగా వాడతాం. శ్రీశ్రీ చరణాలు, శ్రీశ్రీ పదాలు, శ్రీశ్రీ ప్రయోగాలు లేని రోజుగానీ మీడియా గానీ సభలు గానీ అస్సలు చూడం. తెలుగుజాతి ఆధునికతకు గురజాడ అప్పారావు అంకురార్పణ చేస్తే, దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి అక్షరాలలో అరుణారుణోదయం తీసుకొచ్చిన మహావ్యక్తి శ్రీశ్రీ. అందుకే శ్రీశ్రీ 'యుగకర్త' అయ్యారు. కొన్ని కవితలు, చరణాలు చెప్పుకోవడమే కాకుండా సమగ్ర చారిత్రక కోణంలో చూస్తే శ్రీశ్రీ ఒక తరానికి, ఒక స్వరానికి, నవచైతన్యానికి ప్రతీకగా మన ముందు నిలబడతాడు.

శ్రీశ్రీ ఏ భావాలకు వ్యతిరేకంగా పోరాడారో, ఏ సమానత్వం, సమ న్యాయం, సామాజిక న్యాయం కోసం, స్వతంత్రత కోసం సామ్యవాద దృష్టితో గొంతెత్తాడో అవన్నీ కూడా సవాలు చేయబడుతున్న ఈ తరుణంలో శ్రీశ్రీ మరింతగా మార్గదర్శకుడు, అవుతున్నాడు. మందగించక ముందుకడుగేయ్.. వెనకడుగు పడితే వెనకేనోయ్ అన్నాడు గురజాడ అప్పారావు. దానికి కొనసాగింపుగా.. 'పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి' అన్నాడు శ్రీశ్రీ. ఇప్పుడు పరమ ఛాందస మతతత్వ శక్తుల దాడి పెరుగుతున్న వేళ ఆ సందేశం మరింత అర్థం సంతరించుకుంటుంది. యాదృచ్ఛికంగా, కృత్రిమంగా భావజాలాన్ని వంటబట్టించుకొని కవి కావాలని అయినవాడు కాదు. స్వతస్సిద్ధంగా అధ్యయనం, అనుశీలన, పరిశీలన ద్వారా చాలా సహజంగా మహాకవి అయిన వ్యక్తి శ్రీశ్రీ. తొలి దశలో రాసిన భావకవిత్వాన్ని పక్కనబెడితే 'మహాప్రస్థానం'లో మొదటి గొప్ప భావగీతం జయభేరి. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను.. నేను సైతం విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధారవోశాను.. నేను సైతం భువనఘోషకు వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను..అని 1934లో 'జయభేరి' మోగించాడు.

మహాప్రస్థానం పరంపరలో మొట్టమొదటి కవిత జయభేరి. ఆ ఏడాదే ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. అప్పుడే అభ్యుదయ భావాలు పెల్లుబికాయి. సొంత లాభం కొంత మానుకు పొరుగువారికి తోడుపడవోయ్ అన్నదానికి నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను... అనేది. నేను కూడా ప్రపంచాగ్నిలో ఉన్నాను అని అర్థం. ఆ తర్వాత భాగంలో మళ్లీ వ్యక్తి పాత్ర కూడా ఉంది. ఎండకాలం మండినప్పుడు గబ్బిలం వలె కాలిపోలేదా.. శీతకాలం కూతపెట్టగా ఆకలేసి కేకలేసేనే.. వానకాలం మురిసిరాగ.. అంటూ మూడు కాలాల్లో ఇలా అల్లాడాను కానీ నిలబడతాను. నేనొకడిని విడిచిపోతే చంద్రగాడ్పులు వానమబ్బులు భూమిమీద భగ్నవుతాయి.. నేనొక్కడిని లేకపోతే జరగదు, నేను కూడా ఈ ప్రపంచంలో జయభేరి మోగిస్తాను అని, చివరకు వచ్చేసరికి నేను సైతం భువనభవనపు బావుటానై పైకి లేస్తాను అని ప్రకటించాడు. వ్యక్తి, వ్యవస్థ రెండింటి సమ్మేళనం ఎలా ఉంటుంది, వ్యక్తి పాత్ర ఎలా ఉంటుంది అని చెప్పడానికి జయభేరి గీతం ఒక ప్రతీకగా, పతాకగా నిలబడింది. భువనభవనపు బావుటానై పైకి లేస్తాను.. కానీ ఈ బావుటా ఏమైంది.. పదండి ముందుకు పదండి తోసుకు అని ముందుకు పోతూపోతూ ఉంటే ఏమైంది ఆ పతాక? ఆ పతాకం ఎర్రబడింది. కనబడలేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు.. హోమ జ్వాలల భుగభుగలు.. ఎర్రబావుటా నిగనిగలు.. ఆ బావుటా వ్యక్తి ఆత్మగౌరవం, ఆశయం, వాటి కోసం నిలబడే లక్షణం ఏమైంది? ఎర్రబారింది ఆ పతాకం. ఆ మహాప్రస్థాన క్రమంలో శ్రీశ్రీ కవిత్వం ఎర్రబారింది. తన కవితలు ఎర్రబడడం కాదు, తెలుగు కవిత్వమే ఎర్రబడింది.

పదండి ముందుకు నదీనదాలు అడవులు కొండలు ఎడారులా మనకడ్డంకి అని శ్రీశ్రీ అన్నప్పుడు.. ఏ అడ్డంకులున్నా ముందుకు పోవాలి. త్యాగాలు చేస్తూ పోవాలి. దారిపొడుగునా గుండెనెత్తురు తర్పణ చేస్తూనే. ఇది శ్రీశ్రీ కవిత రాయడం కాదు, తెలుగు కవిత్వాన్ని పదండి ముందుకు అని పంపించడంలో అది కదిలేదిగా ఉండాలి. ఒక పరిణామ క్రమం ఉంటుంది. స్తబ్దంగా ఉండదు. అందుకే మీడియా, ఆంధ్రపత్రికలను గురించి విమర్శ చేస్తూ.. యథాస్థితికి కంచుకోట ఆస్తికి పోలీసు అంటాడు. యథాస్థితి అలాగే ఉండకూడదు, కదలాలి. కదిలేది, కదిలించేది, మారేది, మార్పించేది, పెనునిద్దుర వదిలించేదిగా ఉండాలని కవిత్వంలో కదలిక తీసుకురావడం అనేది శ్రీశ్రీ గొప్ప విజయం. శ్రమజీవులను, శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదనే కొత్త నినాదం తీసుకొచ్చాడు. ఇలా దేశభక్తి నుంచి, భావ కవిత్వం నుంచి ఇంకా అదనంగా ఒక అడుగు వేయించి సామ్యవాద సమతా చైతన్యాన్ని తీసుకొచ్చి శ్రమజీవికి పట్టంగట్టి శ్రమైక జీవనమే అత్యంత సౌందర్యవంతమైనది అని ఊరికే కాదు కవితాత్మకంగా చెప్పిన వ్యక్తి శ్రీశ్రీ. ప్రపంచపు బాధ అంతా తన బాధగా చేసుకున్నందుకే ఆయన ప్రపంచ కవి అయ్యాడు. ప్రపంచ కవివేనా నువ్వు అని శ్రీశ్రీ తనకు తాను ప్రశ్న వేసుకొని 'నేను మరో ప్రపంచ కవిని' అన్నాడు.

మరో ప్రపంచం అంటే స్వర్గం, వైకుంఠం, కైలాసం కాదు. మానవ లోకాన్ని కావున లోకపుటన్యాయాలు, కాల్చే ఆకలి, కూల్చే వేదనలు, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు, పరిష్కరించే బహిష్కరించే పాటను తీస్తూ, బాటను వేస్తూ నాలో కదిలే నవ్య కవిత్వం అని.. అంటే కొత్త ప్రపంచం నిర్మించడం. మన ప్రపంచమే మరో ప్రపంచం అవుతుంది. ఆ మరో ప్రపంచం పిలుస్తోంది. దానికోసం శ్రీశ్రీ సమాయత్తం చేస్తున్నాడు. దీనికోసం కావాల్సిన పదసంపద, కొత్త భాషను ఆయన సృష్టించాడు. ఇప్పుడు జగన్నాథ రథమో లేకపోతే దగాపడిన తమ్ముడనే మాట ఉంది. శ్రీశ్రీ కంటే ముందు ఆ ప్రయోగం లేదు. కాదేదీ కవితకనర్హం అన్నాడు. ఇప్పుడు కాదేదీ లంచానికనర్హం, కాదేదీ కట్నానికనర్హం, కాదేదీ దోపిడీకనర్హం... ఇలా అంటుంటాం. వీటన్నింటికీ మూలం ఎక్కడ అంటే శ్రీశ్రీ దగ్గరికి వెళ్లాల్సిందే! ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. నరజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహ సిక్తం.. నరజాతి చరిత్ర మొత్తాన్నీ అతి క్లుప్తంగా తేల్చాడు. గతితార్కిక చారిత్రక భౌతికవాదంలో చెప్పిన మొత్తం సత్యాలను శ్రీశ్రీ ఒక్క గేయంలో ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. నరజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహ సిక్తం.. దరిద్రులను కాల్చుకు తినడం.. ఇలా చెబుతూ వచ్చాడు. 'ఇంకానా.. ఇకపై చెల్లదు ' అని చెప్పడం శ్రీశ్రీ కవిత్వం పరమార్థం. ఆ లక్ష్యాన్ని ఆయన చాలా జయప్రదంగా చేరుకున్నాడు. దానికోసం పురాణాలను, చరిత్రను, భాషను, సంస్కృతిని, అంతకు ముందున్న ఆచారాలను.. ఉదాహరణకు కర్మ సిద్ధాంతం మనది. మాయంటావా? మిథ్యంటావా? అన్నీ మిథ్యేనా? మిథ్య కాదు, కర్మ కాదు ఇది నిజం అని స్పష్టం చేశాడు. ఇది మాత్రమే అయితే శ్రీశ్రీని ఇన్నేళ్ల తర్వాత కూడా ప్రజలు తలచుకునేవాళ్లు కాదు. ఏ లక్షణాలనైతే తను సాహిత్యంలో ప్రస్తావించాడో వాటి కోసం పోరాడే శక్తులకు సంఘీభావం చెప్పగలిగిన లక్షణం కూడా శ్రీశ్రీకి ఉంది. మేమే గొప్పవాళ్లం, మాకు పల్లకీలు, సన్మానాలు, శాలువాలు కావాలంటారు. శ్రీశ్రీ అలా కాదు. 'ఈ విశాల జగతిలోన ఏమిటి నే కోరినాను ఒక దోసెడు సానుభూతి.. ఒక పిడికెడు తిరుగుబాటు.. కొంచెం సానుభూతి, కొంచెం తిరుగుబాటు వస్తే చాలు...నాకు అంతకంటే ఇంకేమీ అక్కర్లేదు' అన్నాడు. దానికోసం తిరుగుబాటు చేస్తున్న శక్తులకు నా ఆహ్వానం, వారికి నా సెల్యూట్ అన్నాడు. సెల్యూట్ పెట్టి ఊరుకోలేదు. వాళ్లతోపాటు ఉద్యమంలో పాల్గొన్నాడు. 1955లో కమ్యూనిస్టులు గెలుస్తారన్నప్పుడు అందరూ దాడిచేస్తే శ్రీశ్రీ ఒక్కడే వాళ్లతోపాటు నికరంగా నిలబడినందుకు ఆయన మీద విపరీతమైన దాడి చేశారు. ఆయన తలకు దెబ్బ తగిలి మతి చలించిన పరిస్థితి వచ్చింది. ఆయన బుర్ర కొంచెం చలించి చికిత్స తీసుకున్నాడు గానీ బుర్రలో ఉన్న భాష్యకం మాత్రం చలించలేదు. చికిత్స పూర్తికాగానే మళ్లీ 'పదండి ముందుకు పదండి తోసుకు పోదాం' అని ఆయన వచ్చాడు. చివరి వరకూ ఆ పోరాట పథంలోనే వున్నారు.

కరోనా వచ్చిన తర్వాత వలస కార్మికుల సమస్య వస్తే అందరూ ఎవరిని తలచుకున్నారు? పట్టణంలో బతుకుదామని బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం ఎంత కష్టం.. అని శ్రీశ్రీ రాసిన దాన్నే మళ్లీ ప్రజలు తలచుకున్నారు. ఆందోళన జీవులు అని ప్రధాని మోడీ అన్నప్పుడు అలజడి మా జీవితం ఆందోళన మా ఊపిరి అన్న మహా కవి వాక్యాలను గుర్తు చేసుకున్నాం. అదే ఆయన విశిష్టత. తమ కాలానికి ప్రాతినిధ్యం వహిస్తూ భవిష్యత్తును కూడా చూడగలిగిన వాళ్లు మహాకవులు అన్నాడు శ్రీశ్రీ. అటువంటి దార్శనికతను చూపించగలిగాడు కాబట్టే శ్రీశ్రీ సదా స్మరణీయుడు, అనుసరణీయుడు, వైతాళికుడు.

– తెలకపల్లి రవి

అత్యుత్తమ మార్కుల సాధనకు కృషి

దినకర్ జూనియర్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ సత్యనారాయణ


కరస్పాండెంట్ శ్రీనివాస్


ప్రిన్సిపల్ సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

టెన్త్‌లో సాధారణ మార్కులు వచ్చిన విద్యార్థులతో ఇంటర్ ప్రథమ సంవత్సరం 95 శాతం కంటే ఎక్కువ శాతం మార్కులను తమ కళాశాల సాధించిందని మండలంలోని మార్టేరులోని దినకర్ జూనియర్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ పులిగడ్డ శ్రీనివాస్, ప్రిన్సిపల్ జెపి.సత్యనారాయణ తెలిపారు. గతంలో విజయవంతంగా నడిచిన పూర్ణోదయ జూనియర్ కాలేజీ ప్రస్తుతం దినకర్ జూనియర్ కాలేజీగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో అన్ని కోర్సులతో నడుస్తుందని వారు పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్ ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో 458 మార్కులు సాధించిన పంతుల కావ్య నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిందని అన్నారు. అదేవిధంగా సిఇసిలో ఎం.బిందు మాధవి 416 మార్కులు సాధించడం విశేషమని అన్నారు. తమ కాలేజీలో ఐ ఐటి, మెడికల్ కోర్సుల్లో చేరడానికి వీలుగా ఫాకల్టీతో బోధన చేస్తామని, విద్యార్థులకు మంచి తరగతి గదులు, ప్రయోగ శాలలు ఉన్నాయన్నారు. స్టూడెంట్స్ అందరికీ వంద శాతం ఉత్తీర్ణత, క్రమశిక్షణ, భద్రత తమ కాలేజీ లక్ష్యం అన్నారు.

కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా విద్యాబోధన

జెనిసిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కె.వీరేంద్రబాబు



ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా విద్యా భోదన, క్రమశిక్షణ, నాణ్యమైన విద్యతో తమ విద్యా సంస్థను నడుపుతున్నామని మండలంలోని ఆలమూరు గ్రామంలో ఉన్న జెనిసిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కె.వీరేంద్ర బాబు, ప్రిన్సిపల్ కుక్కల వెంకటేశ్వరరావు తెలిపారు. విశాలమైన ప్రాంగణంలో నర్సరీ నుండి టెన్త్ వరకు ఇంగ్లీష్ మీడియంలో సిబిఎస్ఇ సిలబస్‌లో బోధన చేస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యంతో పాటు చక్కని తరగతి గదులు, కంప్యూటర్స్, సైన్స్ ప్రయోగ శాలలు ఉన్నాయని, క్రీడలకు, ఆటలకు సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సామాన్య విద్యార్థులతో చక్కటి ఫలితాలు ప్రతీ విద్యా సంవత్సరం సాధిస్తున్నామని, క్రమశిక్షణ, ప్రగతి తమ విద్యాసంస్థ సొంతమని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో చక్కని విద్యాసంస్థగా జెనిసిస్ గుర్తింపు తెచ్చుకుందని, ఇందుకు తమ ఉపాధ్యాయుల కృషి కారణమని పేర్కొన్నారు.

కృత్యములతో కూడిన విద్యాబోధన

విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే ధ్యేయం

ఎంజెబి శ్రీగౌతమి యుపి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ జగదీష్‌బాబు



ప్రజాశక్తి - పెనుమంట్ర

స్పార్క్ కాంపస్‌గా విద్యార్థులకు కృత్యములతో కూడిన విద్యాబోధన చేస్తూ, ప్రగతి వైపు దూసుకుని పోతున్నామని పెనుమంట్ర గ్రామంలోని మెయిన్ రోడ్డు పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎంజెబి శ్రీగౌతమి యుపి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.జగదీష్ బాబు తెలిపారు. తన తల్లిదండ్రుల ఆశయం మేరకు రెండు ఎంఎలు, బిఎడ్, లైబ్రరీ సైన్స్ కోర్సులు చదివినా ఉద్యోగం కోసం పోకుండా చిన్నారులకు మంచి భవిష్యత్ ఇవ్వడమే ధ్యేయంగా స్కూల్ నడుపుతున్నట్టు ఆయన తెలిపారు. మండలంలో మొట్టమొదటి ఐఐటి ఒలింపియాడ్ ఫౌండేషన్ స్కూల్ తమదేనని, ఎల్‌కెజి నుండి 7వ తరగతి వరకు చక్కటి తరగతి గదుల్లో, ట్రెయిన్డ్ ఉపాధ్యాయులతో బోధన సాగుతుందన్నారు. త్వరలో 8, 9, 10 తరగతులు ప్రారంభిస్తామని, ప్రస్తుతం పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించామని ఆయన పేర్కొన్నారు. కంప్యూటర్ వినియోగించు విధానం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, విపరీతమైన పోటీ ఉన్నా, తక్కువ ఫీజులతో మంచి విద్య అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

కుదిరితే పరుగెత్తు.. లేకపోతే నడువు.
అదీ చేతకాకపోతే పాకుతూ పో.
అంతేకానీ...కదలకుండా అలా ఒకేచోట ఉండిపోకు..
..శ్రీశ్రీ

తెలుగు జర్నలిజానికి బాటలు వేసిన 'ఆంధ్ర విశారద'

ప్రముఖ సాహితీవేత్తగానూ, చక్కని సినీ రచయితగానూ ప్రఖ్యాతి చెందిన 'ఆంధ్ర విశారద' తాపీ ధర్మా రావుగారు కొత్త తరానికి కావలసిన కొత్త తరహా తెలుగు పత్రికలను అందించిన మేటి పాత్రికేయుడు. ఆయన అనేక పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలను నిర్వహించిన సాహితీ పాత్రికేయుడు. నేటి ఒరిస్సాలోని బరంపురంలో 1887లో జన్మించిన తాపీవారు కందుకూరి వీరేశలింగం ప్రభావంతో సంఘ సంస్కరణ కాంక్ష వ్యక్తం చేశారు. తొలుత గ్రాంథిక భాష పట్ల మొగ్గుచూపారు. మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో 1909లో బిఏ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన ఆయన 1912లో 'కొండెగాడు' అనే పత్రికను నిర్వహించారు. ఆ తరువాత జస్టిస్ పార్టీ అధికార పత్రిక 'సమదర్శిని' ఎడిటర్‌గా నియమితులయ్యారు. రాజకీయాలను సాహిత్యాన్ని సముచిత రీతిలో కలగలిపే వారు.

ఆ తరువాత పిఠాపురం రాజు స్థాపించిన పీపుల్స్ పార్టీ తరపున ప్రారంభించబడిన "జనవాణి" పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. ఆ పత్రికను పూర్తిగా వ్యవహారిక తెలుగులో నిర్వహించిన తొలి సంపాదకుడాయన. 'జనవాణి' ద్వారా ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారు. విదేశీ పత్రికలను సేకరించి, వాటి స్ఫూర్తితో తెలుగు పత్రికకు అనువైన పద్ధతిని రూపొందించే వారు. ముఖ్యంగా గ్రాంథిక భాషను పూర్తిగా విడనాడి జనం నిత్యం పలికే భాషను పత్రికలో ప్రవేశపెట్టారు. ఆ పత్రికలోనే నార్ల వెంకటేశ్వరరావు న్యూస్ ఎడిటర్‌గా పూర్తిస్థాయి పాత్రికేయుడిగా అభివృద్ధి చెందారు. 'జనవాణి' మూతపడిన తరువాత తన అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు 'కాగడా' పేరుతో ధర్మారావు ఒక వారపత్రికను నిర్వహించారు. అది రెండేళ్లు మాత్రమే నడిచింది. కొన్నాళ్లకు 'జనవాణి' పేరిట వారపత్రికను ప్రారంభించారు. అది కమ్యూనిస్టు తదితర అభ్యుదయ శక్తులపై తీవ్ర నిర్బంధ విధానం సాగుతున్న కాలం. అలాంటి పరిస్థితుల్లో జనవాణి పత్రికకు, అంతకుముందు ప్రజాశక్తి దినపత్రికలో పని చేసిన తన కుమారుడు మోహనరావు, బమ్మారెడ్డిగార్లను ఉప సంపాదకులుగా నియమించి, ప్రగతిశీల పత్రికగా వెలుగొందడానికి అవకాశం కల్పించారు. కాటూరు ఎలమర్రుల్లో జరిగిన ఘోర దురంతాలను బట్టబయలు చేయడానికి, కమ్యూనిస్టు తదితర

అభ్యుదయకారుల కార్యకలాపాల ప్రచురణకు అవకాశం కల్పించారు. 'కొండెగాడు', 'కొత్వాల్ సందేహి' అనే మారు పేర్లతో వందలాది వ్యాసాలను రాసేవారు.ఆయన రచించిన పలు విమర్శనాత్మక గ్రంథాలు- 'దేవాలయాల మీద బూతుబమ్మలెందుకు? 'పెళ్ళి-దాని పుట్టుపూర్వోత్తరాలు', 'కొత్త పాళీ' 'ఇనుప కచ్చడాలు' వంటి గ్రంథాలను తెలుగు ప్రజలకు అందించారు. 'మాలపల్లి', 'రైతుబిడ్డ' వంటి సాంఘిక ప్రయోజనంగల చలనచిత్రాలకు సంభాషణలూ రాశారు. ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల మహాసభకు అధ్యక్షత వహించారు. 'తాతాజీ' అని అందరి ఆదరాభిమానాలను మెండుగా చొరగొన్న తాపీ ధర్మారావుగారు 1973 మే 8వ తేదీన కన్నుమూశారు. ఆయన నేటి తెలుగు జర్నలిజానికి రాచబాట వేసిన మార్గదర్శి.

దొందు దొందే..



మన రాష్ట్రంలోని ప్రధాన పత్రికలు రెండు రాజకీయ శిబిరాలుగా చీలిపోయిచాలా కాలం అయ్యింది. ఒకరు అవునంటే మరొకరు కాదనడం అందుకు అనుగుణంగా వార్తలను వండివార్చడంలో పోటాపోటీలు పడుతుంటాయి. పరస్పర యుద్ధ భేరీలు మోగిస్తుం టాయి. అయితే ఈ రెండు శిబిరాలు ప్రజా సమస్య లను, ఉద్యమాలను తమ పత్రికల్లో కనిపించకుండా చేయడంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయంటే ఆశ్చర్యంగా వున్నా అదే సత్యం. ఈ వారంలో రాష్ట్రంలో జరిగిన కొన్ని పరిణామాలు వాటిపట్ల ఈ పత్రికలు అనుసరించిన వైఖరులు గమనిస్తే వీరి ఏకత్వం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోలవరం ముంపు బాధితుల సమస్య అతి ప్రధానమైంది. ప్రకృతి ఒడిలో అతి నిర్మలంగా బ్రతికే గిరిజనులను పాలకులు అభివృద్ధి పేరుతో శాపగ్రస్తులుగా మార్చేసారు. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేని వెలివాడలలో అనాదబిడ్డలుగా వొదలేసారు. ఈ దీనుల పక్షాన నిలవాల్సిన ప్రధాన మీడియా అటువైపు కన్నెతి చూడడంలేదు. ఎప్పుడైనా చూస్తే పోలవరంలో అద్భుతం జరిగిపోతుందని, లేదా అధ:పాతాళానికి దిగజారిపోతుందని రాజకీయ కోణంలో రాయడమేతప్ప ప్రాజెక్టుకు సమిధలైపోతున్న గిరిజనుల బ్రతుకుల గురించి రాసిన పాపాన పోవడం లేదు. అంతరిక్షయానంలో దూసుకుపోతున్న నేటి కాలంలో డోలి మోతల్లో గర్భవతులను తీసుకవెడుతున్న గాథలు, రోజు కిలోమీటర్లకు పైగా నడిచి ప్రాథమిక పాఠశాలకు వెలుతున్న పసిబిడ్డలు, రోగాలతో రొప్పులతో ప్రాణాలు కోల్పోతున్న యువతీ యువకుల గురించి రాయడానికి వీరి కళంలో సిరావుండదు, వీరి పతిక్రల్లో చోటు దక్కదు. ముంపు బాధితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తేవడానికి, పార్లమెంట్‌లో వినిపించడానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, ఉత్తమ పార్లమెంటేరియన్ జాన్ బ్రిటాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గత శని, ఆదివారాల్లో అటవీ ప్రాంతాల్లో పర్యటించాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి చెట్టుకొకరు పుట్టకొకరుగా వున్న గిరిజనుల దరికి చేరి వారి బాధలను పరిశీలించిన వార్తలు ఈ రెండు శిబిరాల ప్రధాన మీడియా సంస్థలకు కనిపించలేదు. జాతీయ పత్రికలు రాసిన తర్వాత కూడా వీరి కనీస కంటిచూపునకు ఆ దీనుల బాధలు నోచుకోలేదు. ఇది ఏదో కాకతాళీయమో, అశ్రద్ధో, నిర్లక్ష్యమో అనుకుంటే పొరపాటు. ముంపు బాధితుల బాధలు రాస్తే దానికి కారణమైన కేంద్రం గురించి రాయాలి, కేంద్ర పాలకుల ఆగ్రహానికి గురికాకుండా వారి కరుణకటాక్షాలు తమ బాసుల మీద కొనసాగేలా చూడడం కోసం గిరిజన బిడ్డల గాథలను అడవికి ఒదిలేశారు.

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు ఊరుమ్మడిగా ఏకమై పోరాడుతున్నారు. తమ గ్రామంలో తాము కలిసి కూర్చొని మాట్లాడుకోవడానికి వీలులేకుండా 30 యాక్ట్ నిర్భందంలో గ్రామస్తులు బ్రతుకుతున్నారు. మా భూమి ఇవ్వం అంటున్నందుకు అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు, ఆ అన్నదాతలకు అండగా నిలిచేందుకు సోమవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు కరేడు గ్రామానికి వెళ్లారు. పరమార్శకు వచ్చిన నాయకులను ప్రజలు కలవకుండా గ్రామాన్ని వందల మంది పోలీసులు చుట్టుముట్టి నాయకులను బలవంతాన అరెస్టు చేసి పోలీసు స్టేషన్స్‌లో రోజంతా నిర్భంధించారు. ఇంత జరిగితే ఈ రెండు మీడియా శిబిరాలకు ఇది ప్రజా వార్తగా కనిపించలేదు. ఏదో ఇచ్చామంటే ఇచ్చామన్నట్లు ఓ మూలకు ఇంత రాశారు. ఇదే భూ సేకరణ మీద గతంలో పేజీల కొద్ది రాసిన వారు ఇప్పుడు దీర్ఘనిద్రలో వుంటే, అప్పుడు కీర్తించిన వారు కాగల కార్యం జరిగిపోతున్నందుకు మౌనదీక్షలో వున్నారు. కారణం ఏ కంపెనీ కోసం భూ సేకరణ జరుగుతుందో ఆ యజమాని ఈ రెండు మీడియా శిబిరాల రాజకీయ శ్రేయోభిలాషులకు అస్మదీయుడు కావడమే.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం కార్మికులు పోరాడుతుంటే అది ఆంధ్రుల హక్కుగా వీరికి గుర్తుకు రావడంలేదు. వేలాది కాంట్రాక్టు కార్మికులను బలవంతాన తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి సాగనంపుతున్నా, 33 యూనిట్లను ప్రైవేటికరిస్తున్న కేంద్రం గురించి రాయకపోవడం దేనికి సంకేతం? అయితే ఓ పత్రిక మాత్రం అప్పుడప్పుడూ ప్రయివేటీకరణ గురించి రాస్తోంది. గత పదకొండు సంవత్సరాలుగా రాష్ట్రానికి అన్ని రకాలుగా తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మరోసారి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్ధతు ఇవ్వడానికి పాలక, ప్రతిపక్షాలు పోటీలు పడుతుంటే ప్రధాన మీడియా కనీసం పల్లెత్తు రాత రాయలేక పోవడం ఆంధ్రుల ఆత్మాభిమానానికి క్షోభ కాదా! నిత్యం సవాళ్ళు, ప్రతిసవాళ్ళు, ప్రాంతాల పేర్లతో పులులు, సింహాలు అంటూ ప్రగల్భాలు పలికే పార్టీల నేతలు కేంద్రం ముందు ఇంతలా సాగిలపడుతుంటే ఒక్క మాట కూడా రాయలేని స్థితికి మీడియా దిగజారడం పాఠకులు హర్షించరని గుర్తించాలి.రౌడిషీటర్ రాసలీలలు, కిలాడి లేడి జిత్తులు, వారల కొద్ది ఒకే వార్తను పేజీల కొద్ది రాయడానికి స్థలం వున్న పత్రికల్లో ప్రజావార్తలకు చోటు దక్కాలంటే పాఠకుల నిశిత విమర్శతో పాటు అక్షరాన్ని నిజంగా ప్రజాపక్షం నిలుపుతున్నదేవరో గుర్తించాలి, వాటిని ఆదరించాలి.

ప్రజాశక్తికి పర్యాయపదం మోటూరు హనుమంతరావు



మోటూరు హనుమంతరావు విప్లవ జీవితంలో విలక్షణ వ్యక్తిత్వాంశాలూ మదిలో మెదులుతాయి. ప్రజాశక్తి స్థాపన, పరిరక్షణ, నిర్వహణ, విస్తరణ అన్నింటితో ఆయనది అవినాభావ సంబంధం. ఆయన ప్రజాశక్తికి పర్యాయపదం. అక్షరాలను ఆయుధంగా చేసుకున్నారు. సమాజంలోని సమస్యల పొట్టచీల్చి ప్రజాకోణాన్ని ఆవిష్కరించారు. సంపాదకుడుగానూ సారథిగానూ సుదీర్ఘకాలంపాటు ఆయన ఈ పత్రికకు ఆద్యుడూ బాధ్యుడూ కూడా.

1917లో గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా వెల్లటూరులో పేద రైతు కుటుంబంలో పుట్టిన ఎంహెచ్ పాఠశాల దశలోనే స్వాతం త్ర్యోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్నారు. 1930 నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్రధారి. 1943 లోనే గుంటూరు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి అయ్యారు. రాష్ట్రంలోనూ దేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఆక్రమించిన ఆ ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్రధారి అయ్యారు. కొరటాల సత్యనారాయణతో సహా ఎందరికో పార్టీ సభ్యత్వం ఇచ్చారు. కళా సాహిత్యాల పట్ల ప్రత్యేకాసక్తి గల ఎంహెచ్ ప్రజానాట్యమండలికి మార్గదర్శకుడుగా ప్రజా కళా సృజనకు దోహద పడ్డారు. శ్రీశ్రీ మొదలుకొని నిన్నమొన్నటి యువ రచయితల వరకూ ఎందరితోనో ఆయనకు అనుబంధముంది. జమున మొదలుకొని శారద వరకూ గుమ్మడి నుంచి మాదాల రంగారావు వరకూ భిన్నతరాల నటీనటులు ఆయనకు సుపరిచితులే. వాస్తవానికి ఆయనలో ఆఖరి వరకూ కనిపించని కళాకారుడుండేవాడు. దిగంబర కవిత్వం నిరసన పేరుతో సభ్యతా ప్రమాణాలను కూడా తోసిపుచ్చే కసిత్వంగా తయారై తర్వాత విరసంలోకి పయనం కట్టినప్పుడు జరిగిన చర్చలో ఆయన పాత్ర చాలా కీలకమైంది. సాహిత్యోద్యమంపై మార్క్సిస్టు అవగాహన పేరుతో ఆయన రాసిన పుస్తకం చాలా విలువైంది.

1948లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడుగా ఎన్నికైన ఎంహెచ్ అనేక కీలకమైన తీర్మానాలూ, నివేదికలూ, పత్రాల రూపకల్పనలో ముఖ్య పాత్రవహించారు. నిర్బంధాల, నిషేధాల మధ్య రహస్యంగా పనిచేస్తూ వీర తెలంగాణా సాయుధ పోరాటానికి సహాయ మందించారు. అప్పటి ప్రజాశక్తి పత్రిక ప్రభుత్వ దాడిలో ధ్వంసమైన తర్వాత 'జనత' పత్రిక తీసుకురావడానికి తొలి సన్నాహాలు చేశారు. ఇంతలోనే 1949 మేలో అరెస్టయ్యారు. నరక కూపాలుగా రాక్షసత్వ కేంద్రాలుగా వున్న నాటి జైళ్లలో కూడా వీరోచిత పోరాటాలలో పాల్గొని అమరులైన వారి సరసనే ఆయనా వున్నారు. 1952లో విడుదలైన వెంటనే రేపల్లె నియోజక వర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు పోటీ చేసి అప్పటి రాష్ట్ర మంత్రి కల్లూరి చంద్ర మౌళిపై విజయం సాధించారు. విశాలాంధ్ర కోసం అనేక కరపత్రాలు, పుస్తకాలు రాశారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభలో ఉప నాయకులుగానూ బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోరాటంలోనూ, తర్వాత కూడా పార్టీ ప్రచారానికి శక్తివంతమైన ప్రచారాయుధాలందించారు. సమైక్య రాష్ట్ర సాధనకై పోరాడుతున్న నాటి సందర్భానికి తగినట్టు 'విశాలాంధ్ర' పత్రికను ప్రారంభించగా 1953 జూన్‌లో ఆయన సంపాదకుడుగా ఎన్నికయ్యారు. నాటి నుంచి అర్ధశతాబ్ది పాటు వెలువడిన పార్టీ పత్రికలన్నింటిలోనూ ఆయన ప్రత్యక్ష పాత్ర వుంది. కారాగారంలో వున్నా రహస్య జీవితంలో వున్నా శాసనసభ్యునిగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్ర, జనశక్తి, ప్రజాశక్తి దిన, వార పత్రికలన్నింటికీ ఆయన జీవనాడి అయ్యారు. రాజకీయ విధానాన్ని సూటిగా వివరించడంలోనూ, కమ్యూనిస్టులపై దుష్ప్రచారాలను శక్తివంతంగా తిప్పికొట్ట డంలోనూ ఆయనది ఒక గొప్ప వరవడి.

యాభయ్యవ దశకంలో కమ్యూనిస్టులపై కాంగ్రెస్ అనేక నీచాతినీచమైన దాడులకు దిగినప్పుడు దాన్ని అక్షరాయుధాలతో వమ్ము చేయడంలో ఎంహెచ్ పాత్ర మరపురానిది. విశ్వవిద్యాలయాల్లో చదువు కోకపోయినా కుటుంబానికి కూడా పాండిత్య నేపథ్యం లేకపోయినా స్వయం కృషితోనే ఆయన భాషా పాటవం పెం చుకున్నారు. జనం లోంచి వచ్చిన మనిషి గనక మాటకు వుండే తూకం ఆయనకు బాగా తెలుసు. అంతకుముందు మద్దుకూరి చంద్రం కూడా సంపాదకుడుగా సులభ శైలిలో రాస్తాడని పేరున్నా ఎంహెచ్ రాజకీయ వాదోపవాదాలలో నిశితమైన వినూత్నశైలి ప్రవేశపెట్టారు. దానికి ప్రాణం వర్గ చైతన్యం కాగా దాని శక్తి రాజకీయ విధానం. మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో తెలుగు భాషను పోరాట భాషగా చేస్తే ఎంహెచ్ కలం రాజకీయ వర్గ చైతన్య భరితమైన భావజాలానికి పద సంపదను సమకూర్చింది. మార్క్సిస్టు మేధావులు పండితులూ అనేక మంది వుండొచ్చు. కాని ఆ భాషను సిద్ధాంత రాజకీయ ప్రచారానికి శక్తిమంతంగా వాడుకోదగిన వారు తక్కువే. ఈ విషయంలో ఎంహెచ్, మాకినేని బసవపున్నయ్య అగ్రగణ్యులు. గ్రామీణ జీవితంలోని సహజ భాషను ప్రాచీన శతకాలు, అధునిక సాహిత్యాలలోని భాషా ప్రయోగాలనూ మేళవించారు. దానికి ఆధునికాంగ్ల పోకడలను కలగలిపారు. అన్నిటినీ మించి మార్క్సిస్టు భావజాలాన్ని మేళవించారు. ఈ ప్రయోగాలతోవారు అతి శక్తివంతమైన రాజకీయ

..24లో







సమాజం కొద్ది మంది మీద ఆధారపడి నడవదు. లేదా అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త, రాజకీయవేత్త.

భారత రాజ్యాంగం మతపరమైన హక్కును, స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఎవరు ఏ మతమైనా అవలంబించవచ్చు.

- నరేంద్ర దభోల్కర్,
సామాజిక కార్యకర్త





తెలుగు పత్రికలకు వారధి ఆంధ్ర పత్రిక



తెలుగులో పూర్తిస్థాయి దిన పత్రికగా ఆంధ్ర పత్రికను స్థాపించి, నిర్వహించిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు చిరకాలం స్మరించుకోదగిన మహా నీయుడు. అంతకు ముందు అనేక మంది కొద్దికాలం పాటు చిన్నా పెద్దా పత్రికలను నెలకొల్పి నడిపించారు. కానీ అవి పత్రికా వ్యవస్థలో రాణించలేక పోయాయి. నాగేశ్వరరావు 1908 ఆగష్టు 8న ఆంధ్రపత్రికను తెలుగు వార పత్రికగా ప్రారంభించారు. ఆయన స్వదేశీ పరిశ్రమలను స్థాపించాలన్న వాంఛతో కోల్‌కతా, ముంబై వంటి నగరాలను సందర్శించి, ముంబయిలో అమృతాంజనం పరిశ్రమను నెలకొల్పారు. తెలుగు వారిలో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించాలనే లక్ష్యంలో ఆంధ్రపత్రికను స్థాపించారు. ఆంధ్రపత్రికను 1914 ఏప్రిల్ 1న మద్రాసుకు తరలించి, దానిని దినపత్రికగా వెలువరించారు. రాజద్రోహం నేరం కింద మూడేళ్ళ కఠినకారాగార శిక్షను అనుభవించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు తో మాట్లాడేందుకు కొందరు భయపడే ఆ రోజుల్లో ఆయనను 'ఆంధ్ర పత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకునిగా నియమించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యజమాని రామ్‌నాథ్ గోయంకా మద్రాసులో 1938లో తెలుగు దినపత్రికగా ఆంధ్రప్రభను స్థాపించే వరకూ తెలుగువారికి ఆంధ్రపత్రిక ఏకైక దినపత్రికగా వెలుగొందింది. ఆంధ్ర పత్రిక ద్వారా తెలుగు ప్రజలను రాజకీయంగానూ, సాంఘికపరంగానూ చైతన్య పరిచారు. అంతేకాదు 'భారతి' అనే చైతన్య పత్రికను కూడా నెలకొల్పి సాహిత్య, సాంస్కృతిక కళారంగాలను ప్రోత్సాహించారు. తన పత్రిక ద్వారా అనేక మంది పాత్రికేయులను, రచయితలను పెంపొందించడానికి సహాయపడ్డారు. దినపత్రికను నిర్వహించడం ఆ రోజుల్లో ఎంతగానో నష్ట దాయకమైనప్పటికీ నాగేశ్వరరావు వెనుకాడకుండా ఆంధ్ర పత్రికను కొనసాగించారు.

తెలుగు ప్రజలకు దిన పత్రికను తొలిసారిగా అందించి మహత్తర సేవలందించిన కాశీనాధుని నాగేశ్వరరావు అత్యంత పూజనీయుడని, ఆయన ఫొటోను ప్రజాశక్తి కార్యాలయంలో ఉంచడం సముచితమని సుందరయ్యగారు సలహా ఇచ్చారంటే ఆయన కృషి పట్ల ఎంతగా గౌరవాభిమానాలు ఉన్నాయో గ్రహించవచ్చు. నాగేశ్వరరావు కృష్ణా, ఉభయ గోదావరులు సంయుక్త నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు పెద్ద మెజారిటీతో ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆయనకు చెందిన దుర్గాభవనం కాంగ్రెస్ కార్యకలాపాలకు నిలయంగా మారింది.

ప్రజాశక్తికి పర్యాయపదం మోటూరు హనుమంతరావు

(23వ పేజీ నుంచి)

భాషను వాడుకలోకి తెచ్చారు. 'తీరు తెన్నులు' పేరుతో ఎంహెచ్ విశాలాంధ్రలో నిర్వహిం చిన శీర్షిక అ ప్పట్లో ప్రసిద్ధం. దారీ తెన్నూ అన్న మాట అంతకుముందు ఎక్కువగా వుం టే దాన్ని తీరు తెన్నులుగా ఆయన వాడుకలోకి తెచ్చిన మాటకు మొదట భాషావేత్తలు అభ్యంతరాలు పెట్టారు గాని ఆచరణలో అదే నిలబడిపోయింది.

విశాలాంధ్ర తర్వాత జనశక్తి కాలంలోనూ ఎంహెచ్ కలం పదునైన రచనలే అందించింది. రాష్ట్రంలో సిపిఎంకు ఆయన తొలి కార్యదర్శిగా ఎన్నికై పద్దెనిమిది సంవత్సరాలు ఆ బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే నగ్జలైట్ విచ్ఛిన్నాన్ని సైద్ధాంతికం గానూ నిర్మాణ పరంగానూ ఎదుర్కొని పార్టీని కంటికి రెప్పలా కాపాడేందుకు అగ్రగామిగా నిలిచారు. వాస్తవానికి 1964, 1968 రెండు సందర్భాల్లోనూ రాష్ట్రంలో సిపిఎం పునాదిని పరిరక్షించడంలోనూ, రాజకీయ వైఖరిని చాటిచెప్పడంలోనూ ఆయనదే ప్రథమ పాత్ర. ఈ పోరాట క్రమంలోనే ఆయన భాష పదునెక్కింది. వర్గ నైశిత్యం ఇనుమడించింది. కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద అతివాదాలకు ఎడాపెడ ధోరణులని ఆయనే నామకరణం చేశారు. సూత్రబద్ధం, కంకణధారులుగా పనిచేయడం, నికరంగా నిలబడటం, సలాం గొట్టడం వంటి పదాలను ఆయన బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. పడికట్టు పదాలు, కమ్యూనిస్టు పరిభాష అని గేలి చేసే అనేకమంది దాని వెనక వుండే సిద్ధాంత బలాన్ని సహించలేకనే అలా మాట్లాడుతుంటారు. కాని మళ్లీ ఆ పదాలనే పట్టుకు వేళ్లాడుతుంటారు! పదాలమధ్య దీరాలివ్వడం ద్వారా అదనపు భావాన్ని స్ఫురింపజేయడం ఆయన విధానం. 'కష్టజీవుల కడుపు గొట్టడం ప్రజాస్వామ్యమూ, దాన్ని ప్రతిఘటించడం ఫాసిజమూనా?' అన్నప్పుడు వేరే వ్యాఖ్య లేకుండానే భావం చేరిపోతుంది. 'వీర తెలంగాణా యోధులు ఎత్తినవి తెల్ల జండాలు కాదు: ఎర్రజండాలు' వంటి శీర్షికలు రాజకీయంగా ఉర్రూతలూపేవి. 'సంక్షోభంలో సంక్రాంతి', 'యువతరానికి వెలుగుబాట సోషలిజం', 'కారు చీకటిలో కాంతిరేఖలు', 'విశాలాంధ్రలో విషాదఛాయలు' వంటి శీర్షికలన్నీ బాగా ఆకర్షించాయి.

1964, 1966లలో కూడా ఎంహెచ్ మళ్లీ జైలు జీవితం అనుభవించారు. 1975-77 మధ్య ఇందిరాగాంధీ ఎమర్జన్సీ కాలంలో కఠోరమైన రహస్య జీవితం గడిపారు. ఆయనను అరెస్టు చేసేందుకు అప్పటి జలగం వెంగళరావు ప్రభుత్వం వారంటు జారీచేసి ఇంటిగోడపై అతికించి కక్షగట్టి వ్యవహరించింది. వాటన్నిటి మధ్య అజ్ఞాత జీవితం గడుపుతూనే ఆయన అత్యవసర పరిస్థితిపై అక్షరాయుధాలు కురిపించారు. 'అంజి' అన్న చిన్నప్పటి పేరుతో ఇందిరా, సంజయ్‌ల నిరంకుశ పాలనను అపహాస్యం చేసే రచనలు చేశారు. సంజయ్ గాంధీని బాలభానుడని కాంగ్రెస్ నేతలు ఆకాశానికెత్తుతుంటే 'రాజు వెడలె' పేరుతో ఆయన వ్యంగ్య రచన చేస్తూ 'అయితే సాయింత్రం కనిపించడు కదా' అని ప్రశ్నించారు! సెన్సార్ నిబంధనలను ధిక్కరించి ప్రజాశక్తి వారపత్రిక వాటిని ప్రచురించడం అప్పట్లో పెద్ద సంచలనం. మరో వైపున ఆ కాలంలోనే సిపిఎం 'రావు' పేరుతో రాజకీయంగా ఉత్తేజం కలిగించే పలు రచనలతో పాటు రోజెన్ బర్గుల జీవిత కథను ధారావాహికంగా రాసి ప్రచురించారు. 1981 అఖిలపక్ష ఉద్యమం సందర్భంలోనూ అదేవిధంగా ఉత్తేజమిచ్చారు. అదే సంవత్సరం ప్రజాశక్తి దినపత్రిక పున: ప్రారంభమైనప్పుడు రాష్ట్రకార్యదర్శిగానూ, శాసన మండలి సభ్యుడుగానూ వుంటూనే పత్రికా బాధ్యతలు కూడా నిర్వహించాలని పార్టీ చేసిన నిర్ణయాన్ని శక్తివంచనలేకుండా అమలు జరిపారు.

ప్రజాశక్తి దినపత్రికను ప్రజలందరి పత్రికగా తీర్చిదిద్దే సందర్భంలో సమతుల్యత దెబ్బతినకుండా చూసేందుకు ఆయన ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. వాస్తవికత, వార్తా ప్రాధాన్యత, రాజకీయ దృష్టి ఏదీ దెబ్బతినకుండా సమాచారం అందించాలని తాపత్రయపడేవారు. 1984లో ఎన్‌టిఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచిన సందర్భంలో సాగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం నెలరోజులూ దానిపైనే సంపాదకీయాలు రాస్తూ వచ్చారు. మరో వైపున ఆ పోరాటంలో ఉపన్యాసకునిగానూ అన్ని చోట్లా పర్యటించారు. ఆయనెప్పుడూ ఈ ద్వంద్వ బాధ్యతా పోషణ చేస్తూనే వచ్చారు. మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలపై దాడులు, హత్యాకాండలు జరిగినప్పుడు హుటాహుటిన తరలివెళ్ళేవారు. అక్కడ దారుణాన్ని ఖండించి రావడంతో పాటు పత్రికలోనూ రాసేవారు. అందుకే ఆయన సవ్యసాచి. రాజీలేని వర్గ పటిమకు మారుపేరైన ఎంహెచ్, దివాళాకోరు ధోరణు లను ఎప్పుడూ సహించేవారు కాదు. 'చచ్చిన చేప వాలున పడి కొట్టుకు పోతుంది.బతికిన చేప ఎదురీదుతుంది' అనేది ఆయన తరచూ చేసే ప్రయోగం. పార్టీపై దుష్ప్రచారం చేసేవారినుద్దేశించి 'గాజుకొంపల్లో కూచుని రాళ్లు రువ్వడం' అనేవారు(అద్దాల మేడలో అనకుండా గాజుకొంప అనడం ఆయన జీవద్భాషలో భాగం) 1986లో ఆయన రాజ్యసభకు ఎన్నికైనా పత్రిక బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. ఇంచుమించు అప్పుడే సోవియట్‌లో గోర్బచెవ్ నాయకత్వం లోకొచ్చాక ప్రవేశపెట్టిన దిగజారుడు విధానాలు ఆయనకు చాలా ఆగ్రహావేదనలు కలిగించాయి. వాటిని ఇక్కడ కొందరు ఆకాశానికెత్తుతుంటే ఆయన వాటి ప్రమాదకర పోకడలను గురించి హెచ్చరిస్తూ వచ్చారు. ధర్మరాజు జూదంలో ద్రౌపదితో సహా అన్నింటినీ పణంగా పెట్టినట్టు గోర్బచెవ్ సోషలిజానికే తిలోదకాలిస్తున్నాడని ముందుగా హెచ్చరించిన వారిలో ఆయన ముఖ్యులు. చివరకు 1991 ఆగష్టులో ఆ దేశమే విచ్ఛిన్నమైన తర్వాత కూడా సోషలిజం అజేయమని దృఢంగా ప్రకటించిన ధీమంతుడు ఎంహెచ్.

ప్రజాశక్తి సంపాదకుడు గానే గాక నిర్వాహక సంస్థ కన్వీనర్ గానూ ఎంహెచ్ దానికి సంబంధించిన ప్రతి చిన్న నిర్ణయం లోనూ భాగస్వామిగా వున్నారు. ఏదైనా లోతుగా పరిశీలించి అన్ని కోణాల నుంచీ ఆలోచించి అడుగు వేయడం తప్ప హడావుడి ఆయనకు తెలియదు. మధ్యలో కొంత కాలం చిక్కులెదుర్కొని పత్రిక నాలుగు పేజీలకు తగ్గినా మళ్లీ నిలదొక్కుకుని మరింత విస్తరణ దిశగా ప్రజాశక్తిని నడవడంలో పార్టీ, పత్రిక సహచరులతో పాటు ఆయన పాత్రా ప్రధానమైంది. రాజకీయ పత్రికలు నడపడం కష్టమన్న మాటను పూర్వపక్షం చేస్తూ ప్రజాశక్తి ఈ రోజు తొమ్మిది ఎడిషన్లుగా వెలువడుతున్నదంటే దీని వెనుక ఎంహెచ్ కృషి అమోఘం. పత్రికతో పాటు అందులో పనిచేసే సిబ్బందిని కన్నబిడ్డల్లా ప్రేమిస్తూ వారి కష్టసుఖాలకు ప్రతిస్పందిస్తూ ఆయన అందరికీ పెద్దదిక్కుగా నిలిచారు. మరోవైపున శ్రుతిమించిన స్వార్థంతో దిగజారిన వారిని అంతే గట్టిగా ఈసడించుకున్నారు.ప్రజా జీవితంలో ప్రమాణాలకు ఆయన పెట్టింది పేరు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా వీసమెత్తు విమర్శలకు ఆస్కారమివ్వకుండా జీవితం గడిపారు. అందుకే ఆయన పట్ల కమ్యూనిస్టులే గాక అన్ని పార్టీల వారూ అమితమైన గౌరవం ప్రదర్శిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోనేగాక దేశవ్యాపితంగానూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని సరైన దిశలో నడపడానికి అంకితమైన అగ్రనేతలలో ఆయన ఒకరుగా నిలిచిపోయారు. 1943లో గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా మొదలైన ఆయన జీవన ప్రస్థానం అరవయ్యేళ్ల పాటు అదే బాటలో అంకితభావంతో నడిచి 1998లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యత్వం వరకూ సాగింది. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడైన ఎంహెచ్ దాని విస్తరణను కళ్లారా చూసి సంతోషించగలిగారు. ఆయన కుటుంబం యావత్తూ ముఖ్యంగా సతీమణి ఉదయంగారు, కుమార్తెలు డాక్టర్లు టాన్యా, ఉష, అల్లుళ్లు రంగారావు, సుధాకర్ తదితరులందరూ కమ్యూనిస్టు ఉద్యమ పథంలోనే కొనసాగారు. ప్రజాశక్తిని, ప్రజా ఉద్యమాన్ని కుటుంబంగా భావించిన ఎంహెచ్ నుంచి స్ఫూర్తి పొందిన వారంతా ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి దీక్షాబద్ధులై వున్నారు.

అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్‌లో అత్యున్నత విద్యా ప్రమాణాలు

ఛైర్మన్ జి.భరద్వాజ నాయుడు



ప్రజాశక్తి - కాళ్ల

అభ్యాస్‌లో అత్యున్నత విద్యాప్రమాణాలతో 2011లో ప్రారంభించామని అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్ ఛైర్మన్ జి.భరద్వాజ నాయుడు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత విద్యా ప్రమాణాలతో కూడిన స్కూల్స్ కేవలం పెద్ద పెద్ద నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితమవుతూ వచ్చాయన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాలలో కూడా అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు కలిగిన స్కూల్స్ అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం పంచాయతీలో అత్యున్నత విద్యా ప్రమా ణాలతో అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్ వెలసిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించే తొలి అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్ విద్యాసంస్థలకు గుర్తింపు లభించినట్టైందన్నారు. గ్రామీణ ప్రాంతంలో అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్ ఏర్పాటు ఉద్దేశ్యం ఆయన మాటల్లోనే..

ప్రశ్న : ఈ ప్రాంతంలో అంతర్జాతీయ స్కూల్ ఆలోచన ఎందుకొచ్చింది?

ఛైర్మన్ : ఆర్థిక స్తోమత కలిగిన తల్లిదండ్రులు మాత్రమే తమ బిడ్డలను ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో చదివిస్తుంటారు. అయితే తమ బిడ్డలను అంతర్జాతీయ విద్యాస్థాయి ప్రమాణాలు కలిగిన స్కూల్లో చదివించాలన్న ఆశ సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారిలో కూడా ఉండడం సహజం. అయితే పట్టణాలు, నగరాలకు తమ బిడ్డలను పంపి చదివించే స్తోమత లేకపోవడంతో మిన్నకుండి పోతున్నారు. అలాంటి వారికోసం గ్రామీణ ప్రాంతంలో ది గ్లోబల్ స్కూలు ఏర్పాటు చేసి, వారికి అందుబాటులో ఫీజులు వుండేలా పెదఅమిరంలో ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న : విద్యా ప్రమాణాలు ఏస్థాయిలో వుంటాయి?

ఛైర్మన్ : అంతర్జాతీయ స్థాయిలో వుంటాయి. అత్యుత్తమ స్థాయిలో విద్యా ప్రమాణాలను అందించడమే మా ముందున్న ఎకైక లక్ష్యం. ఈ విషయంలో రాజీ పడడమంటూ వుండదు.

ప్రశ్న : సిబిఎస్ఇ సిలబస్‌పై మీ ఉద్దేశ్యం ఏమిటి?

ఛైర్మన్ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్ఇ) అనేది ప్రభుత్వ, ప్రయివేటు జాతీయ స్థాయి విద్యామండలి. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా విద్యలో నాణ్యమైన ప్రమాణాలను సాధిం చేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం, టీచర్ల వృత్తిపరమైన సామర్ధ్యాలను నవీకరించడం, సాధికారత కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలు సిబిఎస్ఇ సిలబస్‌లో వుంటాయి.

ప్రశ్న : విద్యతోపాటు ఏయే రంగాలలో ప్రోత్సహిస్తారు?

ఛైర్మన్ : విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తాము. విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ముఖ్యంగా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతున్న క్రికెట్, టెన్నీస్, వాలీబాల్, స్కేటింగ్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, మార్షల్ ఆర్ట్స్, టేబుల్ టెన్నీస్ తదితర క్రీడల శిక్షకుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుంది.

ప్రశ్న : ప్రత్యేక సౌకర్యాలు ఎలా వుంటాయి?

ఛైర్మన్ : స్మార్ట్ బోర్డులతో ఎసి తరగతి గదులు, అద్భుతమైన లైబ్రరీ, కెరీర్ మార్గదర్శక సెట్, కంప్యూటర్ ల్యాబ్, అద్భుతమైన క్రీడా సౌకర్యాలు, విశాలమైన క్యాంపస్, బహుళ ప్రయోజన కార్యాచరణ బ్లాక్ తదితర సౌకర్యాలను కల్పించడం జరిగింది. క్రమశిక్షణను బలపరచడం ద్వారా ర్యాగింగ్‌కు అవకాశం లేకుండా చూస్తాము.

ప్రశ్న : విద్యార్థులకు ఇంకేమి అవసరమని గుర్తించారు..?

ఛైర్మన్ : అన్ని అంశాలలో కూడా ప్రపంచ స్థాయిలో రాణించాలన్నదే తమ ఆలోచన. అంతేకాక నేటి సమాజంలో ప్రపంచ పౌరసత్వం కోసం విద్యార్థులను సిద్ధం చేసే విద్యా అనుభవాన్ని అందించాలన్న అవసరాన్ని గుర్తించడం జరిగింది. ఆమేరకు కృషి చేస్తున్నాము.

ప్రశ్న : విద్యార్థులకు విరామం వుంటుందా?

ఛైర్మన్ : విద్యార్థులకు వారంతంలో విరామముంటుంది. అలాగే భారీ సైజ్ స్క్రీన్ ప్లే ద్వారా ప్రజాధరణ పొందిన చలనచిత్రాల ప్రదర్శన, ముఖ్యమైన క్రీడా సంఘటనల ప్రొజెక్షన్, నెలకోసారి వార్డెన్ల పర్యవేక్షణలో స్కూల్ బస్సులో బోధన సిబ్బందితో కలసి విహార యాత్రలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు విరామం కల్పిస్తాము.



అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్

ప్రశ్న : లక్ష్యాలను ఎలా అధిగమిస్తారు?

ఛైర్మన్ : తమంతట తామే అత్యుత్తమంగా రాణించేందుకు ప్రోత్సహించడం, అందుకు అవసరమైన అభ్యాస వాతావరణాన్ని అందివ్వడం, అంతేకాక శాశ్వత విలువల గురించి తెలియజేయడం తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసి అనుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేస్తాము.

ప్రశ్న : ఇంకేమైనా ఆలోచనలు వున్నాయా?

ఛైర్మన్ : ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన భారతీయ సంస్కృతిపై పిల్లలకు అవగాహన కలిగించడం జరుగుతుంది. ఇందుకోసం భారతీయ సంస్కృతి విలువలు, వాటి స్వరూపం, అలాగే గ్లోబల్ డీమెన్షన్, సమర్థత కలిగిన పాఠ్యాంశాలను అందివ్వడం, భారతదేశ సంస్కృతిని తెలిపే విధంగా పాఠశాల వాతావరణాన్ని సృష్టించడం జరిగింది. మరీముఖ్యంగా ఈ 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మ విశ్వాసాన్ని కలిగించేందుకు ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే కృషి చేస్తాము.

ప్రశ్న : ఫీజులు ఎలా వుంటాయి?

ఛైర్మన్ : తమ అభ్యాస్ ది గ్లోబల్ స్కూల్స్ ఫీజులు సామాన్యులకు సైతం అందుబాటులో వుంటాయి. అంతేకాక సెంట్రల్ సిలబస్‌లో ప్రతి సబ్జెక్టులో ఎంతో నైపుణ్యం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన మా ప్రత్యేకత.

విద్యార్థుల సంఖ్య పెంపొందిచేందుకు చర్యలు

శ్రీచల్లా సత్యనారాయణ శర్మ జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కెఎస్ఎన్.మూర్తి



ప్రజాశక్తి - ఆచంట

గతం కన్నా విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు శ్రీచల్లా సత్యనారాయణ శర్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్ఎన్.మూర్తి అన్నారు. ముందుగా ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఫలితంగా పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతోపాటు గ్రేడులుగా విభజించి విద్యార్థుల మేధస్సుకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటి నుంచే కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాదిలో అద్భుతమైన, అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగిస్తున్నామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు భరోసాగా ఉన్నాయని, ఒత్తిడి లేని విద్యతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

వందేళ్ల చరిత్ర.. బండి ముత్యాలమ్మ సొంతం



ప్రజాశక్తి - మొగల్తూరు

యాత్రికుల కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా బండి ముత్యాలమ్మను ఆ ప్రాంతవాసులు కొలుస్తూ ఉంటారు. ఆ ప్రాంత వాసులకు ఆశీస్సులు అందించేందుకే అమ్మవారు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఇక్కడకు వచ్చారని వారి విశ్వాసం. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మకు సుమారు వందేళ్ల పైబడి చరిత్ర ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉండగా ఈ ప్రాంతంలో రైతుల నుంచి దాసరి వంశీయులు మునసబు, చెన్నా ప్రగడ కుటుంబ వాసులు కరణాలు పన్నులు వసూలు చేసేవారు. అలా వసూలైన సొమ్మును ఇక్కడ నుంచి మద్రాసుకు పడవలపై వెళ్లి చెల్లించి వస్తూ ఉండేవారు. వందేళ్ల క్రితం శిస్తు సొమ్ము చెల్లించేందుకు మునసబు, కరణాలు వెళ్లారు. అక్కడకు వెళ్లేసరికి వీరు తీసుకెళ్లిన శిస్తు లెక్క చాలలేదు. దీంతో ఇరువురు భయాందోళనలతో, కలతతో నిద్రించారు. వారి ఇరువురికి స్వప్నంలో దర్శనమిచ్చిన బండి ముత్యాలమ్మవారు ఆ సమస్య తాను తీరుస్తానని ఈభయం ఇచ్చారు. వారి విశ్రాంతి తీసుకుంటున్న సమీపంలోనే తాను రాళ్ల రూపంలో ఉన్నానని, తమ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. నిద్ర మేల్కొన్న వారు ఇరువురు శిస్తు నగదు లెక్కించేసరికి సరిపోవడంతో దానిని తీసుకెళ్లి బ్రిటిష్ ప్రభుత్వ అధికారికి చెల్లించారు. రాళ్ల రూపంలో ఉన్న అమ్మవారిని మునుసుబు, కరణాలు వెంట తీసుకొచ్చారు. అమ్మవారి సూచనల మేరకు తాటి చెట్టు వద్ద ప్రతిష్టించారు. అప్పటి నుంచి అమ్మవారు కొంగుబంగారంగా ఈ ప్రాంత వాసులను కాచి కాపాడుతూ వారి నుంచి పూజలు అందుకుంటున్నారు. అమ్మవారికి భక్తులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అంగరంగ వైభవంగా జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా తెలుగు ప్రచురణ రంగం

1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన 'విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్' సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యవహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది.

ఏ భాషలోనైనా ప్రచురణ పరిపుష్టంగా ఉంటేనే ఆ భాషా సాహిత్యాలు, సంస్కృతి చిరస్థాయిగా, ప్రామాణికంగా ఉంటాయి. పుస్తక విక్రేతలు, పాఠకులు, ప్రచురణ రంగానికి ఆయువుపట్లు. మన ఆంధ్రదేశ స్థాయిలో అవలోకిస్తే మద్రాసు తదితర ఇతర ప్రాంతాల్లో గ్రాంథిక తెలుగులో పలురకాల తెలుగు పుస్తకాలు వెలువడినప్పటికీ, క్రిష్టియన్ మిషనరీలు తమ మత ప్రచారానికి 1811 అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, బళ్లారి, విశాఖపట్టణంలో ప్రచురణ సంస్థలు ప్రారంభించాయి. ఆంధ్రదేశం వెలుపలనే పలు ప్రచురణ సంస్థలు భిన్నభిన్న తరహాల పుస్తకాలను ప్రచురించాయి. స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో ఆంధ్రదేశంలో కూడా తెలుగు ప్రచురణలు వెలువడడం ప్రారంభమయ్యాయి.

1940లో కృష్ణా జిల్లా పటమటలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం నిర్వాహకులు, రాజమండ్రిలో ఆంధ్రబుక్ డిపో వారు, 1908లో బందరులో ఆంధ్రభాషాభివృద్ధి గ్రంథమాల వారు, 1920లో విజయవాడలో మారుతీరామ్ అండ్ కంపెనీ వారు ఈ తరహాలో ఆంధ్రదేశంలో పలు ప్రాంతాల వారు తెలుగులో పుస్తకాల ప్రచురణలను ప్రారంభించారు. 1931లో గద్దె లింగయ్య విజయవాడలో స్థాపించిన ఆదర్శ గ్రంథమండలి బొందలపాటి శివరామకృష్ణ 1943లో ప్రారంభించిన దేశ కవితా మండలి మొదలైనవి విజయవాడలో పుస్తక ప్రచురణను ముమ్మరం చేశాయి. 1948లో వెంకట్రామ అండ్ కంపెనీ విజయవాడలో ప్రారంభమై విద్యావిషయక గ్రంథాలను విరివిగా ప్రచురించింది. అనతికాలంలోనే వివిధ అంశాల మీద అసంఖ్యాక పుస్తకాలు ప్రచురించి సర్వ తెలుగు పుస్తక విక్రేతలుగా ప్రసిద్ధి పొందారు. 1950లో విజయవాడలో స్థాపించిన నాస్తిక కేంద్రం వారు నాస్తికవాదం, హేతువాద, ప్రచార నిమిత్తం పుస్తకాలను ప్రచురించి తమదైన నూతన ఒరవడిని సృష్టించారు. 1951లో శ్రీనివాస చక్రవర్తి సాహితీ పబ్లికేషన్స్‌ను స్థాపించి సాహిత్యరంగాలకు సంబంధించిన వివిధ ప్రచురణలను వెలువరించారు. 1953లో అన్యభాషా సాహిత్య ప్రక్రియలను తెలుగులోకి తీసుకువచ్చి సంచలనాన్ని పురిగొల్పిన ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్ చిరస్మరణీయ సంస్థగా విజయవాడ ప్రచురణ రంగంలో స్థానం సంపాదించుకుంది. ఈ సంస్థ అధినేత కెఎస్ఎస్ శాస్త్రి ప్రేమ్‌చంద్ శాస్త్రిగా ఘనకీర్తి గడించారు.



విజయవాడ పుస్తక ప్రచురణరంగంలో 1953వ సంవత్సరం సరికొత్త అభ్యుదయ మలుపుకు నాందీవచనం పలికింది. 1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యావహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది. తెలుగు పాఠకులనూ అసంఖ్యాకంగా పెంచుతూ భిన్నభిన్న రంగాల పఠనీయ రుచులను పరిచయం చేసింది. అంతకు పూర్వం తెలుగులోకి రాలేని గురజాడ, గిడుగు ప్రభృతుల రచనలను సాహితీ పాఠకుల సాన్నిహిత్యానికి తెచ్చింది. అంతేకాదు, ప్రపంచఖ్యాతి గడించిన అన్య దేశీయ భాషల ప్రముఖ రచయితల గ్రంథాలను తెలుగు అనువాదాలుగా వెలువరించి తెలుగు ప్రచురణ రంగాన్ని విస్తృతపరిచింది. ఇంతటితో ఏ మాత్రం తృప్తిపడక ప్రచురణను పాఠకుల చెంతకు తీసుకువెళ్లడంలో, పఠనీయతను పెంపొందించడంలో అవిరళ కృషి చేసింది. ఈనాటికీ అగ్రగామి ప్రచురణ సంస్థగా వెలుగొందుతోంది. ఈ మధ్య కాలంలోనే కృష్ణా జిల్లా పరిధిలోనే పలు ప్రచురణ సంస్థలు ప్రారంభమై విజయవాడలో బ్రాంచీలను ప్రారంభించాయి. ఎం శేషాచలం అండ్ కంపెనీ వారు తెలుగు ప్రచురణ రంగంలో వినూత్న విప్లవాన్ని సృష్టించి, ఇంటింటికీ భిన్నభిన్న పఠనీయ గ్రంథాలను సరఫరా చేస్తూ పాఠకుల అభిరుచిని ఎంతగానో పెంచారు. ఈ సంస్థ ఎమెస్కో సంస్థగా రాష్ట్రంలోనేగాక రాష్ట్రేతర ఆంధ్రుల్లో కూడా సాహిత్యాభిలాషను పెంపొందించింది. 1957లో విజయవాడలో నవోదయా పబ్లిషర్స్ స్థాపితమైంది. ఈ సంస్థ 1960 నుండి రామమోహనరావు నేతృత్వంలో అప్రతిహతంగా సాహిత్య ప్రచురణలు చేపట్టింది. ఈషణ్మాత్రం ముద్రారాక్షసాలు లేకుండా ముచ్చటగొల్పే ప్రింటింగ్ టెక్నాలజీ, బైండింగ్‌లతో ఆయన వెలువరించిన గ్రంథాలు యువ పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాల సాహిత్యరంగ ప్రచురణలలో వినూత్న మార్పులను తీసుకువచ్చారు. ఆయన ఆంధ్రదేశంలో నవోదయ రామ్మోహనరావు గానే లబ్ధప్రతిష్టులయ్యారంటే ఆయన తెలుగు ప్రచురణరంగం ఇతోధిక అభివృద్ధికి చేసిన అవిరళ కృషిని ఎవరూ విస్మరించలేరు. తదనంతర కాలంలో విజయవాడలో స్థాపితమైన నవభారత్ బుక్ హౌస్, జయంతి పబ్లికేషన్స్, పల్లవి పబ్లికేషన్స్, ప్రజాశక్తి, అలకనంద ప్రచురణలు మొదలైన ప్రచురణ సంస్థలు తెలుగువారి పాఠకాభిరుచిని ఎంతగానో పెంచాయి. రచయితలు, కవులు సంఖ్యాపరంగా హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ప్రముఖ ప్రచురణ సంస్థలు అనేకం విజయవాడలోనే నెలకొలనడం విశేషం. ఇందుకుగల ప్రధాన కారణాల్లో ఒకటి ముద్రణ, బైండింగ్ తదితర సాంకేతిక సౌకర్యాలు పుష్కలంగా ఉండడం, కొంత సౌలభ్యంగా ఉండడం, పేరెన్నికగన్న పత్రికలకు హైదరాబాద్ నగరం కేంద్రస్థానమైనప్పటికీ తెలుగు ప్రచురణరంగంలో భిన్నభిన్నపుస్తకాల ఆవిష్కరణ విజయవాడలో జరుగుతుండడం గమనార్హం. ముఖ్యంగా నాన్‌ఫిక్షన్ పుస్తకాలకు విజయవాడ ప్రచురణ రంగమే కీలకమైందిగా రూపొందింది. రాష్ట్రస్థాయిలో పుస్తక పరిశ్రమ విజయవాడలోనే దాదాపు 70 శాతం కేంద్రీకృతమై ఉన్నదంటే అతిశయోక్తి కాబోదు. ఆంధ్రదేశంలో అక్షరాస్యత ఉద్యమ ప్రభావానికి విజయవాడ పుస్తక ప్రచురణ రంగం గణనీయంగా దోహదపడింది. కాలక్రమంలో ప్రచురణ సంస్థలతో పాటు పులువురు సాహిత్యకారులు, సాహితీ సంస్థలు, రచయితలు స్వయంగా ప్రచురణ బాధ్యతలను చేపట్టి విజయవాడ ప్రచురణరంగాన్ని తమవంతు బలోపేతం చేశారు. తెలుగు పాఠకలోకంలో లబ్ధప్రతిష్టులైన ఎంతోమంది రచయితల ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ గ్రంథాలు విజయవాడ నుండి ప్రచురితం కావడం మనకు గర్వకారణం.

సాగు భూములు ఆక్వాకు ప్రసిద్ధి

వనామీ సాగుకు అనుకూలం

పాలి కల్చర్ సాగుతో రైతులకు లాభాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గంలో సాగు భూములు ఆక్వాకు ప్రసిద్ధి. నియోజకవర్గంలో సుమారు 40 వేల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. వాటిలో ఆరు వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు. మిగిలిన భూమి అన్నింటిలోనూ చేపలు, రొయ్యల సాగు జరుగుతుంది. పదివేల ఎకరాలలో శీలావతి, కట్ల వంటి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. సుమారు 500 ఎకరాలలో పండుగొప్ప చేపలు సాగు చేస్తున్నారు.



ఆక్వా చెరువు

వనామి సాగు..

ఈ ప్రాంతంలో భూములు ఉప్పు చవుడిగా ఉండడంతో చెరువుల్లోని నీరు కూడా ఉప్పు శాతం ఉంటుంది. దీంతో ఇవి వనామీ సాగుకు అనుకూలంగా ఉంటాయి. సుమారు 23,500 ఎకరాలలో వనామి, నూతనంగా ఆవిష్కరించిన మోనో టైగర్ వంటి రొయ్యలను వేసవిలో సాగు చేస్తున్నారు.



పట్టుబడి చేసిన చేపలు

పాలి కల్చర్..

వర్షాకాలంలో రొయ్యలకు తెగుళ్లు సోకుతూ ఉండడంతో ఇక్కడ రైతులు పాలి కల్చర్ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ఎకరాకు 1000 ఆపైన రకాల చేపలను వేసి 50 వేల వరకు రొయ్య పిల్లలు వదులుతూ ఉన్నారు. దీంతో సాగు వ్యయం తగ్గుతుంది. రొయ్యలకు ప్రత్యేకంగా మేత వెయ్యకుండానే ఎదుగుతూ ఉండడంతో రైతులు లాభాలు గడిస్తున్నారు.

మొగల్తూరు మామిడి రుచే వేరు

తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్





ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మామిడికి రుచి ఎక్కువ. అందుకే ఈ ప్రాంతంలోని మామిడికాయలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. మిగిలిన ప్రాంతాలకు భిన్నంగా ఇక్కడ మామిడి కాయలు నెల రోజులు ఆలస్యంగా కోతకి వస్తాయి. దీంతోపాటు రుచి ఎక్కువగా ఉండడంతో ధరలు కూడా అధికంగానే ఉంటాయి. అయినా మామిడి ప్రియులు కొనుగోలుకు వెనకాడరు.

600 ఎకరాలలో..

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం, సార్వ, లక్ష్మణేశ్వరం, వైఎస్.పాలెం, సీతారామపురం తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.





సాధారణంగా తోటల విస్తీర్ణం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో కాయలను జ్యూస్ కంపెనీలకు తరలిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ కాయలు మాత్రం మొత్తం ప్రజలు తినేందుకే కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇక్కడ నుండి హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ తదితర పట్టణాలకు మామిడికాయలు ఎగుమతి అవుతూ ఉంటాయి.

ఊరగాయలకు..

ఈ ప్రాంతంలోని సాధారణ రకాలతో పాటు పెద్ద రసాలు, కొత్తపల్లి కొబ్బరి తదితర వాటిని ఊరగాయలకు వినియోగిస్తూ ఉంటారు. ఆయా రకాలకి చెందిన ఒక్కొక్క మామిడికాయ డిమాండ్‌ను బట్టి రూ.25 నుండి 50 వరకు కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇక్కడి కాయలతో చేసిన ఊరగాయలు ఏడాది అంతా నిలవ ఉంటాయి. ఇక్కడ కాయలతో చేసిన ఊరగాయలను విదేశాలకు కూడా పంపిస్తూ ఉంటారు.

సాగర తీరం.. కోలాహలం

పేరుపాలెం బీచ్ పర్యాటకానికి ప్రసిద్ధి



సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ పర్యాటకానికి ప్రసిద్ధి. ప్రతి ఏటా బీచ్‌కు వేలాది మంది పర్యాటకులు తరలి వస్తూ ఉంటారు. ఉప్పుటేరు సముద్రంలో కలిసే ముఖద్వారం నుండి తూర్పు తాళ్ల సరిహద్దు వరకు సుమారు పది కిలోమీటర్ల మేర బీచ్ విస్తరించి ఉంది. బీచ్ పొడవునా ఒకవైపు పచ్చని కొబ్బరి సర్వి తోటలు, మరోవైపు ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర అలలు, సముద్రం నుండి వీచే చల్లని గాలులు పర్యాటకులను పరవశింప చేస్తూ ఉంటాయి. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో బీచ్ కు 2 లక్షల మంది వరకు పర్యాటకులు తరలి వస్తూ ఉంటారు. వేసవి ప్రభుత్వ కార్యాలయాల సెలవు దినాల్లో కూడా వేలాది మంది పర్యాటకులు ప్రత్యేక వాహనాలపై బీచ్‌కు వచ్చి సేదతీరుతూ ఉంటారు.


బీచ్ ప్రాంతంలో క్రైస్తవ, హిందూ దేవాలయాలు ఉన్నాయి. ఇక్కడ మతపరమైన ఎటువంటి విధ్వంసాలకు తావు లేకుండా ప్రజలు సామరస్యంగా మెలుగుతూ ఉంటారు. పేరుపాలెం సౌత్‌లోనే కనకదుర్గ బీచ్‌లో 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం, షిరిడి సాయిబాబా ఆలయం, అష్టలక్ష్ములు సమేత మత్స్య నారాయణ స్వామి ఆలయాలు ఉన్నాయి. పేరుపాలెం బీచ్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. కేపీ పాలెం బీచ్‌లో వేలంకిని మాత ఆలయం, రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయాలు ఉన్నాయి.



పేరుపాలెం సముద్ర తీరంలోని కొబ్బరి తోటలు

పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మనం వారి ఆకాంక్షలను గమనిస్తూ వుండాలి. వాటి వెనక వున్న వారి ఆకాంక్షలు అర్థం చేసుకుంటూ వుండాలి. వాటికి మనం చేయూతనిస్తే...ఆ పిల్లలే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు.

- గిజూభాయి, ప్రసిద్ధ విద్యావేత్త.



మాంటిస్సోరి స్కూల్ & జూనియర్ కాలేజ్
Estd. 1986
బ్యాంక్ కాలనీ, తణుకు ఫోన్: 224255, 227556, 9394224255
అనపర్తి ప్రకాశరావు
డైరెక్టర్
2025 పదవ తరగతి పరీక్షా ఫలితాలలో
మాంటిస్సోరి విద్యార్థుల మార్కుల ప్రభంజనం
జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాలలో MPC విభాగం నందు
అత్యధిక మార్కులు సాధించిన మా విద్యార్థులు
T.JIGEESHA MAALYA
H.No: 2510101343
594 /600
J V PRANEETHA
466 /470
T. HARI NAGENDRANADH
465 /470
PSVS NARAYANA
465 /470
I H S KARTHIKEYANI
465 /470
పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు
ఉన్నత ప్రమాణాలతో కూడిన
హాస్టల్ వసతి మరియు రక్షణాత్మకమైన
రవాణ వ్యవస్థ కలదు
విలువలతో కూడిన విద్య-సర్వతోముఖాభివృధి-అత్యుత్తమ ఫలితాలు
వత్తిడిలేని విద్యతో పాటు అన్ని రంగాలలో శిక్షణ ఇస్తూ, సామాజిక సేవ, యోగా, దేశభక్తి విలువలతో కూడిన విద్యను అందిస్తున్న మాంటిస్సోరి



"ప్రజాశక్తి"కి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నరసాపురం పురపాలక సంఘం
పశ్చిమగోదావరి జిల్లా
శ్రీమతి బర్రె శ్రీ వెంకటరమణ
ఛైర్‌పర్సన్
నాగిని కామన
వైస్ ఛైర్‌పర్సన్
కొత్తపల్లి భుజంగరాయులు
(నాని), వైస్ ఛైర్‌పర్సన్
ఎం.అంజయ్య
కమిషనర్, నరసాపురం
వార్డు కౌన్సిలర్లు:
1. సోమరాజు దుర్గాభవాని
2. బర్రి శ్రీ వెంకటరమణ, ఛైర్‌పర్సన్
3. బొంతు రాజశేఖర్
4. మల్లాడి శేషవేణి
5. వన్నెంరెడ్డి వెంకట దుర్గారావు
6. పద్మ పతివాడ
7. కోటిపల్లి సురేష్‌కుమార్
8. బర్రి జయరాజు
9. కస్తూరి ఇందిరాదేవి
10. చిట్టూరి వెంకట పద్మ
11. ద్వారా గంగాభవాని
12. సఖినేటిపల్లి ఉమామహేశ్వరరావు
13. తోట అరుణ
14. కొప్పాడ కృష్ణవేణి
15. బొమ్మిడి సూర్యకుమారి
17. షేక్ యాకూబ్ బీబీ
18. నాగిని కామన, వైస్‌ఛైర్‌పర్సన్
19. కేసరి గంగరాజు
20. వంగా శ్రీకాంత్ కన్నా
21. తాడి సునీత
22. భారతి సురేష్
23. రామసీత కావలి
24. కొత్తపల్లి భుజంగరాయులు (నాని), వైస్‌ఛైర్‌పర్సన్
25. ఎర్ర ఉమ
26. జిల్లెళ్ల దిలీప్‌కుమార్
27. గోరు రమాదేవి
29. సిర్రా కాంతమ్మ
30. అడిదెల జయ శ్యామల
31. పాలూరి నర్సింహారావు
32. ఏడిదకోట సత్యనారాయణ
33. చింతా మాలతి
34. మహమ్మద్ అబేదా సుల్తానా
ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం,
నరసాపురంను సురక్షితంగా ఉంచుదాం!
తడి చెత్త, పొడ చెత్తను వేరువేరుగా ఇవ్వండి - మున్సిపాలిటీ వారికి సహకరించండి.
నీటిని వృథా చేయవద్దు - జననరుల రక్షణ మన బాధ్యత
పచ్చదనం పరిశుభ్రత - నర్సాపురం మున్సిపాలిటీ ధ్యేయం